# కథాంజలి




## గట్టు నారాయణ

తెలుగు అనువాదం :

## గజానన్ తామన్

# కథాంజలి

(ముప్పది ఒక్క కథల సంగ్రహము)

## గట్టు నారాయణ

**Offerings**

ఆంగ్లమూలానికి తెలుగు సేత :

## గజానన్ తామన్

ప్రచురణ :

**శ్రీ సీతారామసేవాసదన్**

తమ్మి చెరువు కట్ట, మంథని,

జి॥ కరీంనగర్ – 505 184.

ఆం.ప్ర.

# KATHANJALI

(A Collection of Thirty one Stories in Telugu).

**GATTU NARAYANA**

First Impression : 1000 Copies.
Year of Publication : March 2003.
Visuals : Rakesh Sri Vatsava
Published by : SRI SITA RAMA SEVA SADAN
T.C. Katta
MANTHANI - 505 184.
Dist. Karimnagar. A.P.

Intended for free use and circulation

*Printed@*

**Satyanarayana Printers**

Tilak Road, Karimnagar.
Cell : 98663 95537

# కథాంజలి

(ముప్పది ఒక్క కథల సంగ్రహము)

**కథాక్రమం**


మనోగతం........................................**i**
పస్పశః........................................**ii - iii**
ఆముఖం ........................................**iv - viii**
1. క కార త్రయం ........................................01
2. భారవహనం ........................................04
3. సాపేక్ష దృష్టి : సమ్యగ్దృష్టి........................................06
4. ఉక్తి : కృతి ........................................08
5. వచన బద్ధత........................................ 10
6. నాతి చరామి ........................................12
7. దానం తక్షణ దేయం ........................................14
8. దానం సమయమెరుగదు ........................................17
9. దానం అమేయం ........................................21
10. దాయా భాగం ........................................25
11. కన్సల్టెంట్ అనగా ........................................27
12. తర్ఫీద్ ........................................29
13. ప్రగతికి చేయూత ........................................32
14. బొమ్మా – బొరుసు ........................................35
15. నేర్వడానికి మార్గం........................................38
16. పరిష్కారం చేయి దాటిన వేళ........................................41
17. ఆలోచించి అడుగు వెయ్యి ........................................44
18. ప్రయాణం : గమ్యం........................................50
19. పరిశీలన : మరో కోణం నుండి ........................................53
20. మీ చేతుల్లోనే మీ భవిష్యత్తు........................................55
21. ఒంటి చేయి అకౌంటెంట్ ........................................57
22. గుఱ్ఱాలు ఎగుర గలుగుతాయి ........................................59
23. మనోధ్యయనం........................................72
24. ఆత్మ నిగ్రహం........................................76
25. దేవుడున్నాడా ? ........................................78
26. ఇందుగలడందులేడని........................................79
27. దేవుడెక్కడ?........................................82
28. వేదన నుండి అనిర్వేదంలోకి ........................................86
29. శ్రద్ధ : విశ్వాసం ........................................94
30. రామాయణం........................................98
31. మహాభారతం ........................................102

# మనోగతం

- నా తల్లిదండ్రులైన కీ॥శే॥ శ్రీ గట్టు రామన్న, కీ॥శే॥ శ్రీమతి గట్టు సీతమ్మ గార్లకు
- పితామహి శ్రీమతి వడవత అన్నమ్మ, మాతామహి ముద్దు అమ్మాయి గార్లకు
- మా గురువర్యులు, ప్రాతఃకాల స్మరణీయులు వై॥వా॥ శ్రీ విద్యానంద ప్రకాశనంద స్వామి వారికి
- మహాభారతంలోని కథలను చెప్పిన పితామహాతుల్యులు కీ॥శే॥ శ్రీ ఎలిశెట్టి లింగన్న గారికి
- వైదుష్య పూర్ణమైన “ఆముఖం” వ్రాసి ఇచ్చిన ఆచార్య సార్వభౌమ బిరుదాంకితులు పరమమిత్రులు డా॥ సుబ్రహ్మణ్యశర్మ గారికి,
- ప్రతికథకు దృశ్యపార్శ్వాన్ని కల్పించిన శ్రీ రాకేష్ శ్రీవాత్సవకు, సంరచన (Graphics) చక్కగా నిర్వహించిన శ్రీ వి. ఉదయకుమార్ గారికి
- కథారచనకు ప్రేరణగా నిలిచిన జీవనభాగస్వామిని సౌ॥ సుజనాదేవికి, కథలను విని ఆనందించి నన్ను ప్రోత్సహించిన మా చిరంజీవులు ప్రదీప్, శైలజ, సుప్రియలకు. ముద్రణప్రక్రియను పర్యవేక్షించిన మిత్రులు అడ్వకేట్ శ్రీ పులి అశోక్ కుమార్, మంథని గారికి
- ప్రచురణ భారాన్ని స్వీకరించిన శ్రీసీతారామాసేవాసదన్ నిర్వాహకులు, ఆప్తులు, డా॥ సువర్ణ లక్ష్మణ్ రావు, డా॥ దుద్దిళ్ళ ఆనంద్ రావు, శ్రీ అవధానుల మురళీధరశర్మ గార్లకు.
- అందముగా ముద్రించి ఇచ్చిన శ్రీ వేంకటరమణ ఆఫ్సెట్ ప్రింటర్స్ యన్.టి.పి.సి., జ్యోతినగర్, అధినేత జడల అంజయ్య గారికి.
- నేను ఆంగ్లములో వ్రాసిన Offerings ను తెలుగు లోనికి ప్రణీతమును చేయుటను ఒక తపస్సుగా, వ్రతముగానెంచి, కథలకు తెలుగు వన్నెలు అసమానాద్భుతాంధ్రాలంకారములను కల్పించి ఆనందాన్ని కలిగించిన గజానన్ తామన్ అన్నగారికి

ప్రేమానుభూతితో...

**గట్టు నారాయణ**

# పస్పశః

ఈ కథాంజలికి ఆంగ్లమూలం ఆఫరింగ్. దీని రచయిత వ్యవస్థాపనాజగత్తులో బహుశ్రుతులైన శ్రీ గట్టు నారాయణ గారు. సంప్రతి: బరోడా వాస్తవ్యులు. ఆర్ష సాహిత్యాన్ని కూలంకషంగా అధ్యయనం చేసి, భారతీయ ఆధ్యాత్మికమూల్యాలను వ్యవస్థాపనావిధానంలో అంతర్లీనం చేసిన మహామనీషి.

జన్మగ్రామమైన మంథిని లోని ఉన్నత పాఠశాలలో విద్యార్థిగా వున్న రోజుల్లోనే కథలు రాసేవారు. ఆయన రాసిన ఓ కథ బుడాన్ సాహసం పాఠశాల వార్షిక పత్రికలో స్థానం సంపాదించుకుంది. పదవతరగతి లో ఉన్న నేను ఆ పత్రికకు సంపాదకునిగా వ్యవహరించాను. కథారచయిత అప్పటి వయస్సు 12 సంవత్సరాలు.

ఆయన తన సఫల జీవితంలో అరువది వసంతాలు చూసిన వేళ, ఆఫరింగ్ కథా సంగ్రహాన్ని యాశ్ పేపర్స్ లిమిటెడ్ – ఫైజాబాద్ (ఉ.ప్ర.) వారు 2001లో ప్రచురించారు. గుజరాతీ, మరాఠీ భాషల లోకి అనూదితమై పఠితల అభిమానాన్ని చూరగొంది.

దీన్ని తెలుగు లోనికి అనువదించ వల్సిందిగా వారు ఇటీవల, అంటే పోయిన నవంబర్, నన్ను కోరారు. జీవించిన అరువదియారు ఏండ్లలో దాదాపు నలుబది ఏండ్లు మహారాష్ట్రలో ఉన్న నాకు సాధ్యమౌతుందా అని సందేహించాను. తెలుగు వాతావరణానికి దూరంగా వున్న వాడు అనువాదంలో తెలుగుదనాన్ని తేవడం కుదురుతుందా?

నా సందేహాన్ని వెలిబుచ్చాను. ఆయన చిరునవ్వు నవ్వి నాకేసి చూశారు. అదే నాకు ప్రేరణయై ఈ పనికి నన్ను నిమిత్త మాత్రుణ్ణి చేసింది. ఏబది సంవత్సరాల క్రితం ఆయన కథకు సంపాదకునిగా వ్యవహరించిన నేను ఆయన దైన ఈ కథా సంగ్రహానికి అనువాదకుణ్ణి అయ్యే సుయోగం రెండవ సారి ప్రాప్తించింది.

మానవుడు, నిటారుగా నిలిచే **(Homo Erectus)** స్థితి నుండి సమాజజీవి (Homo Politicus) స్థితికి చేరుకున్న నాటి నుండి, కథలు చెప్పడం ఆరంభించాడు. సాహిత్యంలోని అన్ని ప్రక్రియల (Mode) కంటే కథాప్రక్రియ యే అతి ప్రాచీనమైనది. ఋగ్వేదంలో, విశేషంగా, దశమ మండలంలో, ఊర్వశీపురూరవుల కథయే కాక ఎన్నో కథలున్నాయి. అలాగే ఐతరేయ బ్రాహ్మణంలో శునశ్శేపుని కథ. గోపథ బ్రాహ్మణంలోని మనువు మత్స్య సంవాదం Old Testament లో Noa of Arc ఆఖ్యాయికగా మనకు సాక్షాత్కరిస్తుంది. పంచతంత్రం క్రీ.శ. ఆరవ శతాబ్దంలోనే సిరియన్ భాషలోకి అనూదితమైంది. ఈ పంచతంత్ర యూరపీయ అవతారమే ఈసఫ్ ఫేబుల్జ్. గుణాఢ్యుని బృహత్కథ ఇప్పుడు లభ్యం కాక పోయినా, ఆ తరువాత వచ్చిన కథాసరిత్సాగరంలో అవే కథలు చెప్పబడ్డాయి.

నాగరికత పెరిగే కొద్ది కవితకు భవిష్యత్తు ఉండబోదని పూర్వం ఎవరో అన్నారు. నవలాస్తమయం 'ఈ శతాబ్దంలోనే' చూడబోతున్నామని కొందరు బుద్ధి జీవులు ఇరువద శతాబ్దం చివరలో సెలవిచ్చారు. స్వరూపం మారినా కవిత మరియు నవల మనను అంటి పెట్టుకొనే ఉన్నాయి. కథాంతం గురించి ఏ మహానుభావుడైనా జోస్యం చెబుతాడేమో వేచి చూడాలి.

తెలుగులో పాలగుమ్మి పద్మరాజు, రాచకొండ విశ్వనాథశాస్త్రి, బుచ్చిబాబు వంటి జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి నార్జించిన కథకు లెందరో వున్నారు. కథ అంటేనే తెలుగు వాళ్ళకు పరమాన్నం వంటిది. ఏ భాషలో వున్నా, దీన్ని చక్కగా అనువదించ గల్గిన తెలుగు అనువాదకులూ వున్నారు.

గట్టు నారాయణ గారి కథల్ని అనువదించే ప్రయత్నం కాళిదాసు నుడివినట్లుగా – హాస్యాస్పదం అవుతుందేమో! కారణం, కథాకథనంలో ఆయన అసాధారణ ప్రతిభావంతుడు.

ఈ సంగ్రహం లోని మొదటి కథ బృ. అ. ఉపనిషత్తులోని కథను తలపించేది. కృష్ణ ద్వైపాయన సృష్టి యైన పాత్రలు, సామాజిక సందర్భాలు మారిన దృష్ట్యా కించిత్ మార్పునకు లోనయ్యి నారాయణుని ప్రతిసృష్టిగా మనముందు నిలుస్తాయి. పాత్ర నిర్మితతోపాటు ఘటనాక్రమాన్ని మాటబొమ్మగా మలవ గల రచయితసామర్థ్యం అక్బరు – బీర్బల్ కథలో చూస్తారు. టాటా వారి అపూర్వసృష్టితో దినేశ్ పడిన ఇబ్బందుల్ని బొమ్మా–బోరుసులో. సమయానుపూర్వంగా, సమయానుసారంగా, సమయానుకూలంగా మనుష్యులు స్పందిచాలన్నది ఆలోచించి అడుగువెయ్యి లో, తాత్త్విక విశ్లేషణ సాపేక్ష దృష్టి–సమ్యగ్దృష్టి లో, మానవ స్వభావాన్ని తెనాలి రామకృష్ణుని కథలో. మనల్ని ఆలోచింప చేసే మరో కథ భారవహనం.

పాశ్చాత్యవిమర్శనాజగత్తులో ఇటీవల ప్రతిపాదితమైన De-Construction సిద్ధాంతానికి అనుగుణంగా మహాభారతాన్ని, రామాయణాన్ని విశ్లేషించిన ఆయన తీరు మనల సమ్మోహితుల చేయక మానదు.

ఈ కథల గురించి చెబుతూ పోతే, మరో గ్రంధమే అవుతుంది. అనువాదకుడు మూల్యాంకనకు పూనుకొనడం, స్వీయక్షేత్రాన్ని వదిలి, విమర్శనా క్షేత్రాన్ని అతిక్రమించడం అవుతుంది. అందువల్ల సెలవు కోరుతూ ఇంతటితో విరమిస్తాను.

భవత్స్నేహాంకితుడు
గజానన్ తామన్

సేవానివృత్త
స్నాతకోత్తర ఆంగ్లవిభాగ ప్రముఖుడు,
ప్రాచార్యుడు,
4–35, తమ్మిచెరువు కట్ట,
మంథని, జి॥ కరీంనగర్, ఆం.ప్ర.
✆08729–259600
చిత్రభానుమార్గశీర్ష శుద్ధపంచమి, సోమవారం. 9 డిసెంబర్ 2002

# ఆముఖం

**"ఆచార్య సార్వభౌమ"**

## ఆచార్య వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి

ఎం.ఏ. (తెలుగు), ఎం.ఏ. (సంస్కృతం) పి.హెచ్.డి.

**తెలుగు శాఖ (రిటైర్డ్)**

**ఆంధ్రవిశ్వ కళా పరిషత్, విశాఖపట్నం – 3.**

కథ అంటే చెప్పబడేది అని అర్థం. **"కథ్యతే ఇతి కథా"** అని వ్యుత్పత్తి. మానవుని మేధ వికసిస్తున్న తొలిదశలో పొడమిన ఊహలు కథారచనకు ప్రేరకాలు. కథ మొదట మౌఖికదశలో ఉంటుంది. అనంతరం అక్షరాకృతి ధరిస్తుంది. కథయొక్క క్రమపరిణామమే కావ్యేతిహాసరచనాప్రాదుర్భావానికి పరమాధారం.

అగ్నిపురాణం లో గద్యకావ్యాలు (1) ఆఖ్యాయిక (2) కథ (3) ఖండకథ (4) పరికథ (5) కథానిక అని అయిదు విధాలు అని ఇలా పేర్కోబడింది.

ఆఖ్యాయికా కథా ఖండ కథా పరికథా తథా !

కథానికేతి మన్యంతే గద్య కావ్యం చ పంచధా !!

విస్తృతమైన కల్పితేతివృత్తంతో రచింపబడిన గద్యకావ్యం కథ అనిపించుకొంటుంది. స్వరూపంలో చిన్నది కథానిక, చిరకాలంగా లోకప్రసిద్ధిని పొందిన చిన్న చిన్న కథలు కథానికలుగా పరిగణింపదగ్గవి. ఆ కథానికస్వరూపస్వభావాలు కూడా అగ్నిపురాణంలో ఇలా వివరింపబడ్డాయి.

భయానకం సుఖతరం గర్భేచ కరుణో రసః!

అద్భుతోచితే సుక్లుప్తార్థా నోదాత్తా సా కథానికా !!

స్వరూపంలో ఇది చిన్నది. భయానకరసంతో కూర్పబడి చదువుకోడానికి ఉద్వేగాన్ని కల్గింపక సుభావహంగా ఉంటుంది. కరుణరసం మధ్యలో పోషింపబడుతుంది. అద్భుతంతో అంతమౌతుంది. కథాంశాలు క్లుప్తంగా కూర్పబడుతాయి. ఇతివృత్తం ఉదాత్తంగా ఉండదు. అంటే ఏ మహారాజ చరిత్రకో, ఏ పురాణపురుషుని జీవితానికో సంబంధింపదు. ఈ లక్షణాలు స్థూలదృష్టితో చెప్పబడ్డవే గాని, కథానిక ఇలాగే ఉండాలి అని శాసించడం సాధ్యంకాని పని. భారతదేశంలో చరిత్రకందని కాలం నుండి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నట్లు ఆధారాలు కనబడుతున్నాయి. వేదకాలంలోని కథారచనయొక్క అస్తిత్వాన్ని యమయమీసంవాదం, శునశ్శేపుని కథ, నచికేతుని కథ, వంటివి నిరూపిస్తున్నాయి. భారతీయ కథావాఙ్మయం అనగానే పంచతంత్ర కథలు స్ఫురణకు రాక తప్పవు. అవి

ప్రపంచపరివ్యాప్తములయినవి. పంచతంత్రం అందలి కథలు విడివిడిగానో ప్రపంచం నలుమూలల ప్రసరించి ప్రసిద్ధి పొందాయి. బైబిలు తర్వాత పంచతంత్రమే ఎక్కువ ప్రపంచ భాషలలో అనూదితమైనట్లు పాశ్చాత్య సాహిత్యవేత్తలు కూడా అభిప్రాయపడ్డారు. భారతభాగవతాదులలోని ఉపాఖ్యానాలన్నీ ఒకప్పుడు కథలుగా లోకప్రచారాన్ని పొందినవే.

ఆధునికాంధ్రసాహిత్యంలో కథానిక అనేది ఒక విశిష్ఠసాహిత్యప్రక్రియగా ప్రచార ప్రసిద్ధులని సంతరించుకొంటుంది.

అది ఆంగ్ల సాహిత్య మందలి Short Story నుండి ఆవిర్భవించినట్లు అంగీకరింపక నేటి కథానికారచనయొక్క సర్వతోముఖవికాసానికి పాశ్చాత్యసాహిత్యమందలి Short Story అనేది ప్రధాన ఆలంబనమనడంలో విప్రతిపత్తి లేదు.

ఇతివృత్తంలో వైవిధ్యం ఆధునిక కథానికావ్మాయంలోని విశేషాంశంగా గుర్తింపవచ్చును. కాని లోకవృత్తి చిత్రణం ప్రాచీనాధునికకథానికల రెండింటను సమానమే ప్రాచీనమైన కథ నీత్యుపదేశ ప్రధానంగా రచింపబడింది. దయనీయమైన సామాజిక జీవన విధానచిత్రణప్రధానంగా నేటి కథనికాసాహిత్యం తీర్చిదిద్దబడుతోంది. రచయిత లోకవు దౌర్ధత్యస్థితిని పాఠకుని అనుభవంలోకి వచ్చేటట్లు చిత్రించి ఊరుకొంటాడు. తద్వారా ఎలా ప్రవర్తించాలో ఎలా ప్రవర్తింపరాదో పాఠకుడే నిర్ణయించుకోవలసి యుంటుందని నేటి కథానిక రచయిత ఆశయం.

ఆంధ్రదేశంలో కరీంనగర్ జిల్లాలో వేదశాస్త్రపురాణప్రవీణులచే ప్రసిద్ధిగాంచిన మంథెన అనే అగ్రహారంలో జన్మించి గుజరాత్ రాష్ట్రంలో స్థిరపడిన శ్రీ గట్టు నారాయణ గారు విశిష్ఠపురుషులు. వృత్తిరీత్యా, ఇంజనీరింగు శాఖకు చెందినవారు ఉద్యోగరీత్యా కంపెనీ మేనేజ్మెంట్కి సంబంధించిన వారు. ప్రవృత్తి రీత్యా నిత్యజిజ్ఞాసువులు, ఆధ్యాత్మిక సంస్కార సంపన్నులు. ఆత్మజ్ఞానైకరతులు. నిష్కామకర్మయోగులు. పరమసాధుస్వభావులు మహోదార చరితులు. ఉపనిషత్తులు, భగవద్గీత మొదలైన వేదాంతగ్రంధాలను అధ్యయనం చేసి వేదాంతతత్త్వాన్ని ఆపోశనపట్టి భారతదేశంలోనే గాకుండా పాశ్చాత్య దేశాలలో కూడా ప్రసంగాల ద్వారా ఉత్తమ రచనల ద్వారా జీవిత చారితార్థ్యాన్ని పరిపూర్ణంగా అనుభవిస్తున్న సార్థకజన్ములు.

శ్రీ గట్టు నారాయణగారు అరవై వసంతాలని ఎన్నడో అధిగమించినవారు. వద్దన్నా వయస్సు అందరికి ముందుకు దూసుకునేవెళ్తూ వుంటుంది. కొందరు మాత్రమే వయస్సు యొక్క గమనంతో పాటు లోకపు తీరుతెన్నుల్ని చక్కగా అవగాహన చేసుకుంటూ, తమ జీవితాన్ని తరింపజేసుకుంటూ ఇతరుల జీవితాల్ని తరింపజేయడానికి పూనుకుంటారు. "స్వయం తీర్వా పరాం సారయతి" అని ఆర్యోక్తి. అటువంటి మహాపురుషులు శ్రీ గట్టు

నారాయణగారు. వారు లోకహితాచరణైకజీవనులు కాబట్టి 'నారాయణగురూజీ' అని ప్రసిద్ధి పొందినారు. అంధకారాన్ని నిరోధించి జ్ఞానదీపాన్ని ప్రజ్వలింప జేయడం చేత గురు శబ్దం నిష్పన్నమయిందని ఇలా విద్వన్నిర్ణయం.

గుకారోప్యంధకార స్యాత్ రుకారస్తన్నిరోధకః!

అంధకార నిరోధిత్వాత్ గురురిత్యభిధీయుతే!!

కంపెనీ నిర్వహణలో అధికారులకు ఉద్యోగులకు సామరస్యాన్ని చేకూరుస్తూ, సదుపదేశం ద్వారా ఎందరి జీవితాలతోనో తరంపజేస్తున్న శ్రీ నారాయణగారు గురుశబ్దానికి సార్థక్యం చేకూరుస్తున్న ధన్యజీవులు.

పెక్కు వేదాంత గ్రంథాలు రచించిన శ్రీ నారాయణ గురూజీ కంపెనీలని నడుపుతున్న వారినీ, వాటిలో ఔద్యోగిక జీవితాన్ని గడుపుతున్న వారినీ సంస్కార సంపన్నుల్ని చేయాలని సంకల్పించి, ఏ విషయాన్ని అయినా కథారూపంలో అందిస్తే పాఠకుని హృదయంలో అది స్థిరంగా నిలబడుతుందని గుర్తించి, మృదుమధురగంభీరమైన ఆంగ్లభాషలో కొన్ని కథలను రచించినారు. అవి 1. Offering-1, Offring-2 అనే పేరుతో రెండు సంపుటాటుగా ప్రచురింపబడ్డాయి. (1) కార్యనిర్వాహణ (మేనేజ్మెంట్) 2) నాయకత్వం (లీడర్షిప్) 3) జీవితం (లైఫ్) అనే మూడు ప్రధానాంశాల మౌలికత్వాన్ని లోకానికి అందించడం పరమ ప్రయోజనంగా ఆ కథలన్నీ రచింపబడ్డాయి. అవి మేనేజ్మెంట్లో మూడున్నర దశాబ్దాల నారాయణగారి జీవితానుభవాన్ని వ్యాఖ్యానిస్తున్నాయి. ఆ కథలు గుజరాతీ, మరాఠీ భాషలలోనికి అనువదింపబడడం ఆ కథారచనాప్రాశస్త్యాన్ని వెల్లడిస్తోంది.

ఆధ్యాత్మవిద్యావిశారదులు, సంస్కృతాంధ్రాంగ్ల మరాఠీ హిందీ సాహిత్య విద్వన్మణులు శబ్దార్థప్రయోగదక్షులు అయిన శ్రీ గజానన తామన్ శ్రీ గట్టునారాయణగారి ఆంగ్ల కథలని "కథాంజలి" అనే గ్రంథంగా ఆంధ్రీకరించి లోకానికందించడం పరమహర్షదాయకం. కథాంజలి ముప్పయిఒక్క కథల సంపుటి. ఆ కథలు వైవిధ్యప్రధానమైనవి. నిశితంగా, వాటిని విశ్లేశించి సమీక్షిస్తే 1) యుక్తి ప్రధానమైనవి. (2) బుద్ధివికాసాన్ని కలిగించేవి (3) విజ్ఞానాన్ని ఇచ్చేవి (4) వేదాంతాన్ని బోధించేవి (5) కర్తవ్యాన్ని ఉపదేశించేవి... ఇలా ఎన్నో విధాలుగా అవి గోచరిస్తాయి. ప్రతికథ జీవితాన్ని సరిదిద్దుకోవడానికి ఆవశ్యకమైన ఉత్తమనీతిని బోధించడం కోసం రచింపబడిందే కథాసర్వస్వానికి జీవమనదగ్గ నీతి కథాంశంతో పేర్కోబడడం విశేషం.

ఒక మహాకవి "కత్తిపై సాములనువాద కావ్యరచన" అని అనువాదరచనలోని క్లేశాన్ని చక్కగా విశదీకరించినాడు. ఒక భాషలోని సొగసులను మరొక భాషలోనికి తీసుకొని రావడం సులభసాధ్యం కాదు. శ్రీ గజాననశర్మగారు ఆంగ్లాంధ్ర భాషలలో నిష్ణాతులు

కాబట్టి ఆంగ్లంలో రచింపబడిన శ్రీ గట్టు నారాయణగారి కథలని హృద్యానవద్యంగా, సుమహోమనోహరంగా, సహృదయహృదయంగమంగా ఆంధ్రీకరించి కృతకృతులైనారు

అనువాద మనునది ఒక కళ. ప్రతి వ్యక్తికి పట్టుబడేది కాదు. పాఠకుడు ఆ గ్రంథం ఒక అనువాదమని భావింపకుండా ఉండేటట్లు ఒక స్వతంత్ర గ్రంథంగానే చదువుకొనేటట్లు రచింపగల్గినప్పుడే ఆ అనువాదము చిరకాలం నిలుస్తుంది. పాఠకుడికి లేశమాత్రంగా అయినా అనువాదమనే అభిప్రాయం పొడసూపినట్లయితే ఆ అనువాదం ఆస్వాద్యం కాదు. కవిత్రయం వారి భారతానువాదం, పోతనగారి భాగవతానువాదం అనువాద గ్రంథాలు అనిపించవు. స్వతంత్రతాబంధురంగానే రచింపబడ్డాయి. కాబట్టి నేటికే గాదు ఏనాటికైనా ఆంధ్రభాష సజీవంగా ఉన్నంత కాలం ఆ గ్రంథాలు ఆదరింపబడతాయి. శ్రీ గజాననశర్మగారి కథాంజలిలోని కథలు కూడా ఆ కోవకు చెందిన రచనలే. వారు శ్రీ గట్లు నారాయణగారి కథను యథాతథంగా ఆంధ్రీకరించినవారు కారు. కథాతత్వం చెడిపోకుండా పోషిస్తూ, కథలని స్వతంత్ర రచనలుగానే రచించినారు. కాబట్టి ఆసక్తిదాయకంగా రచింపబడ్డాయి.

గ్రంథానికి “కథాంజలి” అనే పేరు శ్రీ గజాననశర్మగారు పెట్టిందే. అది "Offering" అనే ఆంగ్ల నామానికి అనువాదం కాదు. స్వీయకథాసంపుటికి నామకరణంం చేసినట్లే భాసిస్తోంది. అంతేకాదు, ఆంగ్ల గ్రంథంలోని కథల పేర్లని కూడా శర్మగారు యథాతథంగా అనువదింపలేదు. కథాతత్త్వాన్ని బట్టి పాఠకుడికి ఉత్సుకతుని పెంచేటట్లు చక్కగా ప్రతికథకు చిన్న చిన్న శీర్షికలు ఇచ్చినారు. “కకారత్రయం” “భారవహనం” “నాతిచరామి”, “బొమ్మాబొరుసు”, “దేవుడెక్కడ”, మొదలైనవి. కథలకు పేర్లు పెట్టడంలో శ్రీ శర్మగారి ప్రతిభను నిరూపిస్తున్నాయి.

కథలలోని భాష సర్వజనసుగమమైనది భావవ్యక్తీకరణం వైశద్యప్రధానంగా సాగింది. వాక్యరచనావిన్యాసం తెనుగుదనాన్ని చక్కగా పోషిస్తుంది. ‘తు.చ. తప్పక,’ ‘తుంగలో త్రొక్కి’ ‘చీపురుపుల్లయినా బైటికి పోనీకుండా’ ‘మెరుపుతీగల్లా తళుక్కుమనే కత్తులను’ ‘పూలతో నిలువెల్లా ముస్తాబై’ ‘సుఖంగా ఉన్న ప్రాణాన్ని దుఖాఃన వేసుకోవడం అంటే ఇదే’ మొదలైన వాటిలో తెనుగుభాషకు చెందిన నుడికారం వెల్లి విరుస్తోంది. ‘హాస్యకేదారాలలో రాజనాలు పండించడంలో అసమాన కృషీవలుడు’ మొదలైన వాక్యాలలో కవితా ధోరణి ప్రస్ఫుటమౌతుంది.

శ్రీ గట్టు నారాయణగారి కథా రచనలలో వారు కథాంతంలో రచించిన నీతి వాక్యం ఆ కథకు ఎంతో అందాన్ని చిందిస్తోంది. ఆ వాక్యాలు శ్రీ నారాయణగారి బహుముఖ లోకజ్ఞతని ఆంగ్లభాషా వైదుష్యాన్ని చెప్పక చెప్తున్నాయి. శ్రీ గజాననశర్మగారు శ్రీ గట్టు నారాయణ గారికి ఏమాత్రం తీసిపోని విధంగా, ప్రతిభను ప్రదర్శిస్తూ తెనుగు కథల

చివర వాఖ్యాలను రచిస్తూ, తమ స్వతంత్రరచనాసామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. ఉదాహరణకి కొన్ని వాక్యాలు : Attachment in the mind is more sticky than physical attachment. దేన్ని అంటుకునేది ఎద్దైనా అట్టే కాలం నిలువదు. మనస్సునంటుకునేది ఏదైనా మట్టిలో కలిసేంత వరకు వదలదు.'

**II) Thinking to gether,**
**Working to gether,**
**Earning together,**
**Sharing together,**
**offer and receive.**

**సంగచ్ఛధ్వం సంవవదధ్వం సంవో మనాంసి జానతామ్**
**దేవాభాగం యథాపూర్వే సంజనానా ఉపాసతే ॥** ఋ.వే - 10-12-191

**నీకు అన్నీ సాధ్యమే - కారణం తత్త్వమసి ।** ఛాందోగ్యోపనిషత్తు

ఈ విధంగా నీతి వాక్యరచనతో శ్రీ గజాననశర్మగారి స్వతంత్రత వేదపాండిత్యమూ వ్యక్తమౌతున్నాయి. అనువాదబంధం నుండి కథను తప్పించి, జీవకళతో ప్రకాశింపజేస్తున్నాయి.

శ్రీ గట్టు నారాయణగారి ఆంగ్లకథాపరమార్థాన్ని పరిపుష్కలంగా పోషిస్తూ తెనుగుదనం ఉట్టిపడేటట్లుగా, తమ ప్రత్యేకతను నిలుపుకొంటూ, ఆంధ్రీకరించిన గజానన తామన్గారు సర్వజన సమభినంద్యులు.

సహృదయులు కథలు చదివి ఆస్వాదించి ఆనందింతురు గాక!

"ఇతిశమ్"

**వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి**

10-01-2003

**"శారదాపీఠం"**
46-15-35, మండావారి వీధి,
విశాఖపట్నం - **530 016,**
ఫోన్ : **2541003.**

# 1. క కార త్రయం

**(దేవ, దైత్య, మానవుల కథ)**

**స**కల చరాచర సృష్టికి పూనుకుని బ్రహ్మ మొదట దేవతలను, పిదప దైత్యులను, ఆ పిదప మానవులను సృజియించాడు.

ఈ మూడు వర్గాలు విడిగా సమావేశమై తమ తమ విధ్యుక్తధర్మా లేమిటో విపులంగా చర్చించాయి.

దేవతా వర్గం సుదీర్ఘ మంతనార్థం సమావేశమైంది. మన అస్తిత్వానికి లక్ష్యమేమిటన్న విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనందున, విస్పష్టంగా కార్యప్రణాళికను నిర్వచించుటలో విఫలమై జగత్కర్తను అడిగి తెలుసుకొనడమే మేలనే నిర్ణయానికి వచ్చింది. **"నాన్యఃపంథా విద్యతే"** తత్క్షణమే వేల్పులు సత్యలోకస్థితుడైన నలుమోముల విరంచి ముందు ముకుళితహస్తులై నిలచి, ఇలా అభ్యర్థించారు.

దేవతలు : "అయ్యా! మీ సందేశం ఏమిటి?"

జగత్పిత సమాధానం : **"క"**

దేవతానుసరణం చేసే మానవులు సమావేశమై తాము భూమిపై చేయ వలసిన దేమిటో తామే నిర్ణయించుకునే బదులు బ్రహ్మలోకానికి వెళ్ళి ఆయననే అడిగి తెలుసు కోవడం మేలని నిర్ణయించుకుని బ్రహ్మ దగ్గరకు వెళ్ళి, బద్ధాంజులులై ఇలా అడిగారు.

మానవులు : "అయ్యా! మీ సందేశం ఏమిటి?"

జగదధినేత సమాధానం : **"క"**

దేవతలను తమ ప్రత్యర్థులుగా పరిగణించే దైత్యులు తమ వంతు కార్యాన్ని నిర్వచించుటలో విఫలురై బ్రహ్మ దగ్గరకు వెళ్ళి ఇలా అన్నారు.

"మీ సందేశం ఏమిటి?"

బ్రహ్మ సమాధానం : **"క"**

బ్రహ్మముఖోద్గతబీజరూప "క"కార శబ్దానికి అర్థనిర్ణయనిమిత్తం, దేవతాబృందం మరో మారు నందనోద్యానంలో సమావేశమయ్యింది. అన్ని కోణాల నుంచి వైచారికమంథనం జరిపిన మీదట "క"కారమునకు **"కరుణ"**యే అభిప్రేతార్థమని నిర్ణయించుటలో ఐకమత్యాన్ని సాధించింది.

బ్రహ్మదేవుని ఆదేశానుసారం, దేవతలు సర్వభూతహితరతులై, కరుణానురాగాలతో ఓతః ప్రోతమైన మానసాలతో, సత్కర్మాచరణకు ఉద్యమించారు. పర్జన్యాన్ని ప్రసాదించి నదీనదులను మాధుర్యోపేత జలాలతో ప్రవహించేవిగా చేశారు. పచ్చదనాన్ని సప్త ద్వీపా వసుంధర పై పరిచారు.


క
క
కరుణ
BRAMHA
దేవతలు
మానవులు
దైత్యులు

వారి మానోవృత్తి కరుణకు పర్యాయపదమైంది.

ఆ తరువాత మానవులు ఒకచోట సమావేశమైనారు. బ్రహ్మదేవుని "క"కార రూప సందేశాన్ని లోతుగా పరిశీలించి 'క' అంటే కర్మయని సర్వానుమతంగా నిర్ణయించారు. కొందరు కృషికి, కొందరు పశుపాలనకు, మరికొందరు వాణిజ్యానికంకితమయ్యారు. కొందరు కుంభకారాది వృత్తులను చేపట్టారు. కొందరు తపఃస్వాధ్యాయాన్నే జీవనపరమావధిగా ఎంచుకున్నారు. జనపద రక్షణార్థం కొందరు క్షాత్ర ధర్మాన్ని స్వీకరించారు. వారి మనోవృత్తి నిరంతర కర్మాభిముఖమయ్యింది.

దేవతలూ, మానవులూ సమావేశమై కార్యప్రణాళికను నిర్ణయించుకున్నారన్న వార్త దైత్యులు ఆలస్యంగా అందుకున్నారు. వాదోపవాదానంతరం, తమోగుణాఢ్యులైన వారు అతి ప్రయాసతో సమావేశాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. "క" కారమునకు గల అర్థాన్ని వేడిగా చర్చించారు. చర్చ అప్పుడప్పుడు సిగపట్లకు దారి తీసింది. శరీర దార్ఢ్యత కల ఒక వర్గం "క" కారమునకు కత్తి యనే అర్థాన్ని ప్రతిపాదించగా, అందరూ ఏక కంఠంతో అంగీకరించారు. వితండ వాదమే జయించింది.

సమావేశం ముగియడమే తరువాయి, జట్లుగా చీలి వీరంగం ఆరంభించారు. నిష్పాపులూ నిరంతరతపోదీక్షానిరతులైన ఋషులను శ్రమైకజీవనులైన సామాన్యజనాన్ని అనేకవిధాల హింసించారు. గ్రామాలనూ, జనపదాలనూ రక్తప్లావితం చేశారు. గహనారణ్యాలను ఊసర క్షేత్రాలుగా మార్చారు. వారి మనోవృత్తి కఠినత్వానికి మారుపేరయ్యింది.

జగత్పిత వర్గత్రయానికి ఇచ్చిన సందేశం ఒకటే. అయితే ప్రవృత్తి ధర్మాన్ని పట్టి మూడు రకాలుగా అన్వయింపబడింది. లోకంలో వృత్తులు మూడయినవి. పెట్టుబడులు మూడు విధములయినవి. ఫలితాలు ఒకే విధంగా ఎలా పరిణమిస్తాయి?

ఆచార్యుడందించే జ్ఞానంలో, కల్పనలో, సమాచారంలో స్వరూపలక్షణభిన్నత్వం లేదు. మనోవృత్తిని పట్టి ఛాత్రుని అన్వయం ఉంటుంది. మన మనోవృత్తి సకారత్మకం కావాలి. మన కాయిక, మానసిక, బౌద్ధిక సామర్థ్యం జనకళ్యాణమార్గంలో క్రియాత్మకం కావాలి.

కారుణ్యం : మానవునకు దైవత్వాన్ని ఆపాదిస్తుంది.

కర్మ : మానవునకు నిరామయ జీవనానికి పునాది వేస్తుంది.

కాఠిన్యం : మానవుణ్ణి రాక్షసుణ్ణిగా మారుస్తుంది.

# ౨. భారవహనం

**(ఇద్దరు పరివ్రాజకుల కథ)**

ఇది అతీతంలోని సంఘటన అంటే పర్వతాలు రెక్కలు కలిగి ఆకాశంలో ఎగిరిన నాటి మాటగా భావించకూడదు. అవి హిమాలయ పర్వత శ్రేణులు. ఓ శ్రేణి గుండా ఒక కాలిబాట. ఇద్దరు పరివ్రాజకులు సిద్ధబారిలో వున్న తమ ఆశ్రమం వైపు ఈ బాట మీదుగా నడక సాగిస్తున్నారు. ఇద్దరూ ధ్యానమగ్నులు : మౌనధారులు. ఇలా వెడుతూ ఓ చిన్న సెలయేటి కాలువను సమీపించారు. కాషాయ వస్త్రాల్ని ఎత్తి పట్టుకొని తరణానికి ఉద్యుక్తులైన తరుణంలో ఆవలి ఒడ్డున ఓ అందమైన యువతి వారికి దృగ్గోచరమైంది. కాలువ దాటడానికి తన శక్తిని సందేహిస్తూ, నిలుచుంది. స్త్రీ సహజమైన బిడియం మాటలకు అంతరాయం కల్పించగా, చూపులతోనే వారి సహాయాన్ని అర్థించింది



ఆ ఇద్దరిలో, వయస్సులో పిన్నవాడైన పరి[వ్రాజకుడు ఆమె స్థితికి అసలే స్పందించలేదు ఎడమొహం పెట్టాడు. పెద్దవాడు మహాదయగలవాడు. తత్క్షణమే ఆవలి గట్టుకు వెళ్ళి, చేతులతో ఆమెను ఎత్తి పట్టుకొని ఈవలి గట్టుకు చేర్చాడు. యథా[ప్రకారం వాళ్ళిద్దరు మళ్ళీ నడక సాగించారు. పయనంతో మౌనం మేళవించింది. ఎవరి పెదవుల నుండి ఓ మాటైనా ఒలుకలేదు. అనిర్వేదానికి ఆలయమైన తమ ఆ[శమాన్ని చాలా పొద్దుపోయాక చేరుకున్నారు. [ప[ప్రథమం స్నాతులై, ఇంచుక ధ్యానస్థితిలో ఉండి [ప్రసాదాన్ని స్వీకరించి మార్గ[శాంతులైన వారు వి[శాంతినే ఎన్నుకొన్నారు.

నిదురించటానికి కుశాసనాల్ని నేలపై పరుచుకున్నారు. పిన్న పరి[వ్రాజకుడు మా[త్రం కూర్చునే వున్నాడు. తన తీ[వ్రనిరసనను ఇలా వ్యక్తం చేశాడు. “ మనం సర్వసంగపరిత్యాగులం [స్త్రీలను స్పర్శించటం అలావుంచి కన్నెత్తి చూడడం కూడా మన యెడ శా[స్త్రనిషిద్ధం మీరు ఆమెను చేతుల్లోకి ఎత్తి పట్టుకొని కాలువను దాటించటాన్ని గర్హ్యమైనదిగా భావిస్తున్నాను.”

ఈ మాటలకు పెద్ద పరి[వ్రాజకుడు లేశమా[త్రమైనా చలించలేదు. శాంత స్వరంతో ఇలా అన్నాడు:

“నేను ఆ [స్త్రీని కాలువ ఒడ్డునే వదిలి పెట్టాను. నీవు మా[త్రం ఆమెను ఊహలో నిల్పుకొని ఈ ఆ[శమం దాకా మోసుకొని వచ్చావు.”

దేహాన్ని అంటుకునేది ఏదైనా అట్టే కాలం నిలువదు.

మనస్సును నంటుకునేది ఏదైన మట్టిలో కలిసేంత వరకు వదులదు.

# 3. సాపేక్ష దృష్టి x సమ్యగ్దృష్టి

**(ఐదుగురు పరివ్రాజకుల కథ)**

ఓ అయిదుగురు పరివ్రాజకులు పోలీసు మైదానం ముందు నుండి తామున్న మఠం దిశలో వెడుతున్నారు. పాతికకు మించని పోలీసు దళం కవాత్తు చేస్తున్నది. భవనం మీద జాతీయం గాలికి రెపరెపలాడుతున్నది. అది గమనించిన ఓ సన్యాసి ఇంకో సన్యాసితో ఇలా అన్నాడు.

“పతాకం కదులుతుంది.”

అందకు రెండవ ఆయన ఇలా అన్నాడు.

“పతాకం కాద్సుమ్మ గాలి కదులుతుంది.”

ఈ పరివ్రాజకద్వయానికి గురువైన ఆయన ఈ రెండు విధానాలకు తన అనంగీకారాన్ని తెలుపుతూ ఇలా ప్రతిపాదించాడు.

“పతాకం కదలడం లేద్సుమ్మ గాలి కదలడం లేదు కదులుతున్నది ప్రవాహధర్మియైన మనస్సే.”

ఈ ముగ్గరికి కొంచెం వెనుకాలే నడుస్తున్న గురూణాంగురుః అయిన నాల్గవ ఆయన పూర్వ పక్షుల విధానాలన్నిటినీ నిషేధిస్తూ ఇలా సిద్ధాంతీకరించాడు. “ఏది కదలటం లేదు.” వయో వృద్ధుడైన అయిదవ స్వామి ఇదంతా విని మౌనంగానే వున్నాడు.

సర్వసంగపరిత్యాగులయిన వీళ్ళు మఠం చేరుకున్నాక, మొదటి నల్గురు స్వాములు ఓ చోట కూర్చుని కాసేపు వాదోపవాదాలు కావించారు. చివరకు ఈ సృష్టిలో ఏది గతిమానం కాదన్న నాల్గవ స్వామి వారి ప్రతిపాదనను ధృవీకరించారు. వయోవృద్ధుడైన పంచముడు తన మౌనాన్ని సడలించలేదు. ఆయనను సంబోధిస్తూ మిగితా నలుగురు ఇలా అన్నారు. “మీరేమీ సెలవిచ్చారు కాదు, స్వామీ!

ఇంత వరకు అవలంబించిన తన మౌనస్థితిని వీడి పరమకారుణ్యభావనతో వృద్ధస్వామి ఇలా అన్నాడు. ఏది గతిమానం కానప్పుడు ప్రతిపాదించటానికి ఏమి మిగులుతుంది? అభావస్థితి యన్నది మౌనం ద్వారానే గ్రాహ్యం. మనకు దృశ్యమానమయ్యేదీ, మనలో భావోద్దీపనం కలిగింది, ఆలోచల్ని రేకేత్తించేది ఏది వుందో అది అంతిమ వాస్తవత కాదు. పాక్షిక వాస్తవ మాత్రమే. అంతిమ వాస్తవత అనేది పాక్షిక వాస్తవత వెనుకాలే వుంది.”

క్షణం సేపు ఆగి మళ్ళీ ఉపక్రమించాడు.

“నిత్య జీవితంలో మనం వస్తుసముచ్చయాన్ని, కదలికల్ని గమనించే తీరు, ఓ పటంలోని గోవును చూచే తిరువంటిది. పటంలో మనకు అగుపించేది ఆవు – ఆవును చూడగానే

మనకు అనుభూతమయ్యేది దాని శల్యావశిష్టత ఆ పటాన్ని చూస్తున్నంతసేపు మనకు కలిగే ఆలోచనలు ఆవుకు సంబంధించినవి కావు, ఆవు బొమ్మకు సంబంధించినవి. స్థూల దృష్టితో పరిశీలించినప్పుడు మనకు అవబోధమయ్యే వాస్తవతాస్వరూపం ఇలాంటిది.

ఏ శల్యావశిష్టమైన గోవు మనకు పటంలో కనబడుతున్నదో, ఆ పటం కాగితం మీద ఉంది. ఆవును, దాని శల్యావశిష్టతను అధిగమించినప్పుడే, కాగితపు ఆస్తిత్వము మనకు బుద్ధి గ్రాహ్యమవుతుంది. ఆవూ, దాని వైగుణ్యం, బొమ్మా, కాగితం, సంపూర్ణ వాస్తవతకు ఘటకములు ఈ సంపూర్ణవాస్తవత గ్రాహ్యమయ్యేందుకు సమ్యగ్దృష్టి అవసరం.



వస్తుప్రపంచం దృశ్యమాన మయ్యేది భౌతిక స్తరంలో.

అనుభూత మయ్యేది భావానాత్మక స్తరంలో.

అవబోధమయ్యేది బౌద్ధిక స్తరంలో.

# 4. ఉక్తి : కృతి

## (యుధిష్ఠిర, దుర్యోధనుల కథ)

గురుకులంలో అధ్యాపనం జరుగుతుంది. ఆచార్యుల వారు క్రిందటి రోజు ఆహ్నికాన్ని అప్పచెప్పుమని మొదటి వరుసలో మొదటి వాడుగా కూర్చున్న విద్యార్థిని ఆదేశించారు. అతడు మారు మాటాడక మౌనం వహించాడు.

గురువుగారు ఇలా అన్నార్ను

"నిన్న అధీతమైనదాన్ని నేడు అప్పగించలేవా? మరోసారి బాగా చదివి, మననం చేసి రేపు ఉదయం అప్పగించు."

మరుసటి రోజు, ఆచార్యులు క్రిందటి రోజు అడిగిన రీతినే అడిగారు. ఈ సారి కూడా శిష్యుడు తలదించుకున్నాడు. ఆచార్యుల కీ విషయం కొంచెం చికాకు కల్గించింది.

'ఎంత చెప్పినా శ్రద్ధగా చదివావు కాద'ని మందలించి మరో విద్యార్థిని అదే రీతిని ఆదేశించారు.

ఆ రెండవ విద్యార్థి లేచి బిగ్గరగా వల్లె వేశాడు

"సత్యం వద – ధర్మం చర......"

గురువర్యులు వాణ్ణి మెచ్చుకుంటూ మొదటి విద్యార్థికి హితవు చెప్పాడు. "వీడు నీకు ఎంతైనా అనుకరణీయుడు"

ఆ ఆచార్యుల వారు మరెవరో కాదు – కృపాచార్యులు.

మొదటి వరుసలో మొదటి వాడుగా కూర్చున్న విద్యార్థి యుధిష్ఠిరుడు మరి రెండవ విదార్థి మీరూహించినట్లే, దురహంకారపూరితుడైన దుర్యోధనుడు. కౌరవశతంలో ప్రథముడు.

యుధిష్ఠిరుడు లేచి నిలబడి, చేతులు కట్టుకొని ఆచార్యునితో ఇలా విన్నవించుకున్నాడు. 'ద' 'ధర్మం చర' అనే వేద వాక్యం నియత జీవనుడై జీవించిన పిదప ఉచ్చరించ యోగ్యమైనది.

ప్రియ సోదరుడైన దుర్యోధనునికి అలాంటి విధినిషేధాలు లేవు. కృతి ఉక్తికి అనుగుణంగా ఉండాలని మీరే కదా భోధించారు.



నీవు చేసిన దానిని గురించే మాట్లాడు

నీవు చెబుతున్న దాన్ని అక్షరాలా ఆచరించు

ఏది చేస్తున్నావో దానిపై నీ ఆలోచన్ని కేంద్రీకరించు

ఋతమైన కృతికే ఉద్యమించు.

# 5. వచన బద్ధత

(ట్రూమన్, చర్చిల్, స్టాలిన్‌ల కథ)

**ద్వి**తీయప్రపంచమహాసంగ్రామం జోరుగా సాగుతున్న రోజులలో మిత్రదేశాలైన అమెరికా, రష్యా, ఇంగ్లాడ్ రాజ్యాధినేతలు ట్రూమన్, స్టాలిన్, చర్చిల్లు యాల్టాలో సమావేశమయ్యారు. అమెరికా అధ్యక్షుడైన ట్రూమన్ను స్టాలిన్ బాగా ఆకట్టుకున్నాడు. స్టాలిన్ చూపిన సామంజస్యము, స్నేహశీలవత్వం, ఇచ్చి పుచ్చుకునే మనోవృత్తి ట్రూమన్ మనస్సుపై చెరగని ముద్ర వేశాయి. ఇంగ్లండు ప్రధాని చర్చిల్ వ్యవహరిచిన తీరు ఇందుకు పూర్తిగా విభిన్నం.

ఏ ఒప్పందం మీద సంతకాలు చేయాల్సి వచ్చినా పాఠానికి మార్పులు చేర్పులు సూచించడమే కాకుండా, విరామచిహ్నాల విషయంలో కూడా వివాదానికి దిగేవాడు – అన్నీ సంతృప్తికరంగా అనిపించిన మీదటే, చేవ్రాలు చేసేవాడు. మరి స్టాలిన్. సహకారస్ఫూర్తిని అడుగడుగునా కనబరుస్తూ, అన్ని ఒప్పందాల మీద సంతకాలు చేశాడు.

ముగ్గురు నేతలకు సంతృప్తిని, సర్వజగత్తుకు ఊరట కలిగించే విధంగా యాల్టా సమావేశం ముగిసింది.

తమ తమ దేశాలలో, ఒప్పందాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాల్సిన సందర్భాలలో నేతలు ప్రదర్శించిన వైఖరి ఒకే విధంగా లేక పోవటం ట్రూమన్ ను ఆశ్చర్య పరచింది. ఒప్పందంలోని ప్రతీదీ చర్చిల్ తు. చ. తప్పకుండా అమలులో పెట్టగా, జోసెఫ్ స్టాలిన్ అన్ని ఒప్పందాల్ని తుంగలోతొక్కి, తన గుప్తప్రణాళికను కార్యాన్వితం చేయడానికి ఉద్యమించాడు.

ఇది ఏ చారిత్రాత్మకపరిణామలకు దారి తీసిందో జగద్విదితమే.

వచన బద్ధత చర్చిల్ స్వభావధర్మమైనందున చిన్న విషయాలలో కూడా పట్టుదల కనబరచాడు. మాటకు కట్టుబడని స్వభావధర్మంగల స్టాలిన్ " స్టాలిన్ "లా వ్యవహరించాడు.

శ్వేతసౌధంలోని నేతకు జ్ఞానోదయం అయ్యింది.



ఓను ! ఓను ! ఓను ! చెడువార్త

కాదు ! కాదు కాదు ! కటువైన వార్త

అవును, కాదు ! కాదు, అవును ! కమ్మనైన వార్త.

# 6. నాతి చరామి

**బ**రోడాలోని జూబీబాగ్ ప్రాంత నివాసియైన శ్రీ ఆనంద్ పటేల్ వివాహానికి ఉభయ పక్షాలు సమ్మతించి శాస్త్ర విదులచే ముహూర్తం పెట్టించారు. కుమారి నందితా పటేల్ నియోజిత వధువు.

నిర్ణీతముహూర్తాన వివాహం ఆహూతులను అలరించే విధంగా సుసంపన్నమైంది పెండ్లి తంతు ముగిశాక, పురోహితులు నవదంపతుల్ని పెద్దల ఆశీస్సులను పొందవలసినదిగా ఆదేశించారు.

నందితా – ఆనందులు ప్రప్రథమం మాతాపిత లైన శ్రీ హస ముఖ్భాయి మరియు శ్రీమతి హస ముఖ్ భాయి గార్లకు పాదాభివందనం కావించారు. కొడుకునూ కోడల్ని మనసారా దీవించారు ఆ పుణ్యదంపతులు



తన తల్లిదండ్రుల వైవాహికజీవితం సుఖప్రదం కావడం ఆనందన్ను ఎంతో ప్రభావితుణ్ణి చేసింది. పితాజీ ! మా దాంపత్యజీవితం మీలాగే సుఖప్రదం కావడానికి చేయాల్సింది నాకు విడమరచి చెప్పాలి." హసుఖాబాయి పేరుకు తగినట్టుగా మందహాసం చేస్తూ ఇలా అన్నాడు. " నాయనా ! ఇదొక రహస్యం.. మన లైబ్రరీరికి పద అక్కడ చెబుతాను."

లోనికి వెళ్ళిన వెంటనే హసుఖాబాయి తలుపులు మూసి వేశాడు. ఇన్నేళ్ళుగా ఏ మాత్రం చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో, శ్రీ హసుఖాబాయి కుమారునికి ఇలా హితవు పలికాడు.

"నాయనా! ఆనంద్! పెండ్లి నూరేళ్ళపంట. నీవు పాటించవలసిన నియమాలు రెండున్నాయి. మొదటిది : ఏ మూల్యం చెల్లించి అయినా భార్యకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. ఇక రెండవది: ఇది చాల ముఖ్యమైంది. వివేకం కల ఏ భర్త ఎలాంటి వాగ్దానం చేయకూడదు,"

ఆడిన మాటను అక్షరాలా ఆచరించాలి.

ఆశయరహితమైన జీవనం అరణ్య జీవనం

# 7. దానం తత్క్షణ దేయం

**(కర్ణుడు మరియు విప్రుని కథ)**

**ఉ**దారస్వభావుడుగా కర్ణుడు జగద్విఖ్యాతుడు. "లాకేత్వమియ్యనేరడ్ము 'దా' కును దాతలలో ప్రథమస్మరణీయుడు. అసమాన దాన వీరునిగా చరిత్రకెక్కాడు.

ఒకనాటి ప్రభాతవేళ, కర్ణుడు స్నాతుడు కావడానికి ఉద్యుక్తుడవుతున్నాడు. అంతః పురదాసీజనం ఆయన స్నాన నిమిత్తం అన్నీ ఏర్పాట్లు చేశారు. కవోష్ణజలపూరితభండాలతో పాటు, స్వర్ణపాత్రలలో అభ్యంగనానికి అవసరమైన సుగంధ తైలాన్ని, శ్రీచందన చూర్ణాన్ని, వనోషధులతో తయారు చేసిన లేపనాల్ని స్నానగృహంలో అతనికి అందుబాటులో ఉండే విధంగా అమర్చారు.

కౌపీనధారియై స్నాతుడవుతున్న కర్ణుడు ఒకదాని తర్వాత ఇంకొక పాత్రను ఎడమ చేతిలో వుంచుకొని, అందులోని ద్రవ్యాన్ని అవసరమైన మేరకు కుడి చేతితో తీసుకొని దేహానికి పులుముకుంటున్నాడు.

అలా స్నాతుడవుతున్న వేళ, వేదవిదుడైన ఓ విప్రుడు ధనార్థియై అతని ముందు నిలిచి దక్షిణహస్తాన్ని సాచాడు.

యాచన ధర్మవిరుద్ధంకాదు. అర్థి శిశుతుల్యుడు, అనాగసుడు. యువకుడు తనకవసరమైన దాన్ని పరిగ్రహిస్తాడు. ప్రౌఢమానవుడు స్వీయార్జితాన్ని సాటివానితో పంచుకొని అనుభవిస్తాడు. తనకున్న దానిని వృద్ధుడు రెండు చేతులా దానం చేస్తాడు. ఒకణ్ణి అడగడం, సాటివానితో పంచుకుని అనుభవించడం, ఇతరులకై సర్వాన్ని త్యాగం చేయడం ఇవన్నీ ధర్మబద్ధమైనవే. సమస్య తలెత్తేది పరిగ్రహణసందర్భాలలో, పరిగ్రహణం యువకుని స్వభావధర్మం. పరిగ్రహణంలో అహంకారం వేళ్ళూనికొని వుంటుంది. పరిగ్రహణం ఒక ఉల్లంఘన. సకల జగత్తుకు ఒక దీటైన సవాలు. అర్థించడంలో దోషం లేదు: పంచుకుని అనుభవించడంలో దోషం లేదు. పరిగ్రహణం ముమ్మాటికీ దోషపూరితం. లేమిలో ఇతురలను యాచించటం అనైతికం కాదు.


విప్రుడు కుడిచేయి సాచగానే, కర్ణుడు తన ఎడుమచేత నున్న స్వర్ణపాత్రాన్ని ఎడుమచేతి మీదుగానే తత్క్షణం ఇచ్చివేశాడు. చిరునవ్వుతో స్వీకరిస్తూ, విప్రుడు తన కృతజ్ఞతను కర్ణునికి తెల్పుకున్నాడు.

రాజు నుండి సెలవు తీసుకొనే ముందు విప్రుడు ఇలా అన్నాడు "అసమాన దానశీలా! మిమ్మల్ని ఓ ప్రశ్న అడగాలని ఉంది."

సమ్మతి సూచకంగా కర్ణుడు తలను ఊపాడు.

విప్రుడు అన్నాడు :

“దాన మీయదలచిన వాడు దానాన్ని దక్షిణహస్తంతో చేయడం, అలాగే గ్రహీత అయినవాడు దక్షణ హస్తంతో స్వీకరించడం స్మృతిసమ్మతమైన ఆచరణం. మీరు దానం చేసిన తీరు దీనికి విరుద్ధంగా ఉంది



కర్ణుడు ఇలా బదులు చెప్పాడు: "విప్రవర్యా! దానం దక్షిణహస్తంతో ఈయవలెనని మీరన్నది సరైనదే! అయితే, మీరు చేయిసాచిన వేళ, పాత్ర నా ఎడమచేతి లో వుంది.

"మీరు అడుగ గానే ఇచ్చివేశాను. దాన్ని కుడిచేతి కి మార్చుకునేందుకు అవసరమైన ఆ వ్యవధి రెప్పపాటుదే అయినా, ఆ రెప్పపాటు స్వల్పవధిలోనే సంకల్పాలు వికల్పాలుగా మారుతాయన్న సూక్ష్మం తమకు తెలియనది కాదు."

"నా మనస్సులో ఇలా ఆలోచనలు కదిలి వుండేవి. ఇంత అమూల్యమైన దాన్ని విప్రునకు ఎందుకీయాలి? రజతపాత్రాన్ని దీనికి బదులు ఈయవచ్చును కదా ! అయిన రజతపాత్ర కూడా విలువైనదే! ఏదో కొంత ధాన్యం దానంగా ఇస్తే విప్రుడు తన దారిని తాను పోతాడు."

క్షణం ఆగి కర్ణుడు మళ్ళీ ఇలా అన్నాడు.

"స్వభావతః మానవుని మనస్సు అతిచంచలమైనది. అలా నిరంతరం డోలాయమాన మయ్యే మనస్సు మానవునకు పరమశత్రువు. సర్వకాలాల్లో సర్వావస్థల్లో స్థిరంగా ఉండే మనస్సే పరమ ఉపకారి. స్వర్గానికి స్రష్ట మనస్సే. అలాగే నరకానికి కూడా మనస్సు బురద్ష్మ మనస్సు బంగారం. నిత్యసందేహాస్పదమైన మనస్సులోని సంకల్పం వికల్పంగా మారక ముందే మీ అభీష్టాన్ని నెరవేర్చాను. విప్రవర్యా! దీన్ని స్వీకరించిన మీరు నన్ను మనసారా ఆశీర్వదించాలి."

విప్రుడు కర్ణుణ్ణి దీవించి, బంగారుపాత్రతో పాటు, బంగారులాంటి ఆలోచన ప్రాప్తించినందుకు తెగ మురిసిపోతూ, రాజు నుండి సెలవు తీసుకొన్నాడు.

పవిత్రమైన మనస్సుతో చేసే ప్రతి దానం
పరమేశ్వరునికే చెందుతుంది.

# 8. దానం సమయ మెరుగదు

**(కర్ణ దుర్యోధనుల కథ)**

**పా**డవజననియైన కుంతికి, అవివాహితగా పితృగేహంలో ఉన్న సమయంలో, దుర్వాస మహాముని వరప్రభావమున సూర్యుని వల్ల కర్ణుడు పుట్టాడు. నిజానికి పాండవులలో అతడే ప్రథముడు. లోకప్రవాదానికి వెరచి, నిసర్గజమైన కవచకుండలాలతో జన్మించిన శిశువును ఒక పేటికలో ఉంచి, అపేటికను నదీప్రవాహంలో వదిలింది. అధిరథుడనే సూతపుత్రునకు ఆ పేటిక దొరికింది అందులోని శిశువును సంతానహీనయైన తన పత్నికి ఇచ్చాడు. రాధ – అధిరథులు కన్న కొడుకువలె సాకి విద్యాబుద్ధులు నేర్పించారు. కర్ణుని జన్మవృత్తాంతాన్ని పరమ గోప్యంగా ఉంచారు. కాలాంతరాన, కర్ణుడు పేరువడసిన ధనుర్ధారి అయ్యాడు. శీలగుణ సంపన్నుడైన జననాయకునిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాడు.

దుర్యోధనుడు కౌరవ సామ్రాజ్యానికి ఏలికయైన ధృతరాష్ట్రుని పుత్రుడు. స్వభావతః మహాఈర్ష్యాళువు. దినదిన ప్రవర్ధమానమౌతున్న పాండవుల అభ్యుదయం వానికి సహించరానిదైనది. అర్జునుడంటే వానికి అసలే గిట్టదు. క్షాత్రయోగ్యమైన సకలవిద్యలలో, రణపాండితిలో ఒక కర్ణుడు దక్క అర్జునిని మించిన వారు లేరు. ఇది గ్రహించిన దుర్యోధనుడు వ్యూహాత్మకదృష్టితో కర్ణుణ్ణి అంగరాజ్యానికి అధినేతను చేశాడు. ఉపేక్షితునిగా ఉన్న తనను ఇంతవానిగా చేసినందుకు దుర్యోధనుని యెడ కర్ణుడు త్యక్తజీవితుడైనాడు.

అంగరాజ్యరమారమణుడైన కర్ణుడు అచిరకాలంలోనే మహాదాతగా కీర్తినార్జించాడు. అందరి పొగడ్త అందుకుంటున్న కర్ణుని యెడ దుర్యోధనుని మనస్సు ఈర్ష్యాగ్రస్తమైంది. ఈర్ష్య దుర్యోధనులు కవలపిల్లలు గదా !

దుర్యోధనుడు ఇలా ఆలోచించాడు.

“అనామకుడైన వీణ్ణి అంగరాజ్యానికి రాజును చేసింది నేను. వీడు రెండు చేతులా దానం చేస్తున్నది నా సొమ్ము. మూర్ఖలోకం వీణ్ణి దానవీర కర్ణుడని ఆకాశానికి ఎత్తుతున్నది. వీణ్ణి మించిన దానశూరునిగా నేను ముల్లోకాల్లో కీర్తినార్జించాలి. నా కీర్తి ఆచంద్రార్కంగా నిలిచిపోవాలి.

రాజులకు అసాధ్యమైనది లేదు. ఆంతరంగిక ప్రధాన సచివుణ్ణి తనవద్దకు పిలిపించుకొని ఇకముందు నుండి తనను దానవీర దుర్యోధనునిగా అన్ని సందర్భాలలో అధికారులూ సామాన్య ప్రజలూ సంబోధించేట్టు చూడవలసినదని ఆదేశించాడు. భవనముఖ్యద్వారానికున్న నామఫలకంలో దాన అనే పదాన్ని పూర్వపదంగా తన పేరుకు చేర్చే విషయంలో తత్క్షణ చర్యలు చేపట్టాలని కోరాడు. స్వామిభక్తుడైన ప్రధానసచివుడు యజమాని ఆదేశాన్ని కాలహరణం చేయకుండా, కార్యాన్వితం చేశాడు.

అది శ్రావణారంభం. మిన్నునూ మన్నునూ ఏకం చేస్తూ కుండపోతగా వర్షం కురుస్తున్నది. ఒక సప్తాహకాలం గడిచినా, ఎడతెరిపి లేకుండా వాన పడుతునే వున్నది. యజ్ఞదీక్షితుడైన ఓ మహర్షి మూడు బండ్ల ఎండుకట్టెల నిమిత్తం రాజధానికి వచ్చారు. ఆయన లోకకళ్యాణార్థం నిర్వహించబోయే యజ్ఞవిధికి శుష్కేంధనం అవసరం.

మొదట కర్ణుణ్ణి అడగాలనుకున్నాడు. కర్ణుడు తన మనోభీష్టాన్ని ఏ పరిస్థితిలో నైనా నెరవేరుస్తాడన్న నమ్మకం ఆయనకుంది. అయితే, కర్ణుని భవనం వైపు పోతూ వుండగా, దుర్యోధన సార్వభౌముల ముఖ్యద్వారానికి కట్టబడిన నామఫలకం ఆయన దృష్టిని ఆకర్షించింది.

వెంటనే అతని భవనాన్ని సమీపించాడు. తన రాక మహారాజావారికి తెలపవలసినదిగా ద్వారపాలుణ్ణి కోరాడు. ద్వారాపాలుడు వచ్చి మహర్షిని ప్రభువు వద్దకు కొనిపోయాడు. మహర్షి లోనికి రావడం గమనించిన దుర్యోధనుడు ఎదురుగా వెళ్ళి, స్వాగతం పలికి ఆయనకు ఉచితాసనాది మర్యాదలు చేశాడు.

మహర్షి తాను తలపెట్టిన యజ్ఞవిధిని గురించి, దానికవసరమైన శుష్కేంధనం గురించి దుర్యోధనునికి తెలిపారు. "రాజా! రేపే యజ్ఞం ఆరంభిస్తున్నాను. ఈనాటి సాయంత్రానికే శుష్కేంధనం చేర్చబడిన మూడు శకటాలు యజ్ఞస్థలికి చేరే విధంగా అన్నీ ఏర్పాట్లు చెయ్యాలి."

దుర్యోధనుడు అన్నాడు. "మహాత్మా ! ఇది మాకు అసాధ్యం కాదు. కొంత సమయం ఇక్కడే ఆసీనులయి వుండి నన్ను అనుగ్రహీతుణ్ణి చేయండి." తత్క్షణమే ఓ సైన్యోద్యోగిని తన కడకు పిలిపించుకొని తగు వ్యవస్థ చేయవలసినదిగా ఆజ్ఞాపించాడు.

రెండు గంటల తర్వాత అతడు తిరిగి వచ్చి వాన మూలంగా పొడికట్టను యజ్ఞస్థలికి తరలించడంలో తన అసమర్ధతను ప్రభువులవారికి సవినయంగా మనవిచేసుకున్నాడు.

దుర్యోధనుడు అంతటితో ఊరుకొనలేదు. సర్వసైన్యాధిపతిని, ఆటవికాధిపతిని తన కడకు రావించుకుని మహర్షి ఈప్సితం మేరకు తగిన చర్య చేపట్టవలసినదిగా ఆజ్ఞాపించాడు.

నాల్గు గంటల తరువాత వాళ్ళు తిరిగి వచ్చి తమ అసమర్థతను నివేదించుకుని ప్రభువుల క్షమాభిక్ష కోరారు. మహర్షి దుర్యోధనుని ఆశీర్వదించి అక్కడినుండి నిష్క్రమించారు. దుర్యోధనుడు కాసేపు వ్యధితుడైనా, అన్నీ విస్మరించి సంగీతశ్రవణంలో తన్మయుడై పోయాడు.

రాజమార్గం మీదుగా కదులుతున్న శకటాల కర్కశధ్వని చెవినపడిన వెంటనే బ్రహ్మానంద సహోదర స్థితి నుండి దుర్యోధనుడు వ్యావహారిక జగత్తులో అడుగుపెట్టాడు.

ఆసనం నుండి లేచి ప్రవేశద్వారపు తలుపులు తెరిపించుకుని, చేతనున్న ఛత్రాన్ని తెరచి, యజ్ఞస్థలి దిశలో చకచకా సాగిపోతున్న మృగవ్యాఘ్రచర్మాచ్చాదిత శకటత్రయాన్ని సమీపించాడు వాటిని అనుసరిస్తున్న మహర్షివద్దకు పరుగెత్తి “ఇదంతా ఏమిటి మహర్షీ!” అని సంభ్రమాశ్చర్యాలను వ్యక్తం చేశాడు.

మహర్షి ధీం´గంభీర స్వరంతో ఇలా అన్నాడు. “ ఇది కర్ణుడు దానంగా ఇచ్చాడు రేపు ఉదయం నిర్ణీత ముహూర్తాన యజ్ఞారంభం కాగలదు. కర్ణుని మేలు మరచిపోను.”



విమనస్కుడై ఇలా ఆలోచనలో పడిపోయాడు ‘ఓ సామాన్యసామంతునికి సాధ్యమైనది ఇంతటి మహాసామ్రాజ్యానికి ఏలికనైన నాకు అసాధ్యంకావటం విధివిలాసం. వెంటనే దగ్గరకు వెళ్ళి అడిగి తెలిసికొనేంత వరకు ఈ అయోమయస్థితి నుండి బయటపడలేను.’

క్షణార్ధంలో మెరపులా తన రాజప్రసాదం ప్రక్కనే ఉన్న కర్ణుని భవనంలోకి ప్రవేశించాడు. దుర్యోధనుడు కర్ణుని ఇలా అడిగాడు. “మిత్రమా! నిర్విరామంగా కురుస్తున్న ఈ కుంభ వృష్టిలో శుష్కేదనాన్ని మహర్షికెలా సమకూర్చగలిగావు. అదీ ఇంతటి స్వల్పవ్యవధిలో నేనెందుకు విఫలుడనైనానో!”

దుర్యోధనుడు దీర్ఘనిశ్వాసం విడిచాడు.

కర్ణుడు సవినయంగా ఇలా బదులు చెప్పాడు.

“రాజా! శ్రీచందనదారునిర్మితమైన భవనపు నాల్గవ అంతస్తును తక్షకులచే ఒలిపించి, అలా లబ్ధమైన కర్రను మూడు శకటాల కెత్తించి మహర్షి మనోభీష్టాన్ని నెరవేర్చాను.” మీ ఆశీస్సులున్న నాకు ఇది కష్టసాధ్య మనిపించలేదు.

దానం అనార్తన పుష్పం వంటిది
అది ఏ ఋతువులోనైనా సాధ్యమే.

# 9. దానం అమేయం

**(కర్ణార్జునుల కథ)**

**రా**జసూయం సంపన్నమైన మీద పాండవరాజధాని, ఇంద్రప్రస్థంలో జనావళికి చిరస్మరణీయంగా నిలిచిపోగల ఓ ఉత్సవం సప్తాహం పాటు జరిగింది. ఋషులు వేదపఠనం కావించార్ష్మ మునులు తమ మహిమలను ప్రదర్శించార్ష్మ జనాభిలషితమైన వ్రతపుణ్యకములు పురోహితులు శాస్త్రోక్తంగా చేయించారు. సాంస్కృతికకార్యక్రమంలో భాగంగా సాహిత్యసంగీత సమ్మేళనాలు జరిగాయి. నాట్యకార్యక్రమాలకు జనులు తండోపతండాలుగా వచ్చారు. ధనుర్విద్యాది ప్రదర్శనముల సంగతి చెప్పవలెనా ! ఇసుక వేస్తే నేలపై రాలదన్నంతగా జనులు ప్రతికార్యక్రమానికి పోగయ్యారు.

సప్తాహం పాటు ఘనంగా సాగిన ఈ కార్యక్రమానికి అంతిమాధ్యాయంగా, ఆసేతు హిమాచలం నుంచి ఇంద్రప్రస్థానికి విచ్చేసిన వేదవేత్తలనూ, స్మార్తదార్శనిక సాహిత్యాన్ని కూలంకషంగా అధ్యయనం చేసి సార్థజీవనులైన శేముషీసింధువులను, సాహితీక్షేత్రంలో రాజనాలు పండించిన కవిపుంగవులను భూగోహిరణ్య క్షేమవస్త్రాలతో సత్కరించిన తీరు మనుష్యులతో పాటు దేవతలకు కూడా అనిర్వచనీయానందానుభూతిని కల్గించిందనడంలో అత్యుక్తి లేదు. సర్వభూతహితరతులూ, అంత్యోదయధ్యేయాంకితులైన పాండుకుమారులు నిరుపేదలను విస్మరించుటం ఎలా జరుగుతుంది?

అతివృష్టి – అనావృష్టి వీడితులైన జనానీకానికి తక్షణ సహాయార్థం రాజ స్వధాన్యాగారాలను తెరిపించారు. భూమిహీనులకు 'పెక్కు చందాలన్ బందుమాన్యక్షేత్రాలను ప్రదానం చేస్తూ తత్సంబంధిత పత్రాలు వారికి అందేలా వివిధ ప్రాంతీయోద్యుగులకు ప్రధాన సచివుని ద్వారా ఉత్తర్వులు జారీ చేయించారు. యువతీయువకులకు స్వోపాధికల్పనాపథకం క్రింద పర్యాప్తద్రవ్యం సహాయంగా అందేట్టు చర్యలు చేపట్టవలెనని కోశాధ్యక్షుణ్ణి ఆదేశించారు. వివిధ వృత్తులకు అవసరమైన ఉపకరణములు యోగ్యులైన వారికి అందే విధంగా చూడాలని స్థానికోద్యుగులకు ప్రభుత్వ ఉత్తర్వులు చేరినవి. విద్యా క్షేత్రంలో రాణించిన ఛాత్రులకు ఉపకార వేతనం అందే విధంగా ప్రభుత్వ యంత్రాంగం ఆయత్తమైంది.

వయసు మీద పడినవారి జీవనసంధ్యాసమయం ఆహ్లాదభరితం చేసే నిమిత్తం వర్షాశన వితరణవ్యవస్థ పకడ్బందీగా రూపొందించబడింది. రాజసూయయాగానికి ఆనుషంగికంగా నిర్వహించవలసిన అంతిమకార్యక్రమం దానవిధికార్యక్రమం. ఇది రాజ్యంలోని నిరుపేదలకై నిర్దేశితం. ఇందుకై ఓ పెద్ద శిబిరాన్ని వేయించి దాని చుట్టూ ధాన్యంతో నింపిన సంచుల్ని కుడ్యాకారంలో పేర్చారు. లెక్కకు మించిన నూలువస్త్రాల మూటల్ని ఓ క్రమంలో అమర్చారు. ఇత్తడి, రాగితో చేసిన రకరకాల వంటపాత్రలను దొంతరులుగా పేర్చారు.

శిబిరం చుట్టూ లక్షగోవుల్ని మట్లకు కట్టివుంచారు. ముత్తైదువులకు ఈయడానికి

బంగారు గాజులు, మంగళసూత్రాలూ, మట్టెలూ పెద్ద పెద్ద పేటికల్లో ఉంచారు. ఉపలక్షణముగా చెప్పవలసినదే కాని, అక్కడ దానార్ధం ఉంచబడిన వస్తువుల జాబితా వేయడం బ్రహ్మకైననూ సాధ్యంకాదు.

ఈ శిబిరం నుండి చీపురుపుల్లయినా బయటకు పోకుండా, మెరపుతీగల్లా తళుక్కుమనే కత్తులను చేత పట్టుకున్న వేయిమంది లోకభీకరధృఢకాయులను పహరా గా పెట్టి అభేద్యమైన రక్షణకవచాన్ని రూపొందించారు.

ఈ దానవిధికార్యక్రమం ఒక బృహత్కార్యక్రమం. దీన్ని పర్యవేక్షించేందుకు సమర్థుడైన వ్యక్తిని నిర్ధారించే నిమిత్తం పాండవులు ఒక ప్రత్యేకసమావేశాన్ని ఏర్పాటు చేశారు. కురు వృద్ధులూ, శ్రీకృష్ణబలరాములూ, అశ్వత్థామద్రోణాచార్యద్వయం అందులో పాల్గొన్నారు. సుదీర్ఘ చర్చానంతరం, యుధిష్ఠిరుడు కర్ణుని పేరును ప్రతిపాదించగా, కృష్ణునితో సహా పెద్దలందరూ దీన్ని అనుమోదించారు.

కర్ణుని ప్రతిస్పర్ధిగా చూచే అర్జునికి ఇది ఏ మాత్రం నచ్చలేదు. "ఈ దానవిధికి పర్యవేక్షకునిగా వేరొకడు వ్యవహరించలేడా? కర్ణుని యోగ్యత ఏమిటి" అని తన నిరసన వ్యక్తపరచినాడు.

కృష్ణుడు మందస్మితం చేస్తూ ఇలా అన్నాడు. "అర్జునా! దానగుణంలో కర్ణుని మించిన వారు లేరని బహునాళ్ళుగా ప్రజలనుండి వింటున్నాము. ప్రజావాణియే పరమాత్ముని వాణి కదా! మనమెట్లు కాదనగలము."

దీనికి అర్జునుడు తీవ్రంగా స్పందిస్తూ "మీరు కర్ణపక్షపాతులు. ఏనాడునూ కర్ణుని మించగలనే కాని, అతనికి తీసిపోను."

'బాలహరము బ్రహ్మహరము కదా!' ఇలా ఆలోచించి కృష్ణుడు యుధిష్టిరునితో అన్నాడు. ఈ శిబిరం నుండి చీపురుపుల్లయినా బయటకు పోకుండా, మెరపుతీగల్లా తళుక్కుమనే "రేపటి ప్రభాతవేళ ఆరంభమయ్యే దానవిధికార్యక్రమానికి అర్జుననే నియోగింతము. ఇతని సామర్థ్యమునకిది పరీక్ష. రేపటి సాయంత్రమే స్పష్టము కాగలదు. అర్జుని యందు నాకు పూర్తి విశ్వాసమున్నది. మీరేమందురు?"

శ్రీ కృష్ణుని మాటను కాదనగల వారెవరు ? కడకు కర్ణుడు కూడా తన సమ్మతిని తెలిపాడు. క్షణం కునుకురాని అర్జునుడు రేయల్లా ఆలోచించాడు అనుసరించవలసిన విధానాన్ని రూపొందించుకున్నాడు. పెద్దల నమ్మకాన్ని వమ్ము చేయననే ఆత్మవిశ్వాసం అతనికి కల్గింది. మరుసటి రోజున దానవిధికార్యక్రమం నిర్విఘ్నంగా పూర్తి అయ్యే నిమిత్తం ఇరువది మంది యువనేతలకు (తనను కలుపుకొని) వితరణ బాధ్యతనప్పగించి వారితో సహా తానూ రంగప్రవేశం చేశాడు. వ్యూహాత్మకస్థానంలో నిలబడి ఆరంభానికి హరితసూచన నిచ్చాడు.

గృహీతలు ఇరువది బారులుగా ఏర్పడి నిలుచున్నారు. నిమిషాల్లో కార్యక్రమం ఊపునందుకుంది.

అర్జునుడూ అతని సహచరులు విరామమెరుగక పరిశ్రమించారు. మధ్యాహ్న భోజనాన్ని విస్మరించారు. సాయంకాలం కానుంది. ఆచార్యకురువృద్ధసమేతుడై కృష్ణుడు శిబిరానికి వచ్చాడు. ముగిసిన సూచనలేవీ కనిపించలేదు. ఎప్పటిలా మందస్మితం చేస్తూ కృష్ణుడన్నాడు.

"అర్జునా! నీ పనితీరు ప్రశంసనీయం. అయిన నూటికి ఎనుబదివంతు నిధులింకా మిగిలేవున్నాయి. సగానికి పైగా గృహీతలు బారుల్లో నిలబడే ఉన్నారు."

కోపావేశంతో అర్జునుడు ఊగిపోయాడు. ఇంతటి బృహత్కార్యంలో ప్రమాణానికి సరిపోయే వేగాన్ని జతపరచి సమయబద్ధఫలితాలను సాధించటం అసంభవం అని తనలో తాను అనుకుంటూ అర్జునడు తూష్టీంభావం వహించాడు. కృష్ణుడు అర్జునుని మనస్సులో కదిలే ఆలోచనల్ని ఇట్టే గ్రహించి అన్నాడు.

"అర్జునా ! కర్ణునికి ఓ పదినిమిషాలు అవకాశమీయగలవా."?

అర్జునుడు ఇలా అన్నాడు.

"పది నిమిషాలెందుకు? ఆరంతల వ్యవధిని ఈయడానికి నేను సిద్ధమే." కర్ణుడు వెలుగబెట్టేది పెద్దలు చూచెదరు గాక !"

కర్ణునకు బాధ్యతనప్పగించి అర్జునుడు సహచరులతో సహా వైదొలిగినాడు.

కర్ణుడు పెద్దలందరికీ అభివాదం కావించాడు. పాండవులను మర్యాదగా పలుకరించాడు, కౌరవులను యోగ్యమైనరీతిలో సంభావన చేశాడు.

ఋషులముందూ ఆచార్యుల ముందూ క్షణం పాటు నతమస్తకుడైన మీదట, సామాన్య జనానికి అభిముఖంగా నిలిచి ఇలా ఆహ్వానించాడు. "ఇక్కడ నా ముందు వున్న విశాల జనవాహిని నుంచి ఆత్మవిశ్వాసంగల పదిమంది యువనేతలు ముందుకు రావాలి."

ఇందుకు తమ సంసిద్ధతను తెలుపుతూ పదిమంది యువనేతలు ముందుకొచ్చారు.

కర్ణుడు అన్నాడు.

"మీరు మీ దక్షిణహస్తాలను సాచండి."

దానసూచకంగా జలాన్ని వారి కుడిచేతులలో విడుస్తూ ఇలా అన్నాడు.

ఈ శిబిరం క్రింద – నలువైపులా దాననిమిత్తం ఉంచబడిన సమస్తవస్తుసంభారం మీదే. కర్ణుడు ప్రక్కకు తప్పుకున్నాడు.

నేతలు వితరణ భాద్యతలు చేపట్టడానికి రెండు నిమిషాలు పట్టింది. మరో రెండు వృద్ధుడు దివంగతుడైనాడు. ఐహికయాత్ర ముగించే ముందు తన ఆస్తిలో ముగ్గురు కుమారులకు నిమిషాల్లో యావత్కార్యక్రమం సుసంపన్నమైంది.

కర్ణుడు సవినయంగా కృష్ణునికి అభివాదం చేశాడు. అర్జునకు అంతా అర్థమైంది.



దేనినీ నీ చేతి మీదుగా ఇచ్చే సయత్నం చేయకు.
ఈయదల్చినది అర్పణగా ఇయ్యి. తీసుకునే వాళ్ళ తీసుకొనని
దానానికి ప్రతిగ్రహీతకూ మధ్య నిన్ను నీవు నియుపుకోకు
అప్పుడే దానం ఈశ్వరార్పణం అవుతుంది

# 10. దాయా భాగం

**(పదిహేడు ఏనుగుల కథ)**

**అ**నగా అనగా ఒక రాజు – ఆయన పేరు యుక్తివర్మ. ఆయన రాజ్యంలో ఇటీవలె ఓ వృద్ధుడు దివంగతుడైనాడు. ఐహికయాత్ర ముగించే ముందు తన ఆస్తిలో ముగ్గురు కుమారులకు చెందవలసిన వాటాలను నిర్దేశిస్తూ ఓ వీలునామా వ్రాయించి ఉంచాడు.

ఆ వీలునామా ఇలా వుంది.

"నాకు గల మొత్తము ఏనుగులలో సగభాగము జ్యేష్ఠునకు చెందవలెను. మూడింటిలో ఒక భాగము మధ్యమునకు చెందవలెను. మధ్యమునకు చెందవలసిన వాటా ఏదికలదో దాని తృతీయాంశము కనిష్ఠునకు చెందవలెను."

ఆ ముసలాయనకు గల ఆస్తి పదిహేడు ఏనుగులు. అందువలన ఆస్తివిభజన ముగ్గురు కుమారులకు ఓ పెద్ద సమస్యయై కూర్చొన్నది.

పెద్ద కుమారునకు : సగభాగమంటే 17 ఏనుగులలో సగమన్నమాట అంటే 8 1/2 ఏనుగులు.
మధ్యమునకు : 17/3 అంటే 52/3 ఏనుగులు.
కనిష్ఠునికి : 5 2/3 + 3 = 17/3 3=17/3 X 1/3=17/9=1 8/9

వీలునామా ప్రకారం ఏనుగులను ఖండాలు చేయకుండా విభజన అసాధ్యం. దిక్కుతోచక, ముగ్గురు సోదరులు తమదేశాన్ని పాలించే పరమమేధావీ, ప్రజారంజకుడూ అయిన యుక్తివర్మ సమక్షమున కృతాంజలులై నిలిచి ఈ సమస్యను పరిష్కరించవలెనని అభ్యర్థించారు. సైనికమైదానంలో ఏనుగులను ఒక సరళరేఖలో నిలబెట్టాలని సోదరులను రాజావారు ఆజ్ఞాపించారు. వారి ఆదేశం మేరకు, సైనికులు విన్యాసాలు జరిపే ఓ విశాలమైదానంలో ఉత్తరాభిముఖంగా ఏనుగులను సరళరేఖలో నిలబెట్టి, అక్కడికి వారిని ఆహ్వానించారు.

యుక్తివర్మ మహారాజు స్వలంకృత గజారూడుడై అంగరక్షకులైన అశ్వారోహకులు ఇరుప్రక్కల, కాలిబంట్లు వెనుక రాగా సైనికమైదానాన్ని చేరుకున్నారు. ఏనుగులపై క్షణం పాటు దృష్టి నిలిపి వీలునామాను అందరు వినేట్టు చదువ వలసిందిగా పెద్దవాణ్ణి ఆదేశించారు. వీలునామా చదవడం అయిన పిదప రాజావారు ఇలా అన్నారు.

"మీ తండ్రిగారు మీకు వారసత్వంగా వదలిన పదిహేడు ఏనుగులకు నా ఏనుగును చేరుస్తున్నాను."

సోదరులకు ఆశ్చర్యం వేసింది.
రాజుగారు వెంటనే అన్నారు.
ఇప్పుడు ఏనుగులు ఎన్ని ?"

సోదరులు : "పదునెనిమిది ప్రభూ!"

రాజు గారు : "వీలునామా ప్రకారం సగభాగం అంటే 9 ఏనుగులు పెద్దవాని వాటాగా మొత్తంలో మూడవవంతు మధ్యమునికి కనుక 6 ఏనుగులు మధ్యముని వాటాగా నిర్ణయించుచున్నాము.

మధ్యమునకు చెందవలసిన వాటాలో మూడవ వంతు కనిష్ఠునకనగా 2 ఏనుగులు కనిష్ఠుని వాటాగా ప్రకటించుచున్నాము.

ఈ ముగ్గురికి వాటాగా వచ్చిన ఏనుగులు 9ష6ష2వ17 అయినందున మా గజరాజమును తిరిగి మా స్వాధీనము కావించుకొనుచున్నాము. ఇక వివాదమునకు తావు లేదని భావించుచున్నాము.

విజయఘోషల మధ్య మహారాజు అంగరక్షకులు తోడురాగా రాజభవనం వైపు ప్రస్థానం కావించారు.



కొత్త ఒరవడి ఎప్పుడూ స్వాగతార్హమే

# 11. కన్సల్టెంట్ అనగా...

**(చిత్తరంజన్ చటోపాధ్యాయుని కథ)**

ఇది సుమారు పాతికేళ్ళ క్రిందటి మాట, కోల్కతాలో చిత్తరంజన్ చటోపాధ్యాయ అనే ఆయన ఉండేవారు. కన్సల్టెంటుగా దేశంలోని అన్నీ ముఖ్యపట్టణాల్లో ఆయన పేరు వినబడేది. చిత్తరంజన్ మహాశయులు ఓసారి పూణే వెళ్ళారు. అక్కడ "గమ్మాపావెల్ లిమిటెడ్" అనే కంపని ద్రవ్యాపూర్తివ్యవస్థాపనా వ్యవహారంలో కొన్ని చిక్కులను ఎదురుకుంటున్నది. ఆ కంపనీకి మేనేజింగ్ డైరక్టరయిన వినాయక్ గణపత్ గోఖలే గారు పూణేకు చిత్తరంజన్ గార్ని ఆహ్వానించారు.

పూణేకు వచ్చిన చిత్తరంజన్ సమస్యను లోతుగా పరిశీలించిన మీదట, ఉత్పాదన వ్యయాన్ని పదిహేడు శాతం తగ్గించాలని సిఫారసు చేస్తూ, దాన్ని సాధించేందుకు మార్గదర్శక సూత్రాలను చేరుస్తూ ఓ రిపోర్టును తయారు చేసి గోఖలే చేతిలో పెట్టారు.

దాన్ని అందుకుంటూ గోఖలే ఇలా అన్నాడు. "చూడండి చిత్తరంజన్ గారు! వ్యక్తి అనేవాడికి ఏవో ఆలోచనలు వస్తాయి. వాటికి కార్యరూపం ఈయడంలో ఊహించిన ఫలితాలు రావు. ఈ చేదు అనుభవంతో, అతడు ఊరుకుంటాడా? ఈ ఆలోచన్ని ఆచరణలో పెట్టండి అని ఇతరులకు సలహాలిస్తాడు. మా దృష్టిలో ఇలాంటివాడే కన్సల్టెంట్ అనబడే వ్యక్తి, మీరేమంటారు.?"

ఏమాత్రం తొణకకుండా చిత్తరంజన్ మహాశయులు ఇలా బదులు చెప్పారు. "మీరనేది నేను అంగీకరించను. అలా అని అంగీకరించకుండా ఉండలేను. నూటికి నూరుపాళ్ళు కాకపోయినా కాస్తోకూస్తో మీరన్న దానిలో సత్యం లేకపోలేదు"

పరిహాస దోరణిలో గోఖలే కొనసాగుతూ చిత్తరంజన్ ను ఇలా ప్రశ్నించాడు. "సలహాదారుడు" అనే పదానికి మీరు ఇచ్చే నిర్వచనం ఏమిటి?

క్షణంపాటు ఆలోచించి, చటోపాధ్యాయ చటక్కున సమాధానం చెప్పాడు. "ఓ వ్యక్తి మీ ఇంటికి వస్తాడు. మీ వాచీని అడిగి తీసికొని దాన్ని పట్టే టైమ్ ఏమిటో మీకు చెబుతాడు. ఆయన చెప్పేది నిస్సందేహంగా తప్పుడు టైమే. ఆ తర్వాత మీ వాచీ పనిచేయడం లేదని మిమ్మల్ని నమ్మించి, తనతో తీసుకొని వెడతాడు. కన్సల్టంట్ అనే వ్యక్తి నా దృష్టిలో, సరిగ్గా ఇలాంటి వాడు."

అందరూ పగులబడి నవ్వారు.

గోఖలే, స్థితి మామూలయ్యాక ఇలా అన్నాడు. "కొంప తీసి, నా వాచీని మీరు **తీసుకెళ్ళడం లేదు కదా !"**

చిత్తరంజన్ తడుముకోకుండా అన్నాడు. "ఔను! ఖచ్చితంగా తీసికెడుతున్నాను. కచ్చితమైన టైమ్ చూపెట్టుగా చేసి తిరిగి ఇస్తాను. సందేహించకండి."

కొన్ని క్షణాలపాటు ఆగి మళ్ళీ ఉపక్రమించాడు." మీరు జ్ఞానాన్ని అనుభవాన్ని గడించేందుకు సాధనం గడియారమే. సలహాదారుడు మీ సంస్థను సందర్శించి పరిష్కారం సూచించటంతో పాటు జ్ఞానాన్ని మీకు అందిస్తాడు. తానూ జ్ఞానాన్ని అనుభవాన్ని గ్రాహక సంస్థ నుండి గడిస్తాడు. మీతో జరిపిన ముఖాముఖి నుండి ఓ కొత్త అంతర్దృష్టిని పొందుతూ, సరైన పరిష్కారాన్ని మీకు అందిస్తాడు.



మనం నేర్చుకోనిది ఇతరులకు నేర్పేది ఏదీ ఉండదు.
ఇతరులకు నేర్పక మనం నేర్చేది ఏదీ ఉండదు.

# 12. తర్ఫీద్

**(బలరామ్‌భాయి కిషన్‌భాయిల కథ)**

**బ**లరామ్‌భాయి కిషన్భాయి లనే వాళ్ళు ఇద్దరు అన్నదమ్ములు. అహమదాబాద్‌లో పెద్దాయన, బరోడాలో చిన్నాయన స్థిరపడ్డారు. ఏదో పని మీద ముంబాయికి వెళ్ళిన ఆ సోదరులు అక్కడ కవలలైన అల్సేషన్ కుక్కపిల్లల్ని కొనుక్కుని తమతమ చోట్లకి తిరిగి వెళ్ళారు.

అహమదాబాదులోని అన్నగారు తన కుక్క పిల్లకీ టామీ అని పేరు పెడితే, బరోడాలోని తమ్ముడుగారు తన దానికి జిమ్మీ అని నామకరణం చేశారు.

చూస్తూండగానే ఆర్నెల్లు గడిచాయి. టామీ వట్టి రౌడీగా తయారయ్యాడు. మొరగడమే కాదు ఇంటికి వచ్చేవాళ్ళను కరవడం మొదలెట్టాడు.

యజమాని మాట అసలే పట్టించుకునే వాడు కాదు. యజమానుల పడకగదిలో, రేవతిబేను నచ్చకున్నా, నిదురోడానికి పట్టు పట్టేవాడు. రోజు రోజుకు మితిమీరుతున్న టామీ ఆగడాలు బలరాము మనస్తాపానికి గురి చేశాయి.

ఓసారి, సతీసమేతంగా బలరామ భాయి, బరోడాలోని తన సోదరుని ఇంటికి వెళ్లి ద్వార ఘంటికను నొక్కాడు.

తలుపు తెరవడమే తరువాయి, తన యజమానితో బాటు ఒక పెద్ద కుక్క బాణంలా దూసుకొని వచ్చి అతిథుల మీద పడబోయింది. కిషన్భాయి ఘాటుగా సరైన సమయంలో హెచ్చరించాడు.

“ఈయన మా అన్నగారు. ఓ మూలకి వెళ్ళి ఈ బంతితో ఆడుకో పో..”

క్షణార్ధంలో జిమ్మీ శాంతించాడు. తోకను ఊపుతూ శ్రీమతి రేవతీబేన్ కరచాలనం కావించి, చల్లగా అక్కడ నుండి జారుకుని ఓ చోట బంతితో ఆడటం మొదలెట్టాడు.

బలరామ్‌భాయి ఆశ్చర్యానికి మేరలు లేవు. తమ్ముని వైపు చూస్తూ అడిగాడు. “ఈ కుక్క ఎక్కడిది ?”

“గుర్తుపట్టలేదా భయ్యా! వీడు జిమ్మీ మీ టామీకి వెనుదన్ని పుట్టిన తమ్ముడు.” అన్నాడు కిషన్‌భాయి.

అన్నగారు బాధను ధ్వనించే స్వరంతో ఇలా అన్నాడు.

“ఏమి చెప్పను తమ్ముడూ ! మా టామీ గాడు పోకిరి వెధవగా తయారయ్యాడు. వాడి ఆగడాలు ఒకటా రెండా... అయినా నీ జిమ్మీ చూట్టానికి భయంకరంగా వున్నా ఎంచక్కా తయారయ్యాడు.”

అన్నగారితో తమ్ముడిలా అన్నాడు. "అందులో గొప్పేమిటన్నయ్యా! మనం ఇచ్చే తర్ఫీదును బట్టి అంతా ఉంటుంది. వాడిని క్రమశిక్షణలో పెంచాను కనుకనే అలా తయారయ్యాడు. జిమ్మీకి మహా తెలివితేటలున్నాయి."

బలరామ్‌భాయి తమ్మునితో మళ్ళీ అన్నాడు. "ఇక్కడ నిలబడి మాట్లాడుకునే బదులు లోనికి వెడదాం పద."

మాటామంతీ చెప్పుకుంటున్న ఏరాళ్ళకు ఇబ్బంది కలుగకుండా, అతిథిగదిలోకి వెళ్ళి కూర్చొన్నారు. తలుపులు దగ్గర పెట్టేసి బలరామ్ ఇలా అన్నాడు. తమ్ముడూ! టామీని



బ్రహ్మయినా ఏం చెయ్యలేడు. అయినా జిమ్మీని ఇలా తయారు చేసిందెవరు ? ఆయన పేరు చెప్పు. నీకు పుణ్యముంటుంది.

కిషన్‌భాయి శాంత స్వరంతో అన్నాడు. "ఎవరెందుకు ...నేనే..."

బలరామ్‌భాయికి కల్గిన ఆశ్చర్యం ఇంతా అంతా కాదు. టామీ బాగుపడతాడన్న గంపెడంత ఆశతో ఇలా అడిగాడు. "తమ్ముడూ! నీవు అవలంబించిన తంత్రం అతి రహస్యంగా ఉంచక, కాస్త విడమరిచి చెప్పు"

కిషన్‌భాయి అన్నకేసి చూస్తూ అన్నాడు. "అన్నయ్యా మీరూహించినంత కష్టసాధ్యమేమీ కాదు. ఇందులో పచ్చి రహస్యం ఏది లేదు."

ఓ క్షణం పాటు ఆగి చల్లగా అనేశాడు

"కుక్క కంటే యజమాని బాగా తెలిసిన వాడై ఉండాలి.'

**తెలిసి తేటల్లో ఆచార్యుడు శిష్యుణ్ణి, నేత అనుయాయిని మించాలి.**

**జ్ఞాన క్షేత్రాన్ని విస్తృతం చేస్తూ పోవడమే అధ్యాసనలోని అసలు రహస్యం.**

# 13. ప్రగతికి చేయూత

**(త్రివేంద్రం ఉపాధ్యాయుని కథ)**

**త్రి**వేంద్రంలో బాగా పేరుపోయిన ఒక పాఠశాల ఉంది. ప్రతి సంవత్సరం పరీక్షా ఫలితాలు బాగుంటాయని చెప్పనక్కర లేదు. ఆ పాఠశాలలో చదివినవారు మంచి నాగరికులుగా ఎదగడమే కాకుండా, వివిధక్షేత్రాల్లో బాగా రాణించారు.

సని ఎయిబ్రహము వేణు ఇచ్చిన సమాధానం బాగా ఇబ్బంది పెట్టింది. ఏమీ అనకుండా తరగతి  ఎదగర వెలుపలికి వచ్చారు. వెనకాలే వస్తున్న మీనన్ ను అడిగారు.

పాఠశాల విద్యార్థులను తీర్చిదిద్దటంలో, పాఠశాలకు ఎనలేని ఖ్యాతి ఆర్జించి పెట్టడంతో ఉపాధ్యాయులదే ప్రధానపాత్ర. జ్ఞానదానంతో పాటు విద్యార్థులను ఆలోచించేందుకు, ఎదురైన సమస్యలకు పరిష్కారం వెదికేందుకు ప్రోత్సహించేవారు. అనుశాసన బాధ్యత విద్యార్థులకే ఎక్కువ వదిలిపెట్టేవారు. వారి సృజనాత్మకత అభివ్యక్తి స్థితిని అందుకునేలా శ్రమించేవారు. అధ్యాపకునికి అధ్యేతకూ మధ్య సంవాదం సాధించగలిగారు.

ఒకనాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎయిబ్రాహమ్ మాథ్యూగారు ఆన్కూలును సందర్శించారు.

తరగతిలో పాఠాలు చెబుతున్న ఓ ఉపాధ్యాయుణ్ణి బయట కాహ్వానించి ఆయనను విద్యాశాఖాధికారికి ప్రధానాచార్యుల వారు ఇలా పరిచయం చేశారు.

"సర్! ఈయన శ్రీ ఉన్నికృష్ణ మీనన్ గారు. గణితాన్ని బోధించే అధ్యాపకుల్లో, మన కేరళలో, ఈయన ప్రథమంగా గణణీయుడు. గత సంవత్సరం ప్రెసిడెంటు గోల్డ్ మెడల్ తో సమ్మానితులయ్యారు.

మాథ్యూగారు మీనన్ పేరు ఇదివరలో చాలా సార్లు విన్నారు. ఎంతో ఉత్సాహంతో కరచాలనం చేస్తూ ఇలా అన్నారు.

"అన్యథా భావించపోతే, మీ విద్యార్థుల్ని కొన్ని ప్రశ్నలడుగదలచాను."

మీనన్ అధికారిని సాదరంగా లోనికి ఆహ్వానించారు.

"మీరే విద్యార్థినైనా ప్రశ్నలడగండి."

అది నాల్గవ తరగతి : మాథ్యూ గారు మూడవ వరుసలో కూర్చున్న విద్యార్థి వేణు అని తెలిసికొని ఈ ప్రశ్న వేశారు.

"వేణూ ! ఐదులో ఐదు కల్పితే ఎంత?"

లేత చామన చాయలో వుండి అందంగా అగుపడే విద్యార్థి లేచినిలబడి జవాబిచ్చాడు.

"ఎనిమిది."

ఉన్నీకృష్ణన్ విద్యార్థిని 'భేష్' అని మెచ్చుకున్నాడు. విద్యార్థులు చప్పట్లు చరిచారు. ఎయిబ్రహమ్‌ను వేణు ఇచ్చిన సమాధానం బాగా ఇబ్బంది పెట్టింది. ఏమీ అనకుండా తరగతి వెలుపలికి వచ్చారు. వెనకాలే వస్తున్న మీనన్‌ను అడిగారు.

ఐదులో ఐదు కూడిక చేస్తే ఎంత మిస్టర్ మీనన్?"

"పది." సమాధానం చెప్పాడు మీనన్.

ఇన్‌స్పెక్టరుగారు మరో "షాకు" తిన్నారు.

వాడు తప్పు సమాధానం చెప్పాడు – సరిదిద్దడం అటుంచి "భేష్" అన్నారేమిటి?



స్నేహం వ్యంజితమయ్యే స్వరంతో ఇలా అన్నాడు. సర్ ! ఈ ప్రశ్ననే మూడు రోజుల క్రితం అడిగివుంటే వేణు "ఆరు" అని చెప్పేవాడు. పది వరకు చేరుకునటానికి అవకాశం ఈయాలి కదా !

కాసేపు ఆగి మళ్ళీ అన్నాడు. సర్! అధ్యేతతో అధ్యాపకుడు, అనుయాయితో నేత గమ్యం చేరే వరకు తోడుగా వెళ్ళడు. దిశను మాత్రమే చూపిస్తాడు. విద్యార్థి లేదా అనుచరుడు ఒంటరిగానే ప్రయాణం చేయాల్సి ఉంటుంది.

మీనన్ సమాధానం మాథ్యూగారిని తృప్తి పరచింది.

ఎవరూ ఎవరినీ వృద్ధికి తేజాలరు.
స్వయంకృషితోనే సాధించాల్సి వుంటుంది.
ఏ ప్రక్రియలోనైనా ఇతరులందించేది సాపు మాత్రమే.

# 14. బొమ్మా - బొరుసు

**(అహమద్ - అశోక్ పటేల్ కథ)**

**బ**రోడానగరంలో ఓ పెద్ద పెట్రోల్పంపు ఉంది. రకరకాల వాహనాలకు ఇంధనం తీసుకోనేందుకు వేరు వేరు క్యూలు ఉన్నాయి. ఇక్కడ ఏర్పర్చిన వ్యవస్థ అంతా స్వయంచాలితం అంటే పూర్తిగా యాంత్రీకరింపబడినదన్నమాట.

ఆఫ్రికాలో, అశోక పటేల్ అనే ఆయన రెండు చేతులా ఆర్జించి, ఇండియాకు తిరిగి వచ్చాక, ఈ పెట్రోల్ పంపును పెట్టాడు. ఆయనే దీనికి ఏకైక యజమాని. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ప్రవేశించిన కారణంగా సాధారణతకు కాస్త ప్లస్ లేక మైనస్ అయిన వ్యక్తిత్వం ఆయనది నానారకాల డేటా బ్యాంక్స్ని తన బహుస్థానీయదర్శకవ్యవస్థలో ప్రతిష్ఠితం చేశాడు. బటన్ నొక్కితే చాలు పంపు ఆవరణలో ఏమూల ఏమి జరుగుతున్నదో మానిటర్ పై చూడగలడు. ఉపరితలంపై లేదా నేల క్రింది సర్వీస్ సెంటర్లో ఎప్పటికప్పుడు జరిగిన అమ్మకాల గురించి, మిగిలిన నిల్వల గురించి ఎవరైనా అడిగితే చిటికెలో చెప్పగలడు.

ఒకనాడు దినేశ అనే ఆయన తాను ఇటీవలె ఖరీదు చేసిన టాటా సఫారీలో వాణిజ్య సంబంధమైన పనిమీద బరోడాకు వచ్చాడు. ఆయనకు కార్లంటే మహామోజు. నచ్చితే చాలు కొనేస్తాడు. ఇటీవలె కొన్న టాటా సఫారీ పై ఆయనకు ఎనలేని మమకారం మధ్యాహ్న భోజన నిమిత్తం "వెలకమ్" హోటల్ వైపు కారులో వెడుతున్నాడు. పెట్రోల్ పంపుకు కొంచెం దూరంలో ఆయన కారు తన గమనశీలాన్ని హఠాత్తుగా కోలుపోయింది.

ఇంజన్ని రీస్టార్ట్ చేసి చూశాడు. టాటా సఫారీ గుడ్... గుడ్... శబ్దం చేస్తూ జనాలలో కలవరం రేపడం తప్ప జడస్థితి నుంచి బయట పడే చిన్నె లేవీ చూపించలేదు. అక్కడ వున్న ఆటో రిక్షావాలాలు, మిత్రుడు మనోజ్ టాటా వారి ఈ "అపూర్వసృష్టి"ని తోస్తూ, తోస్తూ సర్వీస్ కేంద్రం వరకు తెచ్చారు. రిపేరు గురించి ఎవరిని సంప్రదించాలో, దినేశ్ ఓ హెల్పర్ను అడిగి తెలుసుకున్నాడు.

భుజాలపై లాప్టాప్ బ్యాగ్, చేతిలో సెల్ఫోన్ ఉన్న దినేశ్ ఏ కోవకు చెందిన వాడో హెల్పర్కు రెప్పపాటులో అర్థమైంది. "అశోకాభాయి దగ్గరికి వెళ్ళండని" సవినయంగా సూచించాడు.

పై అంతస్తులో ఉన్న అశోక్భాయి దగ్గరకు మెట్లమీదుగా వెళ్ళాడు. అశోక్ భాయి ఆఫీసును చూడటానికి 'కొలువైన నిను జూడ కలవా కన్నులు వేలు' అన్నట్లు రెండు కళ్ళు చాలవు. చిరునవ్వుతో అభివాదం చేస్తూ అన్నాడు. "ఈ సఫారి ఫేయిలయ్యింది. ఇంజన్ రిపేరయ్యే విషయంలో మార్గం చూపగలరని వచ్చాను."

దినేశ్ మాట వినగానే అశోక్భాయి శరీరంలోని ప్రత్యణువు విద్యుత్ప్రేరితమయ్యింది. "లోనికి దయచేయండని" దినేశ్ను ఆహ్వానించాడు.

గోడ పై వేలాడుతున్న ప్రొజెక్టరు తెరను విప్పాడు లాపటాప్ ప్రొజెక్టరును ఆన్ చేసి ఎన్నో బటన్లను నొక్కాడు. తెర చైతన్యవంతమైంది. మొదట మానిటర్ పై సఫారి బొమ్మ, ఆ కదలికలకు తన కదిలే వాఖ్యానాన్ని జత పరిచాడు. "సర్! అద్భుతమైన ఈ సఫారి ఇంజన్ ఇంజనూ మరియు ఇంజన్ క్రాస్ సెక్షన్ తెరమీదికి వచ్చాయి. తెరపై గమనశీలక మూషికం క్రాస్ సెక్షన్ను గమనించండి."

ఇంధనానికి చేర్చబడే ముందు గాలి ఎన్ని ప్రక్రియలకు లోనయ్యేదీ, చేర్చబడ్డాక ఇంధన మిశ్రమం టర్బో చార్జర్ ద్వారా సిలెండర్ సిస్టమ్లోకి ప్రవేశించే పూర్వం అణ్వీకరించబడే ప్రక్రియను, పిస్టన్ కదిలికనూ, క్రామ్ షాఫ్ట్ పరిభ్రమణాన్ని, క్రామ్ షాఫ్ట్ చక్రాలను గమకితం చేసే బిందువు వద్ద వ్యాఖ్యానాన్ని ముగించాడు.

మానిటర్ పై ఇదంతా చూస్తున్న దినేశ్ మనస్సులో ఆశలు రేకెత్తాయి. మనిషి ప్రమేయం లేకుండానే కారు రిపేరు అవుతుందన్న భరోసా కల్గింది.

"దోషమంతా ఇక్కడే వుంది" అని అశోక్ అనటంతో, దినేశ్కు సందేహం వేసి ఇలా అన్నాడు. "మీరు ఇంజను రిపేరు చేస్తారనే భావిస్తాను."

పటేల్ కాస్త చికాకు కనబరుస్తూ "క్రింద అహమద్ ఉన్నాడు. వెళ్ళండి" అని ముక్తిసరిగా సూచించాడు.

ఉస్సురంటు దినేశ్ మెట్లు దిగి సర్వీస్ సెంటర్కు చేరుకున్నారు. ఊరికే కాలయాపన మౌతుందన్నందుకూ, మధ్యాహ్నాభోజన వేళ దాటి పోతున్నందుకు విచారిస్తున్న వేళ, నీలి యూనిఫార్మ్తో, స్పానర్ స్క్రూడ్రైవర్లు చేతపట్టుకుని అహమద్ ప్రత్యక్షమైనాడు.

దినేశ్ అహమద్ ఇలా అన్నాడు. "మిత్రమా! ఇంజన్లో లోపం ఏర్పడింది. గుడ్రుడ్ శబ్దం తప్ప మిల్లీమీటరు కదలటం లేదు.

ఏదో చెప్పబోతున్న దినేశ్ను నివారిస్తూ, 'కారును సర్వీస్ లైనులో పెట్టమన్నాడు. మానిటర్ పై తాను చూచినది చెప్పబోతుంటే అహమద్ "బానెట్ తెరవండి" అని బిగ్గరగా అరిచాడు.

దినేశ్ అహమద్ చెప్పినట్లు చేశాడు.

"ఇక ఇంజన్ స్టార్ట్ చేయండి" రెండవ హుకుమ్ అహమద్ జారీ చేశాడు.

"ఇంతకూ ఏమయ్యింది?" అడిగాడు దినేశ్

అహమద్ వినిపించుకోకుండా స్క్రూడ్రైవర్తో దేన్నో కదిలించాడు.

టిక్ – ధన్ – టిక్ – ధన్ తో ఇంజను ప్రతిస్పందించింది.

"ఇంజన్ స్టార్ట్ చేయండి" : మూడవ ఫర్మాన్.

దినేశ్ ఇంజన్ స్టార్ట్ చేశాడు.


గర్ – గర్ – గర్ ఇంజన్ బాణీని మార్చింది. అహమద్ 'స్టాప్' అన్నాడు.

దినేశ్కు టింగ్ – టింగ్ శబ్దం వినిపించింది. మళ్ళీ అహమద్ 'స్టార్ట్' అన్నాడు.

దినేశ్ స్టార్ట్ చేశాడు. ఇంజన్ ఈ సారి సింహంలా గర్జించింది. దినేశ్ సంతోషానికి పట్టపగ్గాలు లేవు. అభినందనలతో ముంచేస్తున్న చూపుతో దినేశ్ అన్నాడు. "అహమద్భాయి! నీవు ఏమి చేశావో చెబుతావా?

"పై వాడిని అడగండి."

దినేశ్ మనసులో అనుకున్నాడు. అహమద్ – పటేల్ అనేది దీనికి పూర్తి సమాధానం.




సిద్ధాంతం - వ్యవహారం నాణానికి బొమ్మా - బొరుసు వంటివి.

# 15. నేర్పడానికి మార్గం

**(సూరత్‌కు చెందిన సూత్రధారుని కథ)**

**'సూ**రత్ నాట్యమండలి ప్రదర్శన నిమిత్తం ఓసారి పోర్బందరుకు వచ్చింది. ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో వచ్చేందుకు పలు ప్రకటనలు చేశారు. వాడవాడలో గోడ గోడకూ పోస్టరులతికించారు. హరిశ్చంద్రనాటకంతో ప్రదర్శన మొదలవుతుందని నగరంలో చాటింపు వేశారు.

సత్యహరిశ్చంద్రుని కథ అంటే గుజరాతీలకు పరమాన్నంతో సమానం. ఎన్నిసార్లు చూడటానికైనా ఇష్టపడతారు. హరిశ్చంద్రుని సత్యనిరతి వాళ్ళ జీవితాల్ని ఎంతగానో ప్రభావితం చేసింది. పోర్ బందరు ప్రజలు నాటకం చూశాక, సత్యపథంలో నడవటానికి ప్రేరణ దొరుకుతుందని భావించారు. ఊహించినట్లుగానే 'నాట్యగృహం' సాయంత్రం ఏడు గంటలకే ప్రేక్షకులతో క్రిక్కిరిసి పోయింది.

సూత్రధారుడు తెరముందు నిలిచి, ప్రేక్షకులకు అభివాదం చేశాడు. నాటకం మొదలవుతుందన్న ఆశాభావంతో ప్రేక్షకులు కరతాళ ధ్వనులు చేశారు. సూత్రధారుడు నాటకారంభాన్ని ఘోషిస్తాడని ఆసక్తితో ఎదిరి చూస్తున్నారు.

మంగళాచరణాత్మకమైన 'నాంది' పలుకడానికి బదులు ప్రేక్షకులను ఇలా ప్రశ్నించాడు. ప్రేక్షమహాజనులారా ! నిరంతర సత్యవ్రతుడైన హరిశ్చంద్రుని కథ మీకు తెలియునా?"

ప్రేక్షకులు చేతులెత్తి 'తెలుసు' అని బిగ్గరగా అన్నారు.

సూత్రధారుడు గాంభీర్యం ధ్వనించే స్వరంతో ఇలా అన్నాడు.

"తెలిసిన వారికి తెలపేదేమున్నది? మీరు ఇక నిష్క్రమించవలెనని నా ప్రార్థన."

హాలునుండి దిగ్భ్రాంతులైన ప్రేక్షకులు బయటకు వచ్చి నాట్య గృహ ప్రాంగణంలో సమావేశమయి, సూత్రధారునికి మరుసటి సాయంత్రం తగిన గుణపాఠం చెప్పాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు వ్యూహాన్ని రూపొందించుకున్నారు.

మరునాటి సాయంత్రం ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో వచ్చి, టికెట్లు కొనుక్కొని నాటకం మొదలయ్యే ముందే సీట్లలో కూర్చున్నారు. నిన్నటి లాగానే సూత్రధారుడు మందస్మితం చేస్తూ తెరముందు నిలిచి ప్రేక్షకుల వైపు చూస్తూ ఇలా అన్నాడు.


"ప్రేక్షకమహాజనులారా! సత్యం కోసం ఏ మూల్యమైనా చెల్లించేందుకు సిద్ధపడిన హరిశ్చంద్రుని కథ మీరు విన్నదేనా?"

ప్రేక్షకులు ఏక కంఠంతో 'తెలియదు' అని బదులు చెప్పారు.

అసహాయతను ప్రదర్శిస్తూ చేతులెత్తి సూత్రధారుడు ఇలా అన్నాడు.

"తెలియని వారికి తెలియజెప్పే ప్రయత్నం ఎలాంటి ఫలితాన్ని ఈయదు. కుందేటి కొమ్ము సాధించవచ్చు - అజ్ఞానులను జ్ఞానులుగా ఎవరూ మార్చలేరు. మీరిక నిష్క్రమించవచ్చు."

సూత్రధారుడు క్షణార్ధంలో తెరమరుగయ్యాడు.



సూత్రధారుని వల్ల మరోమారు "దేవానాం ప్రియులుగా" చేయబడ్డామన్న భాదతో హాలు వదలి మళ్ళీ ప్రాంగణంలో సమావేశమయ్యారు. అన్ని కోణాల నుండి ఆలోచించి పకడ్బందీగా వ్యూహాన్ని నిర్ణయించుకున్నారు.

సూత్రధారుడు నగు ముఖంతో తెరముందు నిలిచి యథాపూర్వం ప్రేక్షకులకు అభివాదం చేసి ఇలా అన్నాడు.

ప్రేక్షక మహాజనులారా! సత్యవాదిత్వం వల్ల అజరామరుడైన హరిశ్చంద్రుని కథ మీరు ఆద్యంతం ఎరుగుదురా?

ప్రేక్షకులలో సగం మంది సకారాత్మకంగా, మిగతా సగం మంది నకారాత్మకంగా స్పందించారు. సూరత్ నాట్యమండలి సూత్రధారుడు ప్రేక్షకులను ఇలా సంబోధించాడు.

"మీరిక్కడి నుండి దయచేసి, బయట సమావేశమై, తెలియని వారు తెలిసిన వారి నుండి సర్వం తెలుసుకొనండి."

ప్రేక్షకులకు కాలిక్రింది భూమి కదిలినట్లయింది. ఒక్క పెట్టున లేచి నిలుచున్నారు. సూత్రధారుడు నత శిరస్కుడై అభివాదం చేస్తూ, వాళ్ళను శాంత పరచే విధంగా ఇలా అన్నాడు. "దయచేసి ఎవ్వరూ వెళ్ళకండి మీమీ ఆసనాలలో కూర్చుండండి."

"ఒకరికి నేర్పడం ఒకరినుండి నేర్చుకోవడం మీ జీవన విధానంగా చేసుకున్నారు. తెలియని వారు తెలుసుకొనేందుకు తెలిసిన వారి స్మృతులను జాగరితం చేసేందుకు సత్యవాది హరిశ్చంద్ర నాటకం ఇక ఆరంభం చేయబోతున్నామని మనవి చేసుకుంటున్నాను."

ఒజ్జల నుండి నేర్వడం మంచిది.
ఒకరు ఇంకొకరికి నేర్పుతూ,
ఇంకొకరి నుండి ఒకరు నేర్చుకొనడం మరీ మంచిది

# 16. పరిష్కారం చేయిదాటిన వేళ

**(రెండు పిల్లుల కథ)**

**ఒ**కానొక ఊరిలో రెండు పిల్లులుండేవి. ఒకటి రామూ, రెండవది శ్యామూ. ఒకనాడు అవి ఓ మోస్తరు సైజు జున్నుముద్దను కైంకర్యం చేసి తమతమ వాటాను పొందే నిమిత్తం ఓ చెట్టు కిందకి చేరుకున్నాయి. "పంపకం" చేయడమంటే మాటలా? సమాన భాగాలు చేయడమంటేనే పంపకం. అలా చేయడానికి సాధనాలు కావాలి. సాధానాలుంటే సరా! బుద్ధి ఎవరి నుండి అరువుగా తేవడం? సాధానాలూ బుద్ధీ రెండూ లేకపోవడం వల్ల విభజన ఒక సమస్య అయికూర్చుంది. దీనికి పరిష్కారమేమిటని రామూ అడగ్గా, సలహాదారుణ్ణి ఆశ్రయించడమే తక్షణ కర్తవ్యమని శ్యామూ సూచించాడు.

ఆ ఊరిలో సలహాదారుడైన కపీశ్వర్రావు గారితో వాటికి చిరపరిచయం ఉంది. ఏ మాత్రం కాలయాపన చేయకుండా మర్జాల ద్వయం కపీశ్వరుని కార్యాలయం చేరుకుంది. ఓ భవన సముదాయంలో ఆ కార్యాలయం ఉంది. తాళఫల ప్రమాణంలో తళుకులీనే ఇంగ్లీషు అక్షరాలలో బోర్డు ఉంది. **KAPISHWARA RAO & ASSOCIATES** ఆ బోర్డును పిదప కార్యాలయాన్ని ఆ పిదప భవనాన్ని చూసి అవి ఎంతో సంతోషించాయి.

బిడాల సహజమైన బిడియం కనబర్చకుండా అవి ఠీవీగా ఆసీనుడైన రావు గారి కేబిన్ లోకి ప్రవేశించాయి. సలహాదారుడు రావు లేచి వాటికి ఘన స్వాగతం చెబుతూ ఏమి పని మీద ఇందాక వచ్చారు అని వినయంగా అడిగారు. తాము ఎదుర్కొంటున్న సమస్యను విడమర్చి చెప్పి, చెట్టుకిందకు రమ్మని సాదరంగా ఆహ్వానించాయి.

**"ఈ సమస్యకు పరిష్కారం ఉంది"** అన్నాడు రావు. వాటికి నమ్మిక కిలిగిస్తూ

ఆ తర్వాత తనకు సహాయకులుగా పనిచేస్తున్న రెండు యువ వానరాల్ని, త్రాసునూ తాడు ముక్కను తోడుగా తెమ్మని పురమాయిస్తూ, క్లయింట్లతో సహా ఆ చెట్టు ఉన్నచోటికి బయలు దేరాడు.


అరగంటలో వారు, వారి వెనుకే సహాయకులు అక్కడికి చేరుకున్నారు. చెట్టు క్రింది కొమ్మకు త్రాసును వేలాడదీసి తటస్థభారాన్ని శూన్యం వద్ద స్థిరపరచారు.

కపీశ్వరుడు జున్ను ముద్దను రెండు భాగాలుగా విభజంచి ఓ దాన్ని "క" పళ్ళెంలో మరోదాన్ని "ఖ" పళ్ళెంలో ఉంచారు. ఖ వైపు మొగ్గు వుంది.

'ఈ భాగం కాస్త బరువుగా ఉంది. తగ్గించాలి.' అంటూనే ఓ చిన్న ముక్కను నోటిలో వేసుకున్నాడు. మరోసారి తూకం వేయగా సూచిక "క" వైపు మొగ్గు చూపింది. రావు మళ్ళీ అదే పద్ధతిని అనుసరించాడు. రెండింటిలో జున్ను మటుమాయమయ్యే వరకు కపీశ్వరరావు ఈ ప్రక్రియనే కొనసాగించారు. చప్పట్లూ చరుస్తూ, అంతా సజావుగా

అయ్యిందని తన ఫీసు మరువొద్దని చెబుతూ, సహాయకులు తన్ను అనుసరించగా కార్యాలయం వైపు చకా చకా నడక సాగించారు.

రాముా, శ్యాములు ఖంగు తిన్నారు. తేరుకున్నాక మాయాజాలం వారికి అర్థమయింది. నష్టాన్ని చవి చూశాక, కళ్ళు తెరిచారు. మున్ముందు ఇలా వ్యవహరించేది లేదని నిర్ణయించుకున్నారు. కథ ఇంకా కంచికి వెళ్ళలేదు.



అచిరకాలంలోనే అదృష్ట దేవత వాటిని వరించింది – గతంలో కంటే పెద్ద సైజుగల జున్ను ముద్దను తస్కరించటంలో కృతకృత్యులై మళ్ళీ అదే చెట్టు కిందికి చేరుకున్నాయి.

రామూ అన్నాడు : తూనికకు సాధనాలేవి? రావు గారి మధ్యవర్తిత్వాన్ని కోరకుండా త్రాసును అరువు దెచ్చుకుంటే ఏం నష్టం?

శ్యామూ ఈ మాటకు మండిపడుతూ ఇలా అన్నాడు. “ఛ. వాడి పేరు ఎత్తకు. వాడి కూనిరాగాలలో కుతంత్రం వుంది. దీన్ని వాడే ఆరగిస్తాడు. ఎవడిని పిలవకుండానే ఉన్న దాన్ని సరిసమానం చేసుకుందాం.” అన్నాడు.

రామూ ఉత్సాహంతో స్పందిస్తూ ‘శుభం’ అన్నాడు. వాడికి ఓ ఆలోచన తట్టి ఇలా అన్నాడు. మనలో ఒకడు దీన్ని రెండుగా చేయాలి. తనకు నచ్చిన దాన్ని రెండవ వాడు తీసుకోవాలి. మిగిలిన దాన్ని పంచేవాడు.

ఇందుకు శ్యామూ అన్నాడు. “భేష్. ఎవరు పంచాలి.?”

రామూ : “పెద్దవాడు పాళ్ళు పెట్టడం, పిన్నవాడు ఏరుకొనడం లోకంలో ఉన్నదే కదా!” రామూ నీతి శాస్త్ర కోవిదునిలాగా మాట్లాడాడు. శ్యామూ సరే అన్నాడు.

పాళ్లు పెట్టడంలో పొరపాటు జరిగితే, పంచేవాడు నష్టపోవాలి. – ఇది తెలిసిన రామూ మార్జాల సాధ్యమైన వివేకంతో భాగాలేర్పర్చాడు. ఎవరి భాగం వాళ్ళు తీసుకోవడం అయిపోయింది. రాము తన భాగం నుంచి ఓ చిన్న ముక్కను శ్యాముకు ఈయదలచి ఇలా అన్నాడు.

“శ్యామూ! నీవంటే నాకు ప్రాణం. దీన్ని తీసుకో.” శ్యామూ సంతోషంగా తీసుకున్నాడు. ఆ తరువాత ‘విభజన’ అన్నప్రశ్న వారి మధ్య ఏనాడూ తలెత్తలేదు. అర్పణ స్వీకారాలు వారి శ్వాసల్లో శ్వాసలయ్యాయి.

సంగచ్ఛధ్వం సంవదధ్వం సంహోమనాంసి జానూమ్
దేవా భాగం యథా పూర్వే సంజానానా ఉపాసతే.
(ఋ.వే. 10-12-1910

# 17. ఆలోచించి అడుగువెయ్యి

(శేర్పా ముంగేరీల కథ)

నవ వివాహితులైన శైలాజా వేదలు తమ కొత్త ఇంటికి ఇటీవలే మారారు. ఓ రెండేళ్ళ పాటు పిల్లలకై వేచి చూడాలని నిర్ణయించుకున్నారు. ఇల్లు కాదన్న భావన వాళ్ళనూ వేధిస్తూనే ఉంది.

ఓసారి లక్నో వెళ్ళినపుడు ముద్దులు మూటకట్టే రెండు కుక్కపిల్లల్ని కొని ఇంటికి తెచ్చుకున్నారు. అవి ఒకే సారి పుట్టాయి. ఇంటికి తెచ్చుకున్న తర్వాత వాటికి శేర్పా – ముంగేరి లాల్ అని ముచ్చటైన పేర్లు పెట్టుకున్నారు.

పేరుకు తగినట్టు నేర్పా పరమ సాహసి. పర్వాతారోహకునికుండాల్సిన లక్షణాలు వాడికి ఉన్నాయి. సోఫా మీదికి, యజమాని భుజాల మీదికి లేదా ఎత్తుగా ఉన్న దేనినైనా ఎగబాకడం అంటే వాడికి మహా సరదా.

మరి ముంగేరిలాల్, శర్పా వలె కాక, మహా స్వప్నాళువు. కనులు మూస్తూ తెరుస్తూ, కలలుకంటూ ఓమూల హాయిగా నిదురపోయేవాడు.

అన్నదమ్ముల్లో ఉండాల్సిన ప్రేమానురాగాలు వారిలో కొట్టొచ్చినట్లు కనపడేవి. ఓసారి కూడి మాడి ఆడుకునేవార్ఘ్మ పైర లేచినప్పుడు కయ్యానికి దిగేవారు.

కొలనులోని రెండు కలువ మొగ్గల్లా, చెట్టు కొమ్మకు వేలాడే రెండు తేనె పెరల వలె, కొన్ని నెలల్లోనే ఎదిగి ఇంటిని ఏలసాగారు.

ముందే చెప్పినట్లు శేర్పా పరమసాహసి. ఏదైనా ఆలోచన వస్తే చాలు తక్షణమే కార్యరంగంలోకి దూకేవాడు.

ఆలోచనను కార్యరూపంలో పెట్టే నిర్ణయం, సంభావ్యపరిణామాల్ని అంచనా వేయడం, క్షణంలో జరిగిపోయేవి.

ఇది సంక్షిప్తంగా శేర్పా పరిచయం.

ముంగేరిలాల్ సప్నాళువు. ముందు వెనుక ఆలోచించకుండా ముందుకు దూసుకపోయేవాడు కాదు. అన్ని కోణాల నుండి పరిశీలించడం, విశ్లేషించడం, అంచనా వేయడం, వారాలూ, నెలలూ పర్యాయాల్ని ఆలోచిస్తూ వుండడంలో అసలు చేయాల్సిన పనినే విస్మరించేవాడు. ఇది ముంగేరిలాల్ పరిచయం.

శేర్పా దృష్టిలో ముంగేరిలాల్ పక్షవాత గ్రస్తమైన విశ్లేషణకు ప్రతీక్ష్మ ముంగేరిలాల్ దృష్టిలో శేర్పా మూర్తీభవించిన అతిరేకత.

ఒకనాడు 'పక్షవాతం' 'అతిరేకత' పెరటిలోని పుష్కరిణి చుట్టుగల పచ్చిక పై పడుకుని

ఏవో ఆటలు ఆడుకుంటున్నారు. ఇంటి యజమానులకు దక్షిణ దేశీయులైన గురూజీ ఆరోజు అతిథి. ఆయన పూర్తిగా శాకాహారి, ఆయన కోసం ఇడ్లీలు ఉల్లిపాయలు వేయని సాంబారు "రాము" చేత చేయించారు. శేర్పా ముంగేరీలు ఇంట్లో లేక పోవడం గమనించిన గురూజీ వేద్‌ను అడిగారు.

"మీ పిల్లలేరి?"

వేద్ నవ్వుతూ... అన్నాడు.

"మా పిల్లలా! పెరటిలో ఆటలు సాగిస్తున్నారు."

వేద్ తల్లి మంజూబేన్ ఇలా అంది.

"అవును. వాళ్ళు పెరిటిలో ఉన్నారు. ఏదో కొత్త నేస్తాన్ని ఇంటిలో ప్రవేశించడం గమనించి వుంటారు."

గురూజీ అన్నారు :

"ఎవరా కొత్త నేస్తం.?"

మంజూబేన్ నవ్వుతూ అంది. "కాత్యాయని". గురూజీ: "ఈ కాత్యాయని ఎవరు?" మంజూబేన్ మళ్ళీ అంది: "కాత్యాయని అనే ఓ పిల్లి. దాని ముద్దుపేరు క్యాతి మహా తెలివైంది. అది ఇంట్లో తిరుగని చోటు లేదు. కమ్మనిదేదయినా కంటబడితే చాలు తినేస్తుంది. శేర్పా ముంగేరీల వస్తువుల్ని చిందరవందర చేస్తుంది." ఎన్నాళ్ళనుంచో దాన్ని పట్టుకోవాలని శేర్పాముంగేరీలు శత ప్రయత్నాలు చేస్తున్నారు. క్యాతి అంత తేలిగ్గా పట్టుబడుతుందా?

వేద్‌కు తల్లి అలా అనడం నచ్చలేదు. శేర్పా ముంగేరిలపై ఆయనకు పూర్తి నమ్మకముంది.

**చరన్వై మధువిందతి**
**చరన్ స్వాదు ముదుమ్బరమ్**
**సూర్యస్య పశ్యశ్రేమాణం**
**యో న తంద్రయతే చరంచర**
**తై. బ్రా. 33 : 3**

"కాదు మాతాజీ! నేర్పా దాన్ని పట్టేయడం మీరే చూస్తారు. రేపో... మాపో..... కాకపోతే ఈ వారంలో."

ఇక వీళ్ళని ఇలా వదిలేసి, పెరటిలోకి వెళ్ళి అక్కడ ఏం జరుగుతుందో చూద్దాం.

చెట్టు క్రింద ఓ పుష్కరిణి ఉంది. దాంట్లో రంగురంగుల చేపలున్నాయి. పుష్కరిణికి

రెండు వేపులా రెండు పాల రాతి స్త్రీ మూర్తులున్నాయి. అన్నాదమ్ముల వైపు సవాలు విసురుతూ క్యాతి ఓ బొమ్మనెత్తిపై తాపీగా కూర్చోని ఉంది. ఆటల్లో పడి సోదరులు క్యాతీని గమనించలేదు. బొమ్మను తోకతో కొడుతూ మియావ్ అంది.

శేర్పా మానసికంగా అప్రమత్తమై, శారీరకంగా ఆయత్తమై, గంతేసి క్యాతి కెదురుగా నిల్చున్నాడు.

ముంగేరి మెల్లగా ఒళ్ళు విరుచుకుంటూ మెల్లగా లేచి కూర్చుని చుట్టూ కలియచూసి వైపు దృష్టి మరల్చి ఇలా దీర్ఘాలు తీశాడు. "ఇంతకూ ఏమైంది. ఏం ముంచుకొచ్చింది.?"

శేర్పా అరిచాడు. 'ఏం ముంచుకొచ్చిందా! అటు చూడు వెధవ క్యాతి. ఎగిరి పట్టుకుందాం దాన్ని."

తొందరపాటు అసలే నచ్చని ముంగేరి ఇలా అన్నాడు.

"శేర్పా! ఏమిటా తొందర! అడుగేసే ముందు ఆలోచించు" క్యాతికి నీ మధ్య పద్దెనిమిది అడుగుల దూరం ఉంది. మధ్య ఈ పుష్కరిణి వుంది. దీని మీదుగా ఎగిరి దాన్ని పట్టుకోవడం మనవల్ల అయ్యేపనేనా? అలోచించు. ఖర్మ కాలి నీవు నీళ్ళలో పడితే ఏమైనా ఉందా! మంచులా ఉన్నాయి నీళ్ళు. నీళ్ళలో కాక బొమ్మ ప్రక్కన పడ్డావా, అక్కడ ముళ్ళ పొద వుంది. పద్దెనిమిది అడుగులు.....

సాధ్యాసాధ్యాలు ఏకబిగిగా ఎకరువు పెట్టడం శేర్పాకు నచ్చలేదు. విపరీతమైన విసుగూ కోపం కల్గించాయి.

శేర్పా : "చాలించు నీ వెధవ సోద. పని అంటేనే నీకు పక్షవాతమొస్తుంది. ఆలోచించడం అంటే కళ్లు మూసుకు పడి వుండడమా! కాలు కదిపే అవసరం లేదనా? అడుగేసే ముందు ఆలోచించు. ఇది వట్టి పనికి మాలిన సామెత. ఆలోచించాలని బిగ్గరగా అఘోరిస్తుందే కాని అడుగువేసే మాట వచ్చే సరికి అడుగు వెనకేస్తుంది. అడుగు వేశాక తీరుబడిగా ఆలోచిస్తూ కూర్చోవచ్చు కదా! అందుకే వెర్రినాన్నా!. పనిచెయ్యి. పని చేస్తేనే ఫలితం. చూస్తూ ఉండు. ఇవాళ క్యాతి భరతం పడుతాను."

మూత కళ్ళ ముంగేరి కళ్ళు కాస్త తెరిచి మళ్ళీ మూసుకుని ఇలా మందలించాడు.

"హోరి ఉడుకు మోతా! ఆలోచించు. ఇలా చేస్తే ఓ కాలు ఊడిపోయే ప్రమాదముంది. ఆలోచించడం అంటే ఏమిటనుకున్నావ్. ముందూ వెనకలు రెండూ చూడటం. అడుగు వేసే ముందు ఆలోచించడం, అడుగు వేసిన తర్వాత ఎదురైన పరిణామాన్ని మూల్యాంకనం చేయటం. అంటే "ఏమిటి" "ఎక్కడ" "ఎలా" జరిగిందో ఆలోచించడమన్నమాట. ఇలా అయినందుకు అలా కానందుకూ బాధ్యులెవరో నిర్ణయించడమన్నమాట..... ఇంతే కాదు. ఇంకా ఆలో.....

టపాకాయలా శేర్పా పేలాడు.

"వురేయి ముంగేరి! ఓడిపోతామని ముందే ఎందుకురా ఊహించుకోవటం. ఆలోచించడం కన్న అడుగేయడమే ముఖ్యం రా సన్నాసి! ఇదుగో దూకుతున్నా..."

అదే క్షణం వారి బుర్రల్లో ఒకే తలుపు మెరిసింది.

"ఆలోచించి అడుగు వెయ్యి" – ఇద్దరినోటి నుండి ఒకేసారి ఈ మాట వెలికి వచ్చింది. ముంగేరి మళ్ళీ భాష్యానికి దిగుతూంటే శేర్పా పుష్కరిణి మీదుగా ఒక్క దూకు దూకాడు దిశ కోణం రెండూ సరిగ్గా అమరాయి. శేర్పా వాడి కోరలు క్యాతి తల వెంటుక వాసిలో ఉన్నాయి.

ఎంత సేపటి నుంచో క్యాతి ఇదంతా కనిపెడుతూనే ఉంది. శేర్పా వాయు మార్గాన పుష్కరిణిని, ముళ్ళపొదని దాటి బొమ్మతల చేరువులోకి చేరక ముందే శేర్పాకు దిశను మార్చడం అసాధ్యమైన దశలో, సమయానికి పూర్వం, సమయానుసారం, సమయానుకూలంగా ఎగిరి ఎత్తయిన ఓ చెట్టు కొమ్మని చేరుకుంది. అయినా శేర్పా (పరుగుల పోటీలలో పి.టి.ఉషలాగా) తలను ముందుకు సాచి కోరలతో తోక నందుకుని గాలిలో రెండు ముందు పల్లటీలు కొట్టి నేలను అందుకున్నాడు.

క్యాతి రక్తాన్ని చవిచూడడంలో శేర్పా విజయం సాధించాడు. తలకై ప్రయత్నించి తోకను చేజిక్కించున్నాడు. జయపజయాలు రెంటినీ చవి చూశాడు.

క్యాతి సయితం జయించింది. చావును తప్పించుకొనడంలో తోకను కోల్పోయి తలను దక్కించుకుంది. జయాపజయాలు రెంటినీ చవిచూసింది.

రెండు విధాలా గెలుపు స్థితి, రెండు విధాలా ఓటమి స్థితి అయినా ఆలోచించి అడుగేసే వ్యూహాన్నే శేర్పా, క్యాతీలు ఇద్దరూ అనుసరించారు.

క్యాతి ఫరారయింది. ఆ ఇంటి మొహం మళ్ళీ చూడలేదు.

శేర్పా ముంగేరీలు అడుగు వేశాక ఏర్పడిన స్థితిని పరిశీలించడానికి ఒక చోట చేరారు. అంటే అడుగువేశాక ఆలోచించడానికన్న మాట.

ముంగేరీలాల్ శేర్పాతో ఇలా అన్నాడు.

"శేర్పా! నిన్ను మనసారా అభినందిస్తున్నా.. అయితే తోక చిక్కిందన్న సంతోషమే గాని ఎప్పటికీ అందుబాటులో లేకుండా పోయింది. దగ్గరే ఉన్నచెట్టు నీ అంచనాలో చేరకపోవడం నాకు ఆశ్చర్యంగా ఉంది."

అందుకు తీవ్రంగా స్పందిస్తూ ఇలా అన్నాడు. "నీవు చెప్పే చెట్టు నా అంచనాలో

వుంది. నీ మోతాదు మించిన వాగుడు వల్ల దూకడంలో నా గడియ ఆలస్యం క్యాతి పాలిట గడియ అవకాశమై, ఆలోచించి అడుగు వేసేలా చేసింది.

ముంగేరిలాల్ : "నీవన్నది అక్షరాల నిజం. దీని నుండి నేను నేర్చుకున్నాను. ఆలోచిస్తూ.. చిస్తూ అడుగువేసే మాట మరువ కూడదు. కృతికీ విశ్లేషణకూ సమాన ప్రాధాన్యత ఇవ్వాలన్నాదే "అడుగేసే ముందు ఆలోచించు" అనే మాటకు నిజమైన అర్థం. ఏ వ్యక్తియైనా కార్యానికి దిగాల్సిందే. అవసరమైన మేరకు ఆలోచించాక !"

ముంగేరిలాల్‌ను ఆశ్చర్యంలో ముంచుతూ శేర్పా ఇలా అన్నాడు. "ముంగేరి! దీనితో పాటు మిగతా మూడు సరైనవేనని నా అంతరాత్మ చెబుతుంది."

శేర్పా హఠవాదాన్ని వీడడం ముంగేరికి సంతోషంగా ఉంది.

"శేర్పా! నిర్ణయానికి రాక ముందు ఆలోచించాల్సిన అవసరాన్ని గుర్తించావు. నీవు ఆలోచించడం నేర్చుకుంటున్నావు. 1. అడుగేయక ముందు ఆలోచించు, 2. అడుగు వేశాక ఆలోచించు 3. ఆలోచించక ముందు అడుగు వేయి 4. ఆలోచించి అడుగు వేయి. ఇవన్నీ సరైనవే.

ముంగేరి మళ్ళీ విస్తృత వివేచనకు దిగుతూ ఇలా అన్నాడు. "సరి అవడం కాక పోవడం సందర్భాన్ని బట్టి ఉంటుందని నేను భావిస్తున్నాను. ఆలోచించి అడుగువేయి. ఇది సాధారణ పరిస్థితుల్లో. అడుగు వేసే ముందు ఆలోచించు. ఇది క్లిష్ట పరిస్థితిల్లో. ఆలోచించక ముందు అడుగు వెయ్యి. ఇది అరాజక పరిస్థితిల్లో. అడుగు వేసి ఆలోచించు. ఇది పునర్నిర్మాణం అవసరమైన పరిస్థితిల్లో. ముంగేరి వివేచనా పాటవానికి శేర్పా పట్టలేని సంతోషంతో ఇలా అన్నాడు.

"ముంగేరి! నేను నిన్ను మనసారా అభినందిస్తున్నాను. నీకలలూ కల్పనలూ కార్యోన్ముఖ మౌతున్నందుకు నాకు ఆనందంగా ఉంది.

"శేర్పా ! నీ కృతి ఆలోచనాభిముఖమైనందుకు నేనూ నిన్ను మనసారా అభినందిస్తున్నాను. అన్నాడు ముంగేరి."

ఇదంతా ఇందాక గమనిస్తున్న పరివార సభ్యులు శ్రీమతి మంజూ బేన్, కృష్ణఝున్ ఝున్ వాలా దంపతులు, వారి కొడుకు కోడళ్ళయిన వేద్ శైలజలు అతిథితో పాటు పెరటిలోకి వచ్చారు. శేర్పా వేదన్ను చూడగానే పరిగెత్తుకుంటూ వచ్చి, యుద్ధంలో గెల్చుకున్న ట్రోఫీని అంటే క్యాతి తోకను అతని చేతిలో పెట్టింది.

శైలజ మామగారితో అంది. "ఎంత ఆనందంగా ఉన్నాయో చూడండి మావయ్యా!"

కృష్ణ ఝుంఝున్ వాలా ఇలా అన్నాడు! “పర్వత ప్రదేశాల్లోని శేర్పాలు సూక్ష్మ దృష్టితో పాటు, పై నుండి కిందకు దూకడంలో మహా ఘనులు.”

మంజూబేన్ భర్తమాటకు తల ఊపుతూ ఇలా అంది.

శేర్పా ముంగేరీల్లో సాహసం, సూక్ష్మదృష్టి రెండూవున్నాయి.

వేద్ బంగళాకు సమీపంలో ఓ ఉపవనం ఉంది. అందులోని ఓ రావిచెట్టు కొసకొమ్మ మీద కూర్చుని క్యాతి ఇక్కడ జరిగేదంతా సూక్ష్మ దృష్టితో చూస్తున్నది.





ఆలోచించడం - అడుగు వేయడం

విశ్లేషణ - కృతి రెండూ అవసరమే సందర్భాన్ని పట్టి ప్రాధాన్యత నీయాలి.

# 18. ప్రయాణం : గమ్యం

**(సిద్ధబారి స్వామీజీ కథ)**

దేశ ఉత్తర ప్రాంతాన, హిమాలయ పర్వతాలు నేపథ్యంగా 'సిద్ధబారి' అనే ప్రదేశముంది. ఆధ్యాత్మిక పరంపరను పునరుజ్జీవింప చేయడమే తమ ఏకైక లక్ష్యంగా పెట్టుకున్నారు. ఢిల్లీలో ఆ సినవారిలో శ్రీ చిన్మయానంద స్వాముల వారి ఆశ్రమం ఉంది. స్వాములవారు భారతీయ గీతాజ్ఞానయజ్ఞాన్ని ఘనంగా జరిపించారు. అందులో పాల్గొన్న వందలాది మందిలో లక్నోకు సురేష్ ఒకరు. ఎమ్.బి.ఏ పట్టాను పుచ్చుకున్న విద్యావంతుడు. చిన్మయానందులు వారి వ్యక్తిత్వానికి ఆకర్షితుడై వారి శిష్యగణంలో చేరిపోయాడు. సన్యాస దీక్ష తీసుకోవాలన్న ధృడ సంకల్పం చేసుకుని, స్వామి వారితో సిద్ధబారికి బయలు దేరాడు.

సిద్ధబారి ముప్పది కిలోమీటర్ల దూరంలో ఉందనగా ఒక చోట కారును ఆపి స్వామిజీ బయటకు దిగారు.

"సురేశ్ ! ఇక్కడి నుండి కాలినడకనే వెడుదాము."

స్వామిజీ మాట సురేశ్కు నచ్చలేదు. కారు దిగి ఇలా అన్నాడు.

"స్వామిజీ ! ఎక్కడికి?"

"సిద్ధబారిలో ఉన్న ఆశ్రమానికి"

స్వామిజీని అనునయించే ధోరణిలో ఇలా అన్నాడు. "ఆశ్రమం వరకు కారు వెడుతుందని చెప్పారు కదా! కాలినడకన ఎందుకు? కారులో అయితే తొందరగా చేరవచ్చు. దీక్షాగ్రహణానికి పూర్వ విధులు నిర్వర్తించుకోవచ్చు."

స్వామిజీ గంభీరంగా అన్నారు. "కాలినడకనే మనం వెళ్ళాల్సి ఉంది."

చేసేది లేక సురేశ్ స్వామిజీని అనుసరించాడు.

స్వామిజీ తన ధ్యేయాంకిత జీవనంలో అరువది వసంతాలు పూర్తి చేసుకున్నారు. ఆయన శరీర దార్ఢ్యత ఆవగింజంతయినా చెక్కు చెదరలేదు. ఉత్సాహంలో యువకులకు తీసిపోరు. చకచకా నడక సాగించారు. అలా నడుస్తూ పోతుంటే, సురేశు చెప్పలేనంత చికాకు వేసింది.

బయటకు మాత్రం ఉత్సాహం కనబరుస్తూ, ఇలా అడిగాడు.

"స్వామిజీ! ఆశ్రమం ఎంత దూరంలో ఉంది."

ప్రత్యుత్తర మీయకుండా, ఆయన ఇలా అన్నారు. "సురేశ్! రోడుకు ఇరువైపుల ఉన్న చెట్లను చూడు. పూలతో నిలువెల్లా ముస్తాబయి ఎంత అందంగా కన్పడుతున్నాయో!"

మళ్ళీ నడక సాగించారు. జలపాతం నుండి ఏర్పడిన చిన్న పిల్లకాలువను దాటుతున్నారు. సురేశ్కు నడక ప్రాణాంతకంగా పరిణమించింది. కొంత ధైర్యం తెచ్చుకుని మళ్ళీ అడిగాడు.

"స్వామిజీ! సిద్ధబారి చేరడానికి ఎంత సమయం పడుతుంది.?



మళ్ళీ నడక సాగించారు. జలపాతం నుండి ఏర్పడిన చిన్న పిల్లకాలువను దాటుతున్నారు. సురేశ్కు నడక ప్రాణాంతకంగా పరిణమించింది. కొంత ధైర్యం తెచ్చుకుని మళ్ళీ అడిగాడు.

"స్వామిజీ! సిద్ధబారి చేరడానికి ఎంత సమయం పడుతుంది.?

స్వామిజీ సురేష్ మాటలు పట్టించుకొనకుండా ఇలా అన్నాడు. "ఎక్కడ ఉందో. జలపాతం. దాని సవ్వడి నీకు విన్పించడం లేదా? జలపాతాల సంగీతంలోని మాధుర్యం అనుభవైకవేద్యం సుమా!

మళ్ళీ ఇద్దరు నడక సాగించారు. ఇలా నడవడం సురేశ్కు క్షణక్షణ గండం కాసాగింది. ఇంతలో పడమర వైపు చూపు ఉన్న ఓ చిన్న కొండ ఎదురైంది.

"ఎంత పైకి వెళ్ళాలి ఆశ్రమం చేరుకొనడానికి?" సురేశ్ ప్రశ్నించాడు.

స్వామిజీ కళ్ళలో చిన్న మెరుపు కన్పించింది. శాంతంగా ఇలా స్పందించాడు. "సురేశ్ "సూర్యుడు కొండ వెనక్కి వెడుతూంటే, మేఘాలు సిందూర వర్ణ స్నాతమై ఎంత ముచ్చట గొల్పుతున్నాయి.."

సురేశ్ సహనం చెలియలి కట్టను అతిక్రమించింది. "మీరైనా మతిని కోల్పోయి వుండాలి. లేదా నేనైనా! నా ప్రశ్నలేమిటి? ప్రతి ప్రశ్నకు మీరిచ్చే సమాధానమేమిటి? స్వామిజీ! నాకేమీ పాలుపోవడం లేదు."

కరుణార్ద్ర స్వరంతో స్వామిజీ ఇలా అన్నారు. "నీవు గమ్యం వైపే పూర్ణదృష్టిని నిలిపావు. నీ ప్రయాణం సుఖప్రదం చేయాలన్న సంకల్పంతో ప్రతి మజిలీ వద్ద ఎదురైన సౌందర్యం వైపు నీ దృష్టిని మరల్చడానికి చేయగలిగినదంతా చేశాను."

సాగిపోవడంలోనే హాయివుంది. ఊహించుకున్న గమ్యం కూడా ఒక మజిలీయే.

ఆరంభించిన కార్యం పూర్తయ్యే వరకు
ఉత్సాహం సన్నగిల్లనీయకు.

# 19. పరిశీలన : మరో కోణంనుంచి

**(ఇద్దరు పిచ్చివాళ్ళ కథ)**

అది పిచ్చాసుపత్రి. ఓ మానసిక రోగి చెట్టు నీడ కూర్చొని గంభీరంగా ఏదో రాస్తున్నాడు. మరో మానసిక రోగి మొదటి వాడు వ్రాస్తుండడం చూసి వాడి వీపు తట్టాడు. మొదటి వాడు ఏమీ మాట్లాడకుండా రెండవ వాడి వైపు చూశాడు.

రెండవ వాడు : "నీవు ఏం చేస్తున్నావ్ !"

మొదటి వాడు : "చూడటంలే ! రాస్తున్నాను."

రెండవ వాడు : "నీవు రాస్తున్న దేమిటి?"

మొదటి వాడు : (విసుగు కనబరుస్తూ) "ఉ-త్త-ర-ం రాస్తున్నా..."

రెండవ వాడు : "ఎవరికి?"



మొదటి వాడు : (గంభీరంగా) "నాకు నేనే వ్రాసుకుంటున్నా నీకేమైన అభ్యంతరమా?"
రెండవ వాడు : "అబ్బే! ఇంతకు ఆ ఉత్తరంలో ఏముంది నాకు చెప్పవూ!"
మొదటి వాడు : "ఇప్పుడే ఎట్లా ? నేను పోస్టు చేయ్యాలి. నాకు తిరిగి అందాలి. నేను చదవాలి. అప్పుడు చెబుతా ఏమి రాశానో?"
రెండవ వాడు : "అలాగే! అందాక ఎదిరి చూద్దాం."

నీతోనే నీకు భాగస్వామ్యం.
నీవు నీకే సందేశం పంపుకోవాలి.
నీనుండి నీవే సందేశం అందుకోవాలి.

# 20. మీ చేతుల్లోనే మీ భవిష్యత్తు

**(గోరఖ్‌పూర్ గురూజీ కథ)**

గోరఖ్‌పూర్ చెందిన ఓ గురూజీ హైద్రాబాదు విచ్చేశారు. బ్రహ్మ వర్చస్సు ఉట్టి పడే వదనం ఆయనది. మనిషిలోని గుప్త సామర్ధ్యాన్ని తట్టి లేపడమే ఆయన తనకై నిర్ణయించుకొన్న జీవన పరమావధి.

శాంతి సౌహార్ధ సౌరభాలను మోసికొని ఆసేతు హిమాచలం నిత్య సంచారం చేసే గంధవహుడు. ఆయన గీతోపనిషత్తులే కాకుండా అన్యదర్శనాలను అంటే బైబిల్, ఖురాన్,



జెందావెస్తా, తావో, జెన్, జైన దర్శనం, ధమ్మ పదం, అష్టా వక్రగీతలను సంపూర్ణ అధ్యయనం చేసి సమన్వయం సాధించిన ధన్యజీవి.

ప్రజలను ఆకట్టుకునే నిమిత్తం, ఎక్కడికి వెళ్ళినా ఓ చిన్న చమత్కారం చేసి చూపేవాడు. పిడికిలో లేదా దోసిలో దాచి యుంచినది చెప్పగలిగేవాడు. ఉపాయనంగా ఓ పూవునో, ఫలాన్నో, నాణాన్నో ఏదో ఒకటి పిడికిలిలో దాచుకొని శ్రద్ధాళువులు ఆయన దర్శనార్థం వచ్చేవారు.

గణేశ్ ఒక కంపెనీకి మ్యానేజరు. స్వామిజీ ప్రదర్శిస్తున్న చమత్కారాన్ని సన్నిహితులు చెప్పగా విని ఆయన్ని ఇబ్బందిలో పెట్టే ఉపాయం ఆలోచించాడు. గురూజీ బండారాన్ని బయట పెడతానని డా॥ ప్రవీణ్, రాఘవన్లతో ప్రగల్భాలు పలికాడు.

మరుసటి రోజు ఉదయం, ఓ చిన్న పిట్టపిల్లను దోసిలిలో దాచుకొని గురూజీ ఉన్న చోటికి వెళ్ళాడు. ఆయనను చూడగానే నమస్కారం చేశాడు. గురూజీ చిరునవ్వు నవ్వారు. జెందావెస్తా, తావో

గణేశ్ దోసిలిని చూపిస్తూ అడిగాడు.

"గురూజీ! ఇందులో ఏముంది చెప్పగలరా?"

"నీ దోసిలిలో ఉన్నది పిట్టపిల్ల" అవునా!

"సజీవంగా ఉందా? లేక చచ్చిపోయి వుందా?" మళ్ళీ అడిగాడు గణేశ్.

'గురూజీ' 'సజీవంగా' ఉంది అని చెప్పే పక్షంలో పిసికి చంపివేయవచ్చు. 'చచ్చిపోయి వుంది' అనే పక్షంలో ఏహాని కలిగించకుండా దోసిలి తెరువవచ్చు. ఏది చెప్పినా తప్పని నిరూపించవచ్చు. ఇది గణేశ్ మదిలో మెదిలే ఆలోచన.

గురూజీ మహాద్రష్ట – సమీప సుదూర భవిష్యత్తులు చూడగల నేత్రాలు ఆయనవి. కరుణానురాగాలు వెలయించే చిరునవ్వుతో ఇలా అన్నాడు.

"నాయనా! నీ చేతుల్లోనే దీని భవిష్యత్తు ఉంది."

మీ భవిష్యత్తు మీ చేతుల్లో వుంది.
ఈ క్షణమే ఇక్కడే ఏమి చేయదలచారో నిర్ధారించుకోవాలి
భవిష్యత్తు వైపు పయాణంలో వర్తమానం మొదటి మజిలి.

# 21. ఒంటి చేయి అకౌంటెంట్

**(అనంత్ జోశీ కథ)**

**మ**హారాష్ట్రలోని ఔరంగాబాద్లో అనంత్ జోశీ అనే ఆయనకు అకౌంటెంట్గా మంచి పేరు ఉంది. దైవ వశాత్తు కొన్నేళ్ళ క్రితం ఓ కారు దుర్ఘటనలో ఆయన తన కుడి చేయిని కోల్పాయారు. మిగిలిన ఒక చేయితోనే, అహోరాత్రాలు పరిశ్రమించి హాయిగా జీవనం గడిపే స్థితికి చేరుకున్నాడు.



నిదుర నుండి లేచి కాలకృత్యాలు తీర్చుకుని "లోక్మత్" (మరాఠీ వార్తాపత్రిక) చదవకుండా ఏ పనీ చేసే వాడు కాదు. ఒకనాడు ఆ పేపరులో పడిన ప్రకటన చదివాడు.

కావలెను : అకౌటెంట్ అనుభవముకల వ్యక్తి అర్హతను బట్టి వేతనము. గోల్డ్ లైట్ ఇండస్ట్రీ వారికి బయోడాటాతో సహా దరఖాస్తు పంపుకొనవలయును. ముఖ్య గమనిక : ఒంటి చేయిగల అభ్యర్థికి ప్రాధాన్యత.

అనంత్ జోశీ అదే రోజు తన బయోడాటాను స్పీడ్ పోస్ట్ ద్వారా కంపెనీకి పంపుకున్నాడు. పంపుకున్న వారానికే ఇంటర్వ్యూకు రావలసినదని పిలుపు వచ్చింది.

కంపెనీకి చెందిన రామ్, లక్ష్మణ్, భరత్ అనే సీనియర్ అధికార్లు అభ్యర్థితో ముఖాముఖి జరిపే నిమిత్తము హాలులో కూర్చున్నారు. అనంతు లోనికి పిలిచాక పరిచయం చేసుకునే ఔపచారికత పూర్తి ఐంది. సౌహార్ధపూర్ణవాతావరణం అవడం వల్ల అనంత్ 'శత్రుఘ్నుడేడని' కమిటి వారిని అడగ్గా 'ఏదోపని మీద జాల్నాకు వెళ్ళాడని' అందులో ఒకడు బదులు చెప్పాడు. అడిగిన ప్రశ్నలకు సరియైన సమాధానం చెప్పి, కంపెనీకి సంబంధించిన వివరాలను తెలుసుకున్నాడు. ఇంటర్వ్యూ ఇరుపక్షాలకు సంతృప్తి నిచ్చే విధంగా ముగిసింది.

నియామక పత్రాన్ని అనంత్ చేతిలో పెట్టారు.

లేచి అందరితో కరచాలనం చేసిన మీదట ఇలా అన్నాడు.

"సర్ ! ఓ ప్రశ్న అడుగదలచాను"

రామ్ : "వెలకమ్! ఏమిటి మీ ప్రశ్న?"

అనంత్ : "ఒంటి చేయి వ్యక్తి కావాలన్న మీ ప్రకటన లోని గమనికను నేను అర్థం చేసుకోలేక పోయాను."

రామ్ నవ్వుతూ ఇలా జవాబు చెప్పాడు. "అదా మీ సందేహం ! ఏదైనా పరిస్థితి తలెత్తినప్పుడు పరిష్కారం మేము కోరిన మీదట ఒక చేయితో ఒక మార్గాన్ని రెండవ దానితో మరోక మార్గాన్ని సూచించే వ్యక్తి మాకు వలదనుకున్నాము. ఒకే చేయితో ఒకే మార్గాన్ని సూచించే వ్యక్తి కావాలి కనుక ఆ గమనికను ప్రకటనలో వేశాం."

**సంకేతం అస్పష్టత నుండి స్పష్టకు దారి చూపాలి.**

# 22. గుఱ్ఱాలు ఎగుర గల్గుతాయి

**(అక్బర్ – బీర్బల్ కథ)**

**భా**రత దేశాన్ని చక్రవర్తిగా అక్బర్ పాదుషాహ పరిపాలిస్తున్న రోజులవి. ఆయన రాజ్య ప్రశాసనంలో వివిధ హోదాలు అలంకరించిన వారిలో అమీర్ ఖాన్, బహద్దుర్ రహీమహమద్ రాజా రతన్ సింగ్, రాజా విక్రమేనే అలాగే రాజా బీర్బలు ముఖ్యులు. వీరిలో కొందరు సేనా ప్రముఖులు, కొందరు సలహాదారులు – మిగతా వారు అమాత్యులు. పాదుషాహ వారికి సన్నిహితులైనందున దర్బారుకు నిత్యాహుతులు.

ఓనాటి సాయంత్రం, ఢిల్లీ సమీపంలోని యమునా నదీ తీరంలో విహారార్థం గుఱ్ఱాల మీద బయలుదేరారు. బాగా అలిసిపోయి విశ్రాంతి నిమిత్తం ఓ చోట ఆగారు. హాసపరిహాసాలు, ఆ ఈ కబుర్లు చెప్పు కొన్నాక, గుఱ్ఱాలు చర్చనీయాంశాలయినవి. అమీర్ ఖానుకు చెందిన 'శేతాశ్వం' రతన్ సింగ్కు చెందిన 'శ్యామాశ్వం' అందరి ప్రశంసలను అందుకొన్నాయి. ఆ తరువాత ఉత్తమ జాతి అశ్వాల వైపు చర్చ మళ్ళింది. ప్రశాసకీయ కార్యాల్లో, పరివహనంలో, యుద్ధావసరాలలో చివరకు దైనందిన జీవితంలో ఏ జాతికి చెందిన గుఱ్ఱం ఏ మేరకు ఉపయోగపడుతుందన్న విషయంలో తమతమ విలువైన అభిప్రాయాలను వెలిబుచ్చారు.

రహీమహమద్ : ఈ ప్రపంచంలో లెక్కకు మించిన అశ్వజాతులు ఉన్నాయి. నా దృష్టిలో అరేబియా జాతి గుఱ్ఱానికి మరే జాతి గుఱ్ఱం సాటిరాదు. వేగంలోనేమి, తెలివితేటల్లో నేమి దీన్ని మించింది లేదు. సవారి చేసే వాడి చెప్పు చేతల్లో ఉంటుంది.

'అవును' – 'కాదు' ల మధ్య స్థితిని తెలివిగా ఆశ్రయిస్తూ రతన్ సింగ్ ఇలా అన్నాడు.

"మీరన్నది నిజమే! ఈ జాతి గుఱ్ఱాలకు పారిసీక జాతి వాటి శరీర దార్ఢ్యత లేదు. రౌతుకు తోడునీడగా మసల గలిగేది పారగీత జాతి అశ్వమే ఏమంటారు?"

అమీర్ ఖాన్ చర్చలోకి దిగుతూ ఇలా అన్నాడు.

"ఈ దేశానికి చెందిన అశ్వం సర్వ శ్రేష్టమని నేననుకుంటాను ఇష్టపడుతాను కూడా! వేగంలో, భారవహనంలో వీటిని ఏవీ పోలవు. రాణా ప్రతాప్ రాజాగారి అశ్వాన్ని నేను స్వయంగా చూశాను దాని పేరు..... 'చేతక్'. దాన్ని మించిన దాన్ని నా జన్మలో చూడలేదు.

రహీమహమద్ మళ్ళీ అందుకున్నాడు.

మరాఠాజాతి గుఱ్ఱం మహా తెలివయింది. అయితే వాటి 'రఫ్తార'ను అదుపులో పెట్టుకోవడంలోనే ఇబ్బంది. ఏ సమయంలో ఎలా మారుతాయో అంచనా వేయడం అంత సులభంకాదు. ఇంతసేపు ఇదంతా వింటూ నోరు మెదుపని విక్రమ్సేన్ అందర్నీ ఆశ్చర్యంలో ముంచుతూ ఇలా అన్నాడు.

"పంచకళ్యాణీ జాతికి చెందిన అశ్వంలాంటి అశ్వం ఇంతవరకు లేదు – ఇక ఉండబోదు."

"అమీరన్కు ఏమీ అర్థం కాక, ఇలా అడిగాడు. పంచకళ్యాణి అంటే ఏమిటి? మేము ఎప్పుడూ వినలేదే."

"ఎలా వింటారు? పంచకళ్యాణి ప్రసక్తి పురాణాల్లో ఉంది. అంటే ఇది వట్టి కథల్లో వచ్చే ప్రాణి. ఇది సృష్టిలో భాగం కాదు." విక్రమ్సేన్ మాటకు తీవ్రంగా స్పందిస్తూ అన్నాడు రతన్సింగ్

విక్రమ్ సేన్ తన పట్టు వదలలేదు – తాను పూర్వం అన్న దాన్ని గట్టిగా సమర్థించుకుంటూ ఇలా అన్నాడు. "నేను కథలు చెప్పడం లేదు. పంచకళ్యాణి అనేది ఉంది. దాన్ని మించింది లేదని మళ్ళీ అంటున్నా : ఇంతే కాదు ఇది ఆకాశంలో ఎగురగలుగుతుంది."

అమీర్ఖాన్, రహీమహమదులు ఈ మాటకు ఉలికిపడ్డారు. కాస్త తమాయించుకుని, ఏక కంఠంతో ఇలా అన్నారు.

ఏమిటీ మీరనేది రాజా విక్రమ్ సేన్ ! గుఱ్ఱాలేమిటి? ఎగురడమేమిటీ? ఎక్కడైనా విన్నామా, కన్నామా!

ఆవేశంతో ఊగిపోతున్న రతన్సింగ్ వాళ్ళను గట్టిగా సమర్థిస్తూ విక్రమ్సన్తో. "మీరు మమ్మల్ని మూర్ఖుల కింద జమ కట్టారా ఏమిటి?"

ఏమాత్రం తొణకకుండా విక్రమ్ సేన్ పునరుక్తీకరించాడు. "గుఱ్ఱాలు నిస్సందేహంగా, ఎగురగలుగుతాయి. నమ్మలేకపోతే రాజా బీరబలును అడగండి."

రాజా బీర్బల్ ఇలా సాగుతున్న వాదోపవాదానికి చెవియొగ్గాడే కాని పెదవి విప్పలేదు. విక్రమ్ సేన్ అన్నాక కూడా మౌనమే వహించాడు.

ఈ నల్గురి దృష్టి బీర్బల్ వైపు మరలింది. రహీమహమద్ అన్నాడు.

"రాజా బీర్బల్! విక్రమ్సేన్ అంటున్నది విన్నారు కదా! చెప్పండి. గుఱ్ఱాలు ఎగురగలుగుతాయా?"

"సందేహమెందుకు? గుఱ్ఱాలు ఎగురగల్గుతాయి.' అన్నాడు బీర్బల్.

విక్రమ్ సేన్ తృప్తిగా మందస్మితం చేశాడు. రాజా రతన్ సింగ్, అమీర్ ఖాన్, రహీమహమద్లు మండిపడుతూ కాసేపు రుసరుసలాడారు. ప్రశ్నల వర్షం మొదలయ్యింది.

అమీరాఖాన్ : "మీరు గుఱ్ఱాల్ని ఎగురేట్టు చేస్తారా?"

రతన్ సింగ్ : "విక్రమ్ సన్ అన్నదానిని మీరు సమర్థిస్తారా?"

రహీమహమద్ : రాజా బీర్బల్ ! మీరు మీ బాధ్యతను గుర్తుచేసుకొని చెప్పండి. మీ ఈషాణ్మాత్రం సందేహించకుండా, రాజా బీర్బల్ "అవును" అనే మాటను మూడు సార్లు ఉచ్చరించారు. విక్రమ్ సేన్ చప్పట్లు చరచాడు.

అమీర్‌ఖానాదుల క్రోదం నిప్పులు చెరిగింది. కాస్త ఉపశమించాక రహీమహమద్ అన్నాడు.

"రాజా భీర్బల్! మీరు మీ మాటకు కట్టుబడి వుంటారా? ఈ మాటే పాదుషా వారి ముందు అనే ధైర్యం ఉందా మీకు?"

ఏ మాత్రం తడుముకోకుండా భీర్బల్ జవాబు ఇచ్చాడు. "మీరు కోరినట్లు జహాఁ పనాహ వారి సమక్షంలో ముమ్మారు ఈ విధానం చేయగలను."

రాజా బీర్బల్ అహమ్మన్యత నానాటికి పెరిగిపోతున్నదని, తను మహాతెలివైనవాడినన్న భ్రాంతికి గురైనాడని, పాదుషాహ వారి పొగడ్తలు అండదండలు అందుతూ ఉండడంవల్ల ఈయనగారు హద్దు మీరుతున్నాడని అమీర్ ఖానాదులు లోలోపల ఆగ్రహోదగ్రులు అయినారు. ఈయనకూ, ఈయనకు అన్ని ఋతువులలో వంతపాడే విక్రమసేనక్కు తగిన శాస్తి చేయాలన్న మనో నిర్ణయం చేసుకున్నారు.

అజ్మీర్ ద్వారం వద్ద ఒకరికొకరు 'అల్విదా' చెప్పుకున్న మీదట గృహాభిముఖులు అయ్యారు.

అదే రాత్రి అమీర్ ఖాన్, రతన్సింగ్, రహీమహమద్ రహస్యమంతనాలు ఒకచోట జరుపుకున్నారు. బీర్బల్, విక్రమసేన్ల వెర్రి అనేది వేయితలలు వేయకముందే, వీరి వల్ల ఉద్భవించిన గంభీర పరిస్థితిని ఆద్యంతం అక్బర్ పాదుషా వారికి నిషేధించడం తత్క్షణ కర్తవ్యంగా నిర్ణయించుకున్నారు. సాటివారల పరువు ప్రతిష్ఠల్ని ఏటిపాలు చేస్తూ బీర్బల్ తానొక్కడే పాదుషాహ వారికి సమీపవర్తి కావడానికి కదుపుతున్న రాజకీయ పాచికలను, పన్నుతున్న కుట్రలను, కుహనాతంత్రాలను పాదుషాహవారి ముందు బట్టబయలు చేయడం కోసం బద్ధప్రతిజ్ఞులు అయినారు.

మరుసటి దినమే తెలతెలవారువేళ, పాదుషాహవారిని సందర్శించుకున్నారు. వంగి వంగి సలాములు చేస్తూ వారి ఎడగల తమ విధేయతను ప్రకటించుకున్నారు.

అక్బర్ పాదుషాహకు వీరంటే వల్లమానిన అభిమానము. తాను చేసిన ప్రతి సంగ్రామములో వీరు చిరస్మరణీయమైన భూమిక వహించారు. ప్రాణాలొడ్డి పోరాడారు. అనేక విజయాలు సంపాదించి పెట్టారు. సమాయానురూపమైన వ్యూహరచనలో తమ నైపుణ్యాన్ని నిరూపించుకున్నారు.

పాదుషావారు చిరునవ్వుతో వారిని ఆహ్వానిస్తూ ఇలా అన్నారు. "మీరు ఈ వేళ రావడం చెప్పలేనంత ఖుషీగా ఉంది. మానగరంలో, రాజ్యంలో, మాకు నివేదించదగిన వింతలు, విశేషాలు ఇటీవల ఏమైన జరిగినవా? వినగోరుచున్నాము."

రహీమహమద్ అవనతశిరస్కుడై ఇలా నివేదించుకున్నాడు. “హుజూరే ఆలా! అవధరించాలి. రాజా బీర్బల్‌ను గురించి జనులు వింతగా చెప్పుకుంటున్నారు. మీ సేవకులమైన మాకు ఇది చాలా ఆందోళన కలిగిస్తున్నది.”

బీర్బల్ అంటే పాదుషా వారికి ఆరో(ప్రాణం అన్నది జగమెరిగిన సత్యం. రహీమహమద్ విన్నవించుకున్నది ఆయనకు ఆశ్చర్యాన్ని కలిగించింది. అయినా, ముఖకవళికలో ఏది వ్యక్తం కానీయకుండా పాదుషాహ వారు ధీరగంభీరస్వరంతో ఇలా అన్నారు.

“మా కృపాపాత్రుడు, అత్యంత విశ్వసనీయుడైన రాజాబీర్బల్ సందర్భంలో మీరేం చెప్పదలిచారు.. మా అనుమతి వుంది.

కాస్త ధైర్యం తెచ్చుకొని, రతన్సింగ్ ఇలా అన్నాడు. “ఆలమ్పనాహ! పెద్దగా ఏమిలేదు. గుఱ్ఱాలను ఆకాశంలో ఎగిరేలా చేస్తానని ఎదురైన ప్రతీ సర్దారుతో రాజా బీర్బల్ గొప్పలు చెప్పుకోవడం మాకు విడ్డూరంగా వుంది.”

అమీర్‌ఖాన్ తన కంఠాన్ని రతన్సింగ్ కంఠంతో మేళవిస్తూ ఇలా మనవి చేసుకున్నాడు. “షాన్ – ఇ – హింద్! అందరి సంగతి అలా వుంచండి. జహాఁపనాహా సమక్షంలో అనడానికైనా వెనుదీయనని రాజా బీర్బల్ అన్న మాట మమ్ముల్ని ఆందోళనకు గురి చేస్తున్నది. విక్రంసేన్ రాజా బీర్బలు హెచ్చరించే బదులు గట్టిగా సమర్థిస్తున్నారు. ఇందులో ఏదో గూఢపురాని ఉంది.”

అక్బర్ పాదుషాహ అలాగా? ఎవరక్కడ! బీర్బల్ను విక్రమ్సేన్ను తక్షణమే మా ముందు హాజరు పర్చండి.”

దళపతి యూసుఫ్ సలాములొనరించి ‘జో హుకుమ్ జహాఁపవాహ అంటూ రాజ ప్రాసాదం నుంచి నిష్క్రమించాడు.

పాదుషాహ వారు దర్బార్ లో ఉన్నారు. ఎప్పటి ఉత్సాహం కనబరుస్తూ రాజా బీర్బల్, విక్రమ్ సేన్లు లోనికి ప్రవేశించారు. వారి వెనుక యూసుఫ్ఫన్ ఉన్నాడు.

పాదుషాహ వారికి అభివాదం చేస్తూ ఇలా అన్నారు. “నాజ్–ఇ–హింద్ ! మెహర్బాన్ అల్లాహ మీకు ఆయురారోగ్యాల్ని ప్రసాదించుగాక! తమ దర్శనం నా భాగ్యంగా భావిస్తున్నాను.”

బీర్బల్ తరువాత విక్రమ్సేన్ పాదుషాహను ఇలా సంబోదించాడు. “జహాఁపనాహ! అల్లాహ మీ ప్రతి అభీష్టాన్ని నెరవేర్చుగాక. తమరి ఆజ్ఞకై వేచియున్నాము.”

స్నేహాన్ని చూపుల్లో కనబరుస్తూ పాదుషాహవారు ఇలా స్పందించారు. బీర్బల్! విక్రమ్! మా సర్దార్ల నుండి మేము వింటున్నది ఏమిటి? మా సల్తనత్లో గొప్ప హోదాల్లో ఉన్న వాళ్లు మాకు విన్నవించుకున్నారు. గుఱ్ఱాల్ని ఎగిరించగలనని నీవంటున్నావట నిజమేనా?”

బీర్బల్ అమీర్ ఖాన్ ప్రభృతుల వైపు క్షణం పాటు చూశాడు. ప్రక్క చూపులు చూస్తూ సవినయంగా ఇలా అన్నాడు.

"అవును జహాంపనాహా. ఈ మాట నేనన్నాను. గుఱ్ఱాలు ఎగుర గలుగుతాయి" పాదుషాహ ఉత్తేజితులై బీర్బల్వైపు తీక్షణంగా చూస్తూ ఇలా అడిగారు. 'బీర్బల్! గుఱ్ఱాలను నీవు ఎగిరించగలవా?

"జీ హుజూర్! నిస్సందేహంగా"

మితిమీరిన బీర్బల్ ఆత్మవిశ్వాసం పాదుషాహవారికి ఆగ్రహం కలిగించింది. పరిస్థితి చేయిదాటకుండా, బీర్బల్ను అనునయించే ధోరణిలో పాదుషాహవారు ఇలా అన్నారు. "బీర్బల్! మరోమారు ఆలోచించుకో"

"నా మాటకు కట్టుబడి ఉన్నాను."

పాదుషాహ వారు 'తీరె నూర్'ను దర్బార్లోకి తెచ్చి నిలపవలసిందిగా అశోక్, యూసుఫ్ను ఆదేశించారు. తీరెనూర్ అంటే మెరుపు బాణం అని అర్థం. దీని సంక్షిప్త ఇతిహాసం ఇది:

తీరెనూర్ పాదుషావారి స్వారీ అశ్వం. యావద్దేశంలో రాణాప్రతాప్ వారి చేతక్ దక్క దీన్ని మించిన అశ్వరాజం లేదు. తీరెనూర్ చేతక్ ఒకదానితో ఒకటి సరితూగ గల స్వరూప లక్షణ సామర్థ్యాలు కలవి.

రాణా ప్రతాప్ అక్బర్ పాదుషాహ తుల్య బలపరాక్రములు. ఈ ఇద్దరిలో ఎవరు అధికులో నిర్ణయించుట ఎంత అసాధ్యమో, తీరెనూర్ చేతక్లలో ఏది దేనిని మించునో నిర్ణయించుట అంత అసాధ్యము.

పసిడి వన్నెలో ఉండి, నొసిటిపై చిరు చందురిని గలిగిన తీరెనూర్ను దర్బారులో నిలిపారు. దాన్ని చూడగానే చూపరుల కళ్ళు జిగేలుమన్నాయి. ఇది అశ్వం కాదు. అపూర్వ సృష్టి. సామాన్యులకు సైతం కవిత్వమబ్బి, 'తీరెనూర్' ను ఘనంగా పొగడారు.

పాదుషాకు తీరెనూర్ అంటే అభిమానం ఇంతా అంతా కాదు. ఆయన మనస్సులో ఇలా ఆలోచనలు కదిలాయి. 'బీర్బల్ ఏదో అన్నాడు. ఇప్పుడు మాకు కల్గుతున్న లక్ష ఊహల్లో అన్నీ నిరాధారమే, అనిపించినా లక్షనొక్కటవ ఊహ సాధారమైనదిగా, బీర్బల్ అంటునట్లుగా, పరిణమిస్తే మమ్ములను మించిన భాగ్యవంతుడు ఉండడు. ఆకాశంలో ఎగిరే అశ్వంగా మా 'తీరెనూర్' చరిత్ర కెక్కాలి. అపుడు మేము ధన్యులము. చేతక్ పేరు ఎత్తేవాడు మచ్చుకైనా మిగులడు.

ఇలా కొంతసేపు అంతర్ముఖులుగా ఉండిపోయి, అక్బరాదుషాహ ఇలా అన్నారు.. "బీర్బల్! మాకు పరమాప్తుడవు. మిత్రుడవు 'తీరెనూర్' ను ఎగరేట్టు చెయ్యి!"

సేనాపతులూ, మంత్రులూ, అధికారులూ చూపులతో బీర్బల్కు "సవాల్" విసిరారు. బీర్బల్ సవినయంగా ఇలా అన్నాడు.

"ఆలమ్‌పనాహా ! మహా ప్రసాదం. ఈ అశ్వరాజాన్ని ఆకాశంలో ఎగిరించగలను. అయితే ఈనాడే అది సాధ్యం కాదు. అలా నేను ఎన్నడూ ఎవరితోను అనలేదు. దీనికి ఎగరేందుకు ఆరు నెలలు తర్ఫీదు అవసరం. ఆరు మాసాల అవధి పాదుషా వారు అనుగ్రహించాలి."

పాదుషాహ వారు ద్విధలో పడ్డారు. మళ్ళీ ఆలోచించసాగారు. 'మా ప్రాణానికి ప్రాణమైన 'తీర్' ను ఆరునెలలు బీర్బల్ ఆధీనంలో ఉంచాలి. ఈ వియోగాన్ని మేము సహించగలమా? మా వలె దీన్ని బీర్బల్ చూసుకుంటాడా? నమ్మకమేమిటి? పందెం నుండి తప్పుకొనడమే యుక్తము. అయితే జనప్రవాదానికి దారి తీయవచ్చు. దాన్ని మేము సహించగలమా? అయిన మాట తప్పినామని అనుటకు ఎవరు సాహసిస్తారు? జన్మలో వచ్చిన ఒకేఒక అవకాశం 'నూర్'కు చిక్కకుండా పోతుంది. ఇది మేము సహించలేము.

ఆలోచనా పరిధి నుండి వెలుపలికి వచ్చాక, పాదుషాహ వారు బీర్బల్ ఎడగల తమ అభిమానాన్ని పక్కకు పెట్టి, ఏదో ఒకటి తేల్చే ధోరణిలో ఇలా అన్నారు.

"బీర్బల్! బాధ్యత గుర్తెరిగి మాట్లాడు. మా తీరెనూర్ ఆరు నెలల తర్ఫీదు తరువాత ఎగురగలదా? అలా జరగని పక్షాన నీకు శిరచ్ఛేదన శిక్ష విధించే కన్న వేరే మార్గం వుండదు." అమీర్ ఖాన్ ప్రభృతుల వీనులకిది సంగీతంగా వినిపించింది. బీర్బల్ ఎలాంటి ఆందోళన చెందలేదు. మొక్కవోని వాక్పటిమతో ఇలా అన్నాడు.

"జహాపనాహా! తల భయం తిలమాత్రం లేదు. తీరెనూర్ శిక్షణకై ఈ ఆరునెలల అవధి హుజూరువారికి ఆనంగీకారమైన పక్షంలో, నేనీ ప్రయోగం చేయటానికి వేరే పర్యాయాలున్నవి. అమీరుఖాన సుల్తాన్వారి షేరేహిందుస్తాన్ వుంది. అతడు కాదన్న పక్షంలో రాజా రతన్సింగ్ వారి దెహిలీ కా రాజా వుంది."

పాదుషాహ వారికి వీటి పేర్లు వింటేనే వేయి జ్వరాలు వచ్చేవి. మళ్ళీ ఆలోచనలో పడ్డారు. ఈ రెంటిలో దేన్నయినా బీర్బల్ ఎగిరించ గలిగితే నా తీర్ ప్రథమ స్థానాన్ని కోలుపోతుంది.

పర్యాయం లేని పాదుషా వారు తీరు శిక్షణ నిమిత్తం బీర్బల్ ఆధీనంలో ఉంచటానికి నిర్ణయించుకొని ఇలా అన్నారు.

"మా 'తీరెనూర్' మీకు అప్పగించుచున్నాము. కంటికి రెప్పలా కాపాడగలవని మా నమ్మకము."

బీర్బల్ 'తీర్' ను సమీపించి దాని వీపు తట్టాడు. అది పులకించి పోయి తన ఆనందాన్ని

సకిలింపు రూపంలో అందరి వీనులకింపయ్యే విధంగా వ్యక్తం చేసింది. 'తీర్' కు బీర్బల్ చిరకాల పరచితుడే. పాదుషాహ వారి దేశాటనలో తోడుగా వెళ్ళిన రోజుల్లో బీర్బల్ తీర్ తో చెలిమి చేశాడు. పచ్చని గరిక తన చేతుల్తో తినిపించేవాడు.

ఇంతకంటే బలమైన కారణం మరోటి ఉంది. బీర్బల్ గారి శ్యామరూపసియైన "రాత్కీ రాణి" "తీర్"లు బహునాళ్ళ నుంచి ప్రేమికులు.

'తీర్'ను అవలీలగా బీర్బల్ అధిరోహించాడు. ప్రవేశ ద్వారం వైపు 'తీర్' ఠీవిగ నడక సాగించింది. అశ్వానికి, అశ్వారోహకునికి ఒకే రకమైన ఆనందానుభూతి కల్గింది.

తీర్ వెళ్ళి పోయిన నాటి నుండి పాదుషాహ వారికి ఏమీ పాలు పోవడంలేదు. సేనాధికార్లు సైతం వేడి నిట్టూర్పులు విడువసాగారు. ఒక విక్రమ్సేన్ మాత్రం తొమ్మిదవ మేఘం మీద ఉండి 'మిత్రుల' కలవరాన్ని, కదికలను రెప్పవాల్చకుండా గమనిస్తున్నాడు.

'తీర్' ను తెచ్చుకున్న నాటినుండి, బీర్బల్ దాని మీద ఢిల్లీ పరిసరాల్లో నిత్యవిహారం చేస్తున్నాడు. పాదుషాహ వారు బీర్బలు 'తీరు'ను బహుకరించారని, త్వరలోనే ఆయనను ప్రధాన సలహాదారునిగా నియమించనున్నారన్న వదంతులు నగరమంతా వ్యాపించాయి. లోకులు పలుగాకులు కదా!

అమాత్యులు కొన్నాళ్ళుగా రేయి నిదురకు వెలి అయి పవళ్ళు భారంగా గడుపుతున్నారు. అక్బరు పాదుషాహవారికి దినం ఒక యుగంగా గడువసాగింది. 'తీర్' ను గురించిన బెంగ అతణ్ణి పూర్తిగా విమనస్కుణ్ణి చేసింది. ఆహార పానీయాలలో పూర్వంలా ఆసక్తి చూపించటం లేదు. బీర్బల్ దర్బారుకు రావటం 'పున్నమి కొక' మారు అయ్యింది. 'తీర్' బీర్బల్లలు పాదుషాహ వారికి రెండు కన్నులైనప్పుడు, వారి వేదన సామాన్యునికి కూడా దురూహ్యం కాదు.

రాజప్రముఖులూ, వయోవృద్ధులూ పాదుషాహవారితో సంబంధ బాంధవ్యం కలవారూ అయిన మహారాజా మానసింగ్కు, విహారం సాగిస్తున్న బీర్బల్తో భేటి అయ్యింది. 'ఎలా ఉన్నావ'ని మానసింగ్ బీర్బల్ను మర్యాదగా పలుకరించారు. పాదుషాహవారికి ఆయన బావమరిది అన్న విషయం తెలిసిన బీర్బల్ తన 'వ్యథ'ను దాపరికం లేకుండా వెళ్ళబోసుకున్నాడు.

తాను తీర్పు తర్ఫీదు నివ్వడంలో తలమునుకలుగా ఉన్నందున దర్బారుకు తరుచు వెళ్ళలేకపోతున్నానని, తన వద్ద వ్యాసంగా ఉన్న 'తీర్'ను పాదుషా వారి స్వాధీనం చేసేవరకు తనకు ఊరట కలుగదని, తను పడుతున్న అనేక కష్టాల్ని ఒకటి తర్వాత ఒకటి ఎకరువు పెట్టాడు. ఈ 'సొద' అంతా మాన్సింగ్ పాదుషాహ చెవిని వేయడమే తరువాయి. పాదుషాహ వారు బీర్బలును ఏకాంత సమావేశానికి పిలిపించుకున్నారు. శహన్మాహకు ఎప్పటిలా అభివాదం చేస్తూనే బీర్బల్ తన విధేయతను సముచిత శబ్దాల్లో ప్రకటించుకున్నాడు. తన యందుంచిన విశ్వాసానికి తాను ఆజన్మం ఋణపడి యుంటానని పాదుషాహవారికి సవినయంగా విన్నవించుకున్నాడు.

పాదుషాహ వారి మనస్సు, విశేషంగా, బీర్బల్ యెడ నవనీతసమానము. బీర్బలు నొప్పించని రీతిలో ఇలా అన్నారు.

"నీవు ప్రస్తుతం చేస్తున్న దేమిటి? మా తీరెనూర్ ఏనాటికైనా ఎగిరి మా కలను నిజం చేస్తుందా? నీవెలాంటి తర్ఫీదు ఈయటం లేదని మాకు నిత్యం సమాచారాలు అందుతున్నాయి. మాకు నీవు ప్రియాతి ప్రియమైన వ్యక్తివి. ఇలాగే నీ వ్యవహారం కొనసాగితే ఏ గంభీర పరిణామాన్ని చవిచూడనున్నావో విస్మరించావా? ముందున్న కాళరాత్రిని తలుచుకుని నీకు భయం వేయటం లేదూ!."

బీర్బల్ నమ్ర స్వరంతో ఇలా అన్నాడు.

"మాలి కే హిందూస్థాన్! అసలు వాస్తవత ఏమిటో నివేదించటానికి అనుజ్ఞనివ్వండి.

అక్బర్ బీర్బల్ వైపు వంగి చెవి యొగ్గుతూ ఇలా అన్నారు.

"నీవు నిస్సందేహంగా నివేదించుకో. మా అనుమతి ఉంది."

శాంత స్వరంతో బీర్బల్ ఇలా అన్నాడు.

"హుజూరే ఆలా! ఆరునెలల్లో ఏమి జరుగనుందో ఎవరు ఊహించగలరు.. మీ ప్రియమైన 'తీరెనూర్' పంచభూతాల్లో దేహాలు అశాశ్వతం కనుక కలిసినా కలిసి పోవచ్చు. అప్పుడు సమస్య అనేది మిగులదు.

పాదుషా వారికి కషాఘాతం లాంటి అనుభూతి కలిగి ఉలికి పడ్డారు. – నరనరాల్లో వ్యాపించిన వేదనతో ఇలా అన్నాడు. తీరెనూర్ను శాశ్వతంగా కోల్పోతానా?

'అవును జహాఁపనాహ! నేను ఇస్తున్న కఠినతర్ఫీదు నూర్ అస్తమయానికి దారి తీయవచ్చుననే నా భయం. మొదట ఇది మూడు కాళ్ళ మీద పరుగులు తీయాలి. ఆ పైన ఆకాశానికి ఎగిరే పక్షిలా రెండుకాళ్ళపైన పరిగెత్తాలి. అప్పుడుగాని ఇది ఎగురగలుగుతుంది. ఈ సుదీర్ఘ ప్రక్రియలో ఏదైనా సంభవమే. నానాటికి 'తీర్ చిక్కిపోతున్నది.'

చిక్కిపోతున్నదన్న మాట వినగానే పాదుషావారి హృదయం భారంతో కృంగి పోయింది.

బీర్బల్ చెప్పడానికి మళ్లీ ఉపక్రమించాడు. "ఈ మాత్రానికే పాదుషాహవారు బెంగ పెట్టుకోవాల్సిన పనిలేదు. నా వైపు పాదుషాహవారు చూడాలి. తీరెనూర్ విషయమై ఏలిన వారికి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్న తపనలో, అమీర్ ఖానూ ఆయన పరమ మిత్రులు అస్తమానం చేస్తున్న విమర్శలకు తట్టుకోలేక నేనే దేహం చాలిస్తానేమో? అప్పుడూ సమస్య మిగులదు. నా కళ్ళ కింద ఏర్పడిన నల్లనిచారలను హుజూరువారు గమనించి ఉంటారనే నా నమ్మకం.

అక్బరాదుషాహ మనసు చివుక్కంది. లోలోన ఆలోచించసాగారు. "బీర్బల్ ఈ అగ్నిపరీక్షకు గురికావడానికి బాధ్యులు ఎవరూ? ఇది స్వయంకృతాపరాధము. అమీర్

ఖాన్, అతని మిత్రులతో ఎందుకని పందెం కట్టినట్లు? సుఖంగా ఉన్న ప్రాణాన్ని దుః ఖాన వేసుకోవడం అంటే ఇదే. వట్టి అమాయకుడు బీర్బల్. ఇలాంటి ఘాతుకాలకు ఒడిగట్టడం తప్ప ఈ ముగ్గురికి వేరే పనేమి లేనట్టుంది."

పాదుషాహవారి మనసులో కదులుతున్న ఆలోచనా పరంపరను భగ్నం చేస్తూ, బీర్బల్ నివేదనకు ఉపక్రమించాడు.

జహాఁపనాహా! ఇక మూడో సంభావ్యత. రానున్న ఆరు నెలల్లో – అల్లాహ రక్షించాలి – మీరే ఐహిక యాత్ర ముగించవచ్చు! హుజూరే అలా! మీరీ లోకాన్ని వదిలితే నేనేమైపోవాలి! తీరెనూర్ ఎలా జీవించ గలుగుతుంది. హిందుస్తాన్ భవష్యత్తే అంధకారమయ మవుతుంది. అలాంటి వేళ, ఏమి మిగులుతుందని సమస్య మిగులుతుంది?"

ఇది విన్న పాదుషాహవారు అవాక్కయ్యారు. అయినా బీర్బల్ తార్కికశక్తిని లోలోన మెచ్చుకోకుండా ఉండలేకపోయారు.

"ఆలంపనాహా! ఇక నాల్గవ – లేక చివరి సంభావ్యత. హుజూరువారు అవధరించాలి. మీ ప్రియమైన తీరెనూర్, అల్లాహ దయవల్ల, ఆకాశంలో మీ కలను నిజంచేస్తూ ఎగిరినా ఎగురవచ్చు! అది జరుగని పక్షంలో, పాదుషావారు నాకు శిరచ్ఛేదనశిక్షను విధిస్తారు. అప్పుడు సమస్యకు ఆశించిన పరిష్కారం దొరుకుతుంది. అంటే సమస్య నామరూపాలు లేకుండా పోతుంది.

అక్బరాదుషా సహనం పూర్తిగా నశించింది. బీర్బల్ను నివారిస్తు ఇలా అన్నాడు.

"బ్బస్ బీర్బల్! ఇంతటితో ఆగు. మేము ఏమీ వినదలుచుకోలేదు. నీవన్నా, తీరేనూర్ అన్నా, హిందుస్థానమన్న, మా ప్రాణానికి ప్రాణం. ఈ మూడింటిలో మేము దేనిని వదులుకోలేము. ఈ అర్థంలేని పందెం నుండి – ఇప్పటికైన మించిపోయింది లేదు – విరమించుకో ఈ ముగ్గురు పన్నిన ఉచ్చులో చిక్కుకోకు. ఇలాంటి కోవకు చెందిన వాళ్ళ మాటలకు మేము చెవియొగ్గుట మా అపరాధము. ఈనాటి సాయంత్రమే, తీరెనూర్ మీద విహరించాలని మా నిర్ణయం.

కించిదవనతశిరస్కుడై బీర్బల్ అన్నాడు. "జహాఁపనాహా! శుక్రియాః పందెం నుండి విరమించుకోవడం దేనికి? హుజూరువారు వేచిచూడాలి. ప్రాణాలు పణంగా పెట్టకుండా ఎవరూ చరిత్ర సృష్టించలేరు."

"బీర్బల్! మేము ఏది వినదలుచుకోలేదు. ఆపు! ఇది మా హుకుమ్."

"గరీబ్ నవాజ్ ! మీ హుకుమ్ మాకెప్పుడు శిరోధార్యమే. తీరెనూర్ను గురువారం హుజూర్ వారి స్వాధీనం చేస్తాను. ఎల్లుండే గురువారం. పాదుషాహవారు, మహారాణి జోదాబాయి, మహారాజా మాన్సింగ్, సేనాపతి అమీర్ ఖాన్, బహద్దుర్ రహీమహమద్, రాజా రతన్ సింగ్ ప్రభృతులతో మా గరీబ్ఖానాకు ఆ రోజు సాయంత్రం 5 గంటలకు

అల్పాహార్ విందుకై వేంచేయాలని నా విన్నపం. హుజూర్ వారి తిరుగు ప్రయాణంలో 'తీరెనూర్' ఉండేటట్లుగా ఏర్పాటు చేస్తాను.

పాదుషాహ వారు సంతోషించారు. ఎదురుచూస్తున్న గురువారం రానేవచ్చింది. శహన్షాహెలు హింద్ మహారాణి జోదబాయి సమేతుడై, ఢిల్లీ మహానగరంలోని *అ.ప్ర.వ్యలు వెంటరాగా అట్టహాసం ప్రదర్శించేది గాక సౌమ్యతకు ప్రతీకయైన బీర్బల్ సౌధానికి చేరుకున్నారు. బీర్బల్ సోదరులైన శూర్బల్, దీర్బల్ అతిథులను సాదరంగా లోనికి ఆహ్వానించారు. బీర్బల్ విక్రమసేన్‌లు సతీపరివారజనసమేతంగా వేంచేసిన పాదుషాహ వారికి ఎదురేగి స్వాగత నిర్ఘోషలు గావించారు. వాతావరణం క్షణార్ధంలో విద్యుదావేశితం అయింది. పలికి సకల రాచమర్యాదలతో లోనికి తోడ్కొని వచ్చారు.

బీర్బల్ సౌధానికి వెనుక భాగాన, 800 అడుగుల పొడవు, 300 అడుగుల వెడల్పు కలిగిన ఒక విశాలమైన మైదానం వుంది. నలువైపుల అతిథులకై ఆసనవ్యవస్థను ఏర్పాటు చేశారు. విందు అయిపోగానే వచ్చిన అతిథులను ఆసీనులను కావించారు. ప్రాంగణానికి ఈవలి వైపున కేంద్ర స్థానంలో పాదుషాహ వారు మహారాణి, మహారాజా మాన్సింగ్ మొదలగు సన్నిహితులూ వారికై ప్రత్యేకించబడిన ఉన్నతాసనాలను అలంకరించునట్లు చూశారు.

మైదానం మధ్య భాగంలో రెండు శ్రేణులు. ప్రతి శ్రేణిలో ఆరడుగుల ఎత్తు గల పది అవరోధాలను స్థాపితం చేశారు. ఒకదానికి రెండో దానికి మధ్య పదిహేను అడుగుల అంతరం ఉంచారు. మైదానంలోకి పరస్పరం విరుద్ధ దిశలో రెండు అశ్వాలు ప్రవేశించేందుకు మైదానానికి పశ్చిమంలో ఒక ద్వారం తూర్పు వైపు ఒక ద్వారం నిర్మించారు.

ప్రార్ధనారంభానికి సూచనగా బూరగొమ్ములు పెద్దపెట్టున మ్రోగినవి. అందరూ లేచి నిలుచున్నారు.

సంస్కృతంలో ప్రార్ధన, అరబీలో 'ఇబాదత్' సలుపబడినవి. ఆ తరువాత సలామె హిందూస్థాన్ రాష్ట్రీయగీతాలాపన సుసంపన్నమైంది.

మళ్ళీ బూరగొమ్ములు కర్ణభేదధ్వనులు గావించాయి. రెండు దివ్యాశ్వములు పశ్చిమ ద్వారం నుండి ఒకటి తూర్పు ద్వారం నుండి వేరొకటి రంగప్రవేశం చేశాయి. నిర్దేశిత శ్వేత రేఖలపై ఠీవిగా నిలిచాయి. ఈవలి శ్రేణికి ఎడమవైపు (పాదుషాహవారు ఆసీనులై ఉన్న చోటికి) స్వలంకృతమైన తీరెనూర్ చూపులో, ఠీవీలో, రాచరికాన్ని వెలయిస్తూ నిలిచి వుంది. దాన్ని తేలిక పాటి కవాచాన్ని ధరించిన బీర్బల్ అధిరోహించాడు. నిపుణతతో లగాము చేతనూని 'తీర్'కు మార్దవ స్పర్శ కలిగించాడు. తక్షణమే తీరెనూర్ సుశ్రావ్య హేషతో చూపరుల మేనులను పులకరింపచేసింది.

బీర్బల్ కమర్బందుకు వెనుక భాగాన అమర్చుకొన్న నేత్రబద్ధహరితధ్వజం' అల్లాహు అక్బర్ అనే నినాదాన్ని కలిగి గాలికి రెపరెపలాడుతుంది.

ఇక ఆవలి శ్రేణికి కుడివైపున (పాదుషాహవారు ఆసీనులై ఉన్న చోటికి) పరుగు నారంభించే శ్వేతరేఖలపై, అందంలో, స్పందనలో, ఏ బాడబము నయినా మందలించ గలిగే బీర్బల్ గారి శ్యామరూపసి 'రాత్రి రాణి' నిలిచి ఉంది. విక్రమసేన్ దాన్ని అధిరోహించి లగాము చేత పట్టుకున్నాడు. ఆయన కమర్బందుకు వెనుక భాగాన అమర్చుకున్న నేత్రబద్ధకాషాయధ్వజం "ఓం తత్సత్" అక్షరాలు కలిగి, హరితధ్వజం లాగానే, గాలికి రెపరెపలాడుతుంది.

వీరావేశంతో ప్రేక్షకులు "అల్లాహ హు అక్బర్", "ఓం తత్సత్" అంటూ నభంగమ

'దౌడ్' ఆరంభానికి మొదటి సూచనగా ప్రేక్షకుల నలరించే రీతిలో షహనాయి మ్రోగింది. ప్రేక్షకులు శాంతించారు.

బీర్బల్ తీరెనూర్, విక్రమ్ సేన్ "రాత్ కీ రాణి"తో చేసిన అభివాదాన్ని పాదుషాహవారు స్వీకరించారు.

రెండవసారి షహనాయి మ్రోగింది. వలపు నొలకిస్తూ తీరెనూర్ రాత్రికీ రాణీలు ఒకదాని నొకటి తనివి తీరా చూసుకున్నాయి.

మూడవసారి అంటే చివరిసారి షహనాయి మ్రోగింది. ఇటునుండి బీర్బల్ తీరెనూర్ను అటునుండి విక్రమ్ సేన్ రాణీనీ ప్రేరేపిస్తూ 'ఛలో' అన్నారు.

'తీర్' రాణీలు ఒక్కపెట్టున పరుగును ప్రారంభించాయి. మొదటి రెండు అవరోదాలు నాజూకుగా అధిగమించి, మూడవ అవరోధం చేరుకున్న క్షణం ఉవ్వెత్తుగా లేచి నేలనంటే విద్యుదయస్కాంత తరంగాలలా ముందుకు సాగిపోతున్నాయి. జూళ్ళు కదులుతున్న అలలను తలిపిస్తున్నాయి. వాలాలు సరళరేఖల్లా నేలతో సమాంతరతను సాధించాయి. ముంగాళ్ళు, వెనుగాళ్ళు లయ వైవిధ్యంలో ఆకుంచన ప్రసారణాల్ని కనబరుస్తున్నాయి.

కాషాయ హరిత ధ్వజాలు గాలితో బరాబరులు చేస్తున్నాయి. బీర్బల్ విక్రమ్లున్లు ధరించిన పంచెవన్నెల దుస్తులు రంగుల వలయాలుగా, గతిమానమైన ఇంద్ర ధనువుల్లా చూపరులకు ముచ్చట గొలుపుతున్నాయి. అయిదవ అవరోధాన్ని అధిగమించిన క్షణం తీరెనూర్ వేగం, గమనం, లయ, ద్రుతగతి నందుకుంది. అవిరామంగా ప్రచోదితమౌతూ ఎత్తుగా ఎగిరి రెండు అవరోధాలను ఒకేసారి అధిగమించ నారంభించింది. రాణి స్పందిస్తూ తీర్ విన్యాసాన్ని అనుకరించింది. గాలిలో తేలిపోయే కమనీయ రూపాలవలె ప్రేక్షకులకు కన్నుల పండుగ చేయసాగాయి. మేరలెరుగని మురిపముతో పాదుషాహవారు లేచి నిలుచున్నారు. చప్పట్లు చరుస్తూ "నా తీర్ ఎగురుతున్నది! రాణీ కూడా. మర్హబా! సుభానల్లాహ.!!

ప్రేక్షకులు కొన్ని నిమిషాల పాటు కరతాళ ధ్వనులు చేశారు. మహారాణి జోదాబాయి సమ్మోహితురాలై తిరిగి ఆసీనులైన పాదుషావారి వైపు వంగి మెల్లగా అంది. "ఇది ముమ్మాటికి పంచకళ్యాణి."

పాదుషావారు సైతం, రాజామాని సింగ్ వైపు వంగి, అన్నారు. "ఇవి విహంగాలలా గాలిలో తేలే అద్భుతమైన అశ్వాలు. "

తీర్–రాజీలు గాలిలో తేలిపోతుంటే, పాదుషావారు చూస్తూ దివ్యానుభూతిని పొందారు. ఉత్సాహంతో అన్నారు. "రహీమ్! అమీర్! రతన్! చూడండి. వాటి వైపు చూడండి. 'అద్భుతం! అద్భుతం' అంటూ ఆ ముగ్గురూ స్పందించారు. ఇలాంటి మహనీయదృశ్యం సాకారం చేయడం వెనుక ఎంత సాధన దాగి వుందో పాదుషావారు గ్రహించారు.

'తీరెనూర్' రాత్–కీ–రాణీ'లు చివరి అవరోధాల్ని అధిగమించి, ఒకదాని కొకటి, రెండు అడుగులు ఎడంగా నిలిచి, పాదుషాహ వారికి అభిముఖంగా తలలు వాల్చాయి.

బీర్బల్ విక్రమ్సేన్లు తమ రంగుల రుమాళ్ళను ఉత్సాహంతో ఊపుతూ మహారాణి పాదుషాహ వారి ముందు నిలిచి సాదరంగా అభివాదం చేశారు.

'ఓం తత్సత్' అల్లాహు అక్బర్ నినాదాలు గల పతకాలు పక్కపక్కనే సాగిపోతూ, రెండాత్మల వలె మేళవించి అద్వైత స్థితిని అందుకున్నాయి.

తాను ప్రవర్తింపనున్న 'దీనే ఇలాహి' పాదుషాహకు బీజరూపాన సాక్షాత్కరించింది. హిందూస్థాన్ ఇతిహాసంలో ఓ నూతనాధ్యాయానికి బాట ఏర్పడింది. అక్బరుపాదుషాహ తన ఆసనాన్ని వీడి ప్రేమతో అశ్వాల వీపు తట్టాడు. సేనాధిపతులు శహన్మహా చుట్టు చేరారు. అక్బర్పాదుషాహ బీర్బల్, విక్రమ్ వైపు క్షణం పాటు చూసి తలను ఊపాడు.



ఊహాలను స్థిత ప్రజ్ఞత్వం కలిగి సమయబద్ధసాధను జతపరిస్తే

ప్రతి అసాధ్యం సాధ్యమవుతుంది.

# 23. తెనాలి రామకృష్ణుని కథ

**వి**జయనగరాన్ని రాజధానిగా ఓ మహాసామ్రాజ్యాన్ని ఏలిన శ్రీ కృష్ణదేవరాయులు భారతీయులకు ప్రాతఃస్మరణీయులు. మూర్తీభవించిన క్షాత్రం ఆయన. ఆయన కళారాధకులు: కళాపోషకులు కూడా. పల్లకీ తన కేల పట్టియెత్తిన మహోదారత ఆయనది. 'అముక్త మాల్యద'ను రచించిన మనీషి.

తెనాలి రామకృష్ణుడు ఆయన ఆస్థాన కవుల్లో అంటే అష్టదిగ్గజాల్లో ఒకడు. చక్కని చిక్కని కవిత్వం, పొల్లుపదాలు రానీయకుండా, చెప్పగల చతురుడు ఆయన. మేధావి అవడంతో పాటు సాటిలేని సమయస్ఫూర్తి కలవాడు. హాస్య కేదారాలలో రాజనాలు పండించడంలో అసమాన కృషీవలుడు.

ఒకనాడు రాయల వారి కొలువులో త్రివిధతాపహరణమైన 'పారిజాతాపహరణము' ను తెలుగువారికి అమూల్యమైన ఉపాయనంగా అందించిన నందితిమ్మన ఏదో ప్రసంగంలో మానవుల ఆంతర్యాన్ని ఎరుగుట శక్యము కాదని' తన అభిప్రాయన్ని వెలిబుచ్చాడు.

'వసుచరిత్ర'కారుడైన రామరాజ భూషణ కవి నిలబడి నందితిమ్మనను గట్టిగా సమర్థించాడు.

"అందులో, స్త్రీల ఆంతర్యం బ్రహ్మకైన దురూహ్యం." అన్నాడు కవి ధూర్జటి.

సభలోని వారు ఏ అభ్యంతరమూ లేవదీయలేదు – ఇది సరైనదే అన్నట్లు తలలూపారు.

తెనాలిరామకృష్ణుడు ఏలనో మౌనమే వహించినాడు. – ఇది సహించనోపని పెద్దనగారు తెనాలివారి వైపు చూస్తూ 'మౌనమేలనోయీ !' అని మెత్తగా మందలించారు.

ఇలా అని పెద్దన అసీనుడైన వెంటనే, రామకృష్ణుడు ఆసనం నుండి లేచి సభికులకు అభివాదం చేస్తూ ఇలా అన్నాడు.

"ప్రభూ! మానవుల మనోగతం, ఇంత వరకు పెద్దలు సెలవిచ్చినట్లు, అర్థం చేసుకోవడం అసాధ్యమని నేను భావించను – మానవ మనో7ధ్యయనమే నేను ఎప్పుడు చేస్తుండేది."

తెనాలివారి మాటలు మోదంతో పాటు సభికులకు ఆశ్చర్యాన్ని కల్గించాయి.

రామకృష్ణునికీ రామరాజ భూషణునికీ మధ్య పచ్చిక వేస్తే భగ్గున మండుతుంది. తెనాలి వారి మాట జీర్ణించుకోలేక పోయాడు. ప్రభువులవారు తెనాలిరామకృష్ణుని యెడ చూపుతున్న ఆదరణ రామరాజ కవిని ఈర్ష్యాళువును చేసింది. ఆసనం నుండి దిగ్గునలేచి ఇలా కఠోరోక్తులాడాడు.

"రామకృష్ణా! ప్రభుల వారి సమక్షాన అందరి మనోగతాన్ని ఎరిగి వున్నానని గొప్పలు చెప్పుకోవడం భాస్వంతర్యామివైన ఈశ్వరునివా నీవు?"

ఏ మాత్రం తొణకుండా రామకృష్ణుడు లేచి ఇలా అన్నాడు. "అంతర్యామిత్వమనునది మీబోటి పెద్దలకు అవగతమయ్యే గహన విషయము నేను అతిసామాన్యుడను అయినా మీరు ఆదేశించిన పక్షమున, మీ మనసున ఈ క్షణాన మెదులుచున్న దేమిటో చెప్పగలాడను"

ఈ సంవాదం శృతి మించి రాగాన పడుతుండటం చూచి రాయలవారి ప్రధానామాత్యులైన తిమ్మరుసు గారు కలుగచేసికొని, రామకృష్ణుని వైపు దృష్టి సారించి ఇలా అన్నారు.

"రామకృష్ణ కవివర్యా! తెలివి కలవానివిగా నీ ధవళకీర్తిని శ్లాఘించని వాడు – ఈ సభలోకాదు – యావత్సామ్రాజ్యంలోనే లేడు. అయినా, మానవుని ఆంతర్యమును గ్రహించగల సామర్థ్యము నాకు కలదని' నీవు చేసిన విధానము మాకు సమ్మతము కాకున్నది – నేను కడు వృద్ధుడను. రాజ్య వ్యవహారాలలో సుదీర్ఘకాలము వ్యగ్రుడనైయున్న కారణమున అపారమైన అనుభవము గడించిన వాడనని సవినయముగా చెప్పుకొనగలస్థితిలో ఉన్నవాడను. అగాధ సముద్రము వంటిది. మానవుని మనస్సు ఈ నాటికీ నాకు అగమ్యమే. రామకృష్ణుడిది గ్రహించవలెను."

రామకృష్ణుడు ఆసనము నుండి లేచి ప్రధానామాత్యుల వారికి నతశిరస్కుడై అభివాదం చేసి ఇలా ఉపక్రమించాడు.

"అప్పాజీ! మీతో ఏకీభవించు స్థితిలో లేనందుకు నేను క్షమా ప్రార్థిని – నేను సత్యమని నమ్ముదానిని ఒకరి మెప్పును రామారాజ భూషణుని) వదయుటకై ఏల ప్రకటించకుండా మౌనము వహించవలయును. మానవమనోవ్యాపారాన్ని అవగతం చేసుకొనగల సామర్థ్యము నాకున్నది.

నాటకం పతాకసన్నివేశాన్ని అందుకుంది. ప్రభువులవారి స్పందన ఎలా వుంటుందో ఇంగితాన్ని పట్టి తెలుసుకోదలచి, కవి ధూర్జటి రాయల వైపు క్షణార్థం దృష్టి నిలిపాడు.

రామకృష్ణుని ఉద్దతిని రామరాజ భూషణకవి సహించని వాడై ప్రభువులకిలా విన్నవించాడు.

"అహమ్మన్యుల అహంకారము అవధులెరుగదు. అయనా, ప్రభువుల వారికి నే జేయు విన్నపము. ఈక్షణమున, ఈ సభలో ఆసీనులైయున్న ఈ సభికుల మనఃపటలము పైని కదలికలను రామకృష్ణకవి వివరించి చెప్పగలడా?


రామరాజభూషణుని సవాలుకు సభ ఓ క్షణం పాటు కల్లోలితమైంది – యధాస్థితి ఏర్పడగానే స్మితపూర్వాభిభాషులైన శ్రీ రాయల వారు రామకృష్ణుని ప్రశ్నించారు.

"రామకృష్ణా! రామరాజభూషణుడు నుడివినట్టు ఈ క్షణాన మా ఈ సభలోని ప్రతి సభ్యుడు ఆలోచించునదేమిటో చెప్పగలవా? స్థాలీపులాకన్యాయము నాశ్రయించి అడుగగోరెదము ఈ మా సేనాధిపతి నాగమనాయకుని మనోగతమేమి?

రామకృష్ణుడు ఆసనం నుండి లేచి ప్రభువులవారికి సమస్కరించి ఇలా అన్నాడు.

“ఒక నాగమనాయకు డేమిటి? ఎవరి మనస్సులో ఏమి దాగి ఉన్నదో, ప్రభువులు ఆజ్ఞాపించిన పక్షమున విన్నవించుకొనగలను.

ఈ మాట రాయలవారికి ఆగ్రహం కలిగించింది.



"సరి! ఒక్కొక సభ్యుని నామవిశేషణములను పేర్కొనుచు ఈ క్షణమున అతడు ఆలోచించునది మాకు ఎరగించవలె!"

రామకృష్ణుడు లేచి నిలబడి సవినయముగా ఇలా అన్నాడు. "పేరుపేరున ఏలప్రభూ! ఈ క్షణమున సమస్త సభికుల మనోభావమేమిటో ఇదిగో నివేదించుచున్నాను. ఆచంద్రార్కము విజయనగర సామ్రాజ్యము నిలిచి యుండవలె. చతుస్స ముద్రవేలా వలయితా వసుంధరాజాని శ్రీశ్రీశ్రీ కృష్ణదేవరాయులు ఆయురారోగ్య వైభవోపేతులై సహస్ర వసంతాలు వర్ధిల్లవలె ఇదియే సభికుల మనోగతము. దేవర వారు అవధరించవలె."

రాయలవారు సభికుల వైపు దృష్టి మరలించడమే తరువాయి, 'ఔను' 'ఔను' అంటూ మిన్ను ముట్టేట్టుగా హర్షధ్వానాలు చేశారు.

కన్నడరాజ్యరమారమణా! జయీభవా! మూరురాయరగండా! విజయీభవా!!



ప్రపంచానికి మనం చూపేది ముఖాలు కావు ముఖోటాలు

# 24. ఆత్మ నిగ్రహం

(బాపూజీ కథాసరిత్సాగరం లోని ఓ కథాతరంగం)

**అ**హమదాబాదులోని సాబర్మతీ ఆశ్రమంలో, ఒకనాటి సాయంకాలము ఎప్పటిలాగే కార్యక్రమం జరుగుతున్నది. బాపుజీ దర్శనం కోసం ఓ వృద్ధవనిత తన మనుమడిని వెంటబెట్టుకొని వచ్చి ప్రార్థన అయ్యే వరకు ఒక చోట ఓపికగా కూర్చొని ఉన్నది.

కార్యక్రమం అయిపోయింది. బాపూజీకి వందనం చేశాక, శ్రద్ధాళువులు తమ ఇళ్లకు వెళ్లిపోతున్నారు. బాపూజీని సందర్శించడానికి వచ్చిన శ్రీమతి ధీమతిబేన్ చేతులు మోడ్చి నమస్కారం చేసింది. బాపూజీ చిరునవ్వుతో ఆప్యాయతను చిందిస్తూ జకెమ్ ' అని పలుకరించారు.

ధీమతిబేన్ అంది : "బాపూ! తమరి దయవల్ల బాగానే వున్నాం. వీడు నా మనుమడు. నా చాలా కాలం నుండి అనారోగ్యంతో బాధపడుతున్నాడు."

బాపు మనుమడి వంక చూసి, ప్రేమతో వీపు తట్టి అన్నారు. "ఈ పిల్లవాడికి ఏమయ్యింది?"

ధీమతిజేన్ : "వీడు అస్తమానం జలుబుతో బాధపడుతున్నాడు. పెరుగంటే వీడు ప్రాణం తీసుకుంటాడు. ఆరోగ్యానికి పడదురా అంటే వినిపించుకోడు. మీరు ఎలాగైనా వీణ్ణి పెరుగు తినడం మాన్పించాలి."

ధీమతిబేన్ వంక చూస్తు బాపూజీ ఇలా అన్నారు. "అలాగా! అయితే, రేపు ఇదే సమయం మీ మనువడూ, మీరూ ఆశ్రమానికి రండి.

ధీమతిబేన్ బాపూకు నమస్కరించి పిల్లాడితో ఇంటికి వెళ్ళిపోయింది.

బాపూజీ ఆదేశానుసారం, ధీమతిబేన్ మనుమడితో సహా మరుసటి సాయంత్రం ఆశ్రమానికి వచ్చింది. ప్రార్థన అయిపోగానే బాపూజీ పిల్లవాణ్ణి దగ్గరకు పిలుచుకొని, వాడి భుజము మీద చేయి ఉంచి కరుణార్ద్రస్వరంతో ఇలా అన్నారు. "బేటా! పెరుగు తినటం మానేయ్"

"అచ్ఛా" అన్నాడు భరత్.

బాపూజీకి ధన్యావాదాలు తెలుపుకొని నాయినమ్మా మనుమడు తమ యింటికి వెళ్ళిపోయారు.

ఓ వారం రోజులు గడిచాక, ధీమతిబేన్ మనుమడితో సహా ఆశ్రమానికి వచ్చి బాపూజీని దర్శించిన మీదట ఆయనతో ఇలా అంది.

"బాపూ! ఈ జన్మలో మీ మేలు మర్చిపోను. పిల్లవాడికి జల్బు పీడ వదిలింది. బాగా


కోలుకున్నాడు. మీరు చెప్పిన సాయంకాలము నుండే పెరుగు తినటం మానివేశాడు." ఇది విని బాపూజీ ఎంతో సంతోషించారు. ధీమతిబేన్ ఇలా అంది. "చిన్న సందేహం"

బాపూజీ అన్నారు. "ఏమిటీ మీ సందేహం? ఏమి అడగదలచుకున్నా నిస్సంకోచంగా అడగండి."

ధీమతిబేన్ అంది: "బాపూ! మిమ్మల్ని సందర్శించిన సాయంత్రమే పెరుగు తినొద్దని భరత్‌కు చెప్పారు కాదు! మరుసటి సాయంత్రం ఆశ్రమానికి రమ్మన్నారు. ఎందుకో అర్థం కావటం లేదు."

బాపూజీ పెద్ద పెట్టున నవ్వారు. ఆ బోసి నవ్వుకు అక్కడ వున్న వారంత మంత్ర ముగ్ధులయ్యారు.

బాపూజీ అన్నారు : "అదా సంగతి! నేను భరత్కు పెరుగు తినటం మానమని చెప్పే ముందు నేను మానెయ్యాలి కదా! మీరు నన్ను కోరిన సాయంత్రమే, నేను ఎప్పటికీ మానేశాను. మరుసటి సాయంత్రం భరత్‌కు మానేయమని చెప్పాను. అందుకే మిమ్మల్ని ఆశ్రమానికి మళ్ళీ పిలుపించుకున్నాను.




ఆచరణ తరువాతనే ప్రవచనం.

# 25. దేవుడున్నాడా?

(ఆస్తిక నాస్తికుల కథా)


**చా**ర్వాకదర్శన నరనరాల్లో జీర్ణించుకున్న ఓ నవ్యనాస్తికుడు తన ఇంటి ప్రవేశ ద్వారానికి ఓపకాన్ని తగిలించి, దానిపై తాటికాయలంత అక్షరాలతో ఇలా వ్రాయించాడు.

**దేవుడు ఎక్కడా లేడు.**

ఇది చదివిన ఓ ఆస్తికుడు స్వల్ప మార్పులు గావించి ఇలా చదివేట్టుగా చేశాడు.

**దేవుడు ఎక్కడ లేడు!**

సకారాత్మకదృష్టి సర్జనగా పరిణమిస్తే, నకారాత్మకదృష్టి గర్జనకే పరిమితమవుతుంది.




“ఇదివుందనే నీ ఆలోచన అయితే ఇది వుంది.

నీ ఆలోచనే నీ ఉనికికి నిర్వచనం.

# 26. ఇందుగలడందులేడని...

(గుజరాతీబాబా శిష్యచతుష్టయం)

గుజరాతీ బాబా అయోధ్యకు వచ్చారు – శుచిత, వివేకం అందరనీ ప్రేమించే స్వభావం వలన ఆయన అచిరకాలంలోనే ఆబాల వృద్ధులకు ఆత్మీయుడైనాడు ఏ పర్వదినమైన సరే నిరుపేదలకు, సాధువులకు లేదనకుండా అన్నదానం చేసేవాడు. 'గురుపూర్ణిమ' నాడు ఆశ్రమంలో ఓ గొప్ప ఉత్సవం జరిగేది. వేలాది మంది ఆయన దర్శనానికి వచ్చేవారు. గుజరాతీ బాబా పూర్వాశ్రమమంలో హంసదాసీమహరాజ్ అని ఆయనను పూర్వం నుంచి ఎరిగిన వారు చెబుతారు. డోంగ్రే మహారాజుకు ఆయన ప్రియాతి ప్రియమైన శిష్యుడు.

రాము, వివేక్, దేవి, అరవింద్ అనే స్థానికులైన నలుగురు పిల్లలు బాబాగారిని దర్శించుకొనే నిమిత్తం వచ్చారు. బాబావారి ఆధ్యాత్మిక గరిమను బాగా ఎరిగిన ఆ పిల్లలు తమను ఆశ్రమంలో చేర్చుకోవాలని పదే పదే వారిని అభ్యర్థించారు. బాబా ఇందుకు సమ్మతించి తన ఆశ్రమంలో వ్యక్తి వికాసానికి సంబంధించిన సంవత్సరం పాటు కోర్సులో చేరటానికి అవకాశం కల్పించారు. వారి ఏకాగ్రవృత్తికి, చూపిన అంకిత భావానికి ముగ్ధుడై వారిని నిండుగా దీవించారు. సంవత్సరం గడిచిపోయింది. స్నాతకోత్సవం అయ్యాక, బాబా ఆ నలుగురిని ఎంతో అభినందించారు. "బాబా! మేమందరం ఉత్తీర్ణులమయినామా?" అడిగింది దేవి.

బాబా ఎంతో ఆప్యాయతతో ఇలా అన్నారు. "పిల్లలూ! యోగమార్గంలో ఉత్తీర్ణత – అనుత్తీర్ణత అనేది ఉండదు. వ్యక్తిత్వ వికాసం కోసం త్రికరణ శుద్ధిగా మీరు పాటు పడ్డారు. అదే మీరు సాధించిన ప్రగతి – ఎంత సాధించారన్నది కాదు : ఎంతసాధన చేశారన్నదే నేను చూసేది."

బాబా మాటలకు తృప్తి పడని వివేక్ ఇలా అన్నాడు. "బాబా! చిన్నదైనా సరే, మా కోసం మీరు పరీక్ష పెట్టాలి. నారాయణ గురూజీ బరోడాలో అలా చేస్తారని విన్నాము."

దీన్ని గట్టిగా సమర్థించారు, అరవింద్, వివేక్లు.

రాము అభిప్రాయాన్ని కోరాడు బాబా.

అందుకు రాము ఇలా అన్నాడు. "మీరు ఎలా నిర్ణయించినా సరే!"

నిమిషము పాటు తన గురువులైన డొంగ్రే మహారాజును అన్నగారైనా నారాయణ గురూజీని స్మరించుకొని, లోనికి వెళ్లి ఓ చిన్న బుట్టలో ఏదో తెచ్చారు. 'ఈ లడ్డూలను తలా ఒకటి ప్రసాదంగా ఇస్తున్నాను. ఎవరు లేని చోట తినాలి' అని చెప్పారు.

నాలుగు లడ్డూలను నలుగురు తీసుకొని నాలుగు దిశలలో వెళ్లారు. ఓ గంట తరువాత అరవింద్ వచ్చాడు. మూడు గంటలైన తరువాత వివేక్ తిరిగివచ్చాడు. కేవలం

ఐదు నిమిషాలల్లోనే రాము తిరిగి వచ్చి ఆశ్రమంలో మాతాజీకి చేదోడు వాదోడు అయ్యాడు. ఆ తర్వాత నలుగురు ఒకచోట చేరారు. అక్కడికి బాబా వచ్చారు. శిష్యులు గురువుకు పాదాభివందనం గావించారు.



బాబావారు ఇలా అన్నారు. "నేనిచ్చిన ప్రసాదాన్ని ఎవరు ఎక్కడ ఎలా తిన్నారో వరుసగా చెప్పాలి."

దేవి : "ఎన్నో చోట్లకు వెళ్ళినా ఎవరో ఒకరు కనిపించారు. చివరకు ఇంటికి వెళ్ళి తలుపులూ కిటికీలు మూసేసి మీరిచ్చిన దాన్ని తిన్నాను."

వివేక్ : "వెళ్ళిన ప్రతిచోట మనుష్యులేకాక పక్షులూ కీటకాలు ఇలా ఎన్నో కన్పించాయి. సరయూ లో మునిగి తిందామనుకుంటే అక్కడ చేపలుంటాయి కదా యని ఫ్యాక్టీలోని నూనే డ్రమ్ము లో ప్రవేశించి తినేశాను."

అరవింద్ : "బాబా! నేనైతే కారులో కూర్చొని తలుపులూ కిటికీలు మూసేసి తినేశాను."

రాము : "నేను ఎక్కడా తినలేక పోయాను జీవజంతువులులేని చోట దేవుడన్నాడుకదా! మన మనస్సులో కూడా ఉన్నాడని మీరే చెప్పారు కదా!"

గురూజీకి రాము సమాధానం ఎంతో సంతృప్తినిచ్చింది.

బాబా ముగ్గురు వైపు చూస్తూ ఇలా అన్నారు. "మీరంతా నాదగ్గర బాగా చదువుకున్నారు. పరమార్థాన్ని గ్రహించింది రామూ ఒక్కడే. మనం ఏ పని చేసినా దేవుడు చూస్తాడు. మీరు నాల్గు దిశల్లో వెళ్ళారు. ఈ నాల్గు దిశలు ఒకచోట కలుస్తాయి. అంటే మీ మనస్సుల్లో. ఆ చోటే దేవుడున్నాడు. వారికి దైవానుభూతి కలిగింది.

నీకు అన్నీ సాధ్యమే - కారణం, 'తత్త్వమసి'

# 27. దేవుడెక్కడ

**(సత్యకౌండిన్యుని కథ)**

**స**త్యకౌండిన్య సికిందరాబాద్ వాస్తవ్యులు. వ్యవస్థాపన, వాణిజ్య సంస్థల సలహాదారునిగా ఆయనకు పెద్ద పేరు ఉంది. ఆయన స్థారక నామదేయుడు. కౌండిన్య గోత్రజులు మహా సత్యవాదులు. అయితే వారిలాగా, సత్యకౌండిన్య ముక్కోపి మాత్రం కాదు "అలుగటయే ఎరుగని" మహానుభావుడు. ఎన్నో వాణిజ్య, పారిశ్రామిక సంస్థల భవిష్యత్తు 'రావుల్ దప్పిన' అంటే సమస్యాత్మక మైన వేళ చాలా సార్లు 'సిరికి' చెప్పకుండానే హుటాహుటిగా పరిష్కారం కనుగొనే నిమిత్తం పరువులు పెట్టేవారు.

హైదరాబాద్‌లో 'మహావీర్ కార్పొరేషన్' అనే ఓ వితరణ సంస్థ ఉంది. హర్షద్, ప్రఫుల్ ముఖేశ్ ఈ సంస్థకు యజమానులు. ఈ సంస్థకు ప్రఫుల్ ఆధార శిలలాంటి వాడు. ఆయన వాణిజ్యసరళిలో సృజనాత్మకత అంతర్లీనంగా ప్రవహించేది. ఆర్థిక వ్యవహారాలు, క్రయవిక్రయ వ్యవహారాలు ముఖేశ్ చూసేవాడు. లక్షలార్జించి పెట్టే ప్రైవుడ్ బిజినెస్‌లో కన్స్ట్రక్షన్ బిజినెస్ లో హర్షదు ఊపిరి పీల్చుకునడానికి కూడా సమయం చిక్కేది కాదు.

మహారాష్ట్రలోని పూణే నగరంలో వితరణ దారుల సమావేశమయ్యింది. ఆ సమావేశంలో పాల్గొన్న ప్రఫుల్కు మొదటి సారిగా సత్యకౌండిన్యతో పరిచయమేర్పడింది. దినార్ధంలోనే వారి పరిచయం స్నేహంగా మారింది. మహావీర్ సంస్థను సందర్శించ వలసిందిగా ప్రఫుల్ కౌండిన్యను కోరాడు.

సత్యకౌండిన్య నిరాడంబరులు. ఆయన అవసరాలు బహుస్వల్పం. ఆయనకు వచ్చే కల్పనలే ఆయన అక్షయమైన ఐశ్వర్యం.

1997–99 మధ్యవధి, పరిశ్రమనూ, వాణిజ్యాన్ని ఇబ్బందుల్లో పడేసింది. ఉత్పాదన భారీగా పడిపోయింది. అమ్మకాలు పడిపోయాయి. ఉరుకులు పరుగులు మొదలయ్యాయి. మహావీర్ సంస్థ దిక్కు తోచని పరిస్థితి ఎదురుకొంటున్నది.

ఒకనాడు ప్రఫుల్ సత్యకౌండిన్యను కలుసుకొన్నాడు. చాలా సేపు ఏవేవో మాట్లాడుకున్నారు. తనను వేధిస్తున్న ప్రశ్నల గురించి మౌనం వహించలేక, ప్రఫుల్ కౌండిన్యను ఇలా ప్రశ్నించాడు. "దేశంలో పారిశ్రామిక రంగం ఏ స్థితిలో ఉంది?

సత్యకౌండిన్య శాంతగంభీరస్వరంతో ఇలా అన్నారు. ''గడ్డు రోజుల్ని ఎదురుకొంటున్నది. ఇప్పుడు వీస్తున్న 'ఉదారీకరణ' 'ప్రపంచీకరణ' అనే ఝుంఝూ వాతానికి ఊగిసలాడుతుంది. నేలపై నిల్వడం నానాటికి 'కత్తిమీద సాము' అవుతున్నది."

ప్రఫుల్ : "మిమ్మల్ని ఓ ప్రశ్న అడుగదలిచాను."

సత్యకౌండిన్య : "ఒకటేమిటి – ఎన్నైనా అడగండి."

ప్రఫుల్ : "ఇప్పుడు తలెత్తిన సంక్షోభంలో అందరూ ఉత్పాదన వ్యయాన్ని

తగ్గించుకుంటున్నారు. 'సలహా' తీసుకోవడం అలా వుంచి, అది ఇచ్చే వారిని ఆమెడ దూరంలో పెడుతున్నారు. అలాంటప్పుడు మీకు చేతినిండా పని ఉండడం నాకు ఆశ్చర్యంగా ఉంది."

సత్యకౌండిన్య ఎప్పటిలా చిరునవ్వుతో ఇలా అన్నారు. "ఏనాడూ, ఎవరి నుండీ, పెద్ద మొత్తాన్ని ఆశించకుండానే సలహా లిస్తూ వచ్చాను. చిల్లి గవ్వ ఇచ్చినా సంతోషంగా స్వీకరించాను. సమస్యలకు, దేవుని దయవల్ల, నావద్ద పరిష్కారం వెదకటానికి చిన్న కిటుకు వుంది.

ఇంతవరకు మౌనంగా ఉన్న ముఖేశ్ కౌండిన్య వైపు చూస్తూ ఇలా అభ్యర్థించారు. "అదేమిటో మాకు చెబితే మిమ్మల్ని మాటిమాటికి ఇబ్బంది పెట్టే అవసరం వుండదు. సమస్యకు మేమే పరిష్కారం వెదుక్కొంటాం."

తెలివిగా అడిగిన ముఖేశ్ ప్రశ్నకు కౌండిన్య ఆశ్చర్యపోతూ ఇలా అన్నాడు. "పూర్వం మన దేశంలో పల్లెపల్లెలో వైద్యుడనే ప్రాణి వుండే వాడు. ఆయన చేతిసంచీలో నలుపు రంగు మాత్ర ఉండేది. జలుబుకైనా క్యాన్సర్కైనా అదే ఇచ్చేవాడు. ఆశ్చర్యం ఏమిటంటే ఆ రోగి కోలుకునే వాడు. నా దగ్గర కూడా ఓ 'సర్వరోగ నివారిణి' మాత్ర వుంది."

హర్షద్ మౌనంగా ఉండలేక చర్చలోకి దిగాడు. గురూజీ! ఆ కిటెకేమిటో చెప్పి, పుణ్యం కట్టుకొండి.

సత్యకౌండిన్య అన్నారు. "అలాగే! ఈ మధ్య ఎక్కడికి వెళ్ళిన రకరకాల ప్రశ్నలు వేస్తారు." 'గుణాత్మకత ఎలా సాధించటం?' నా సమాధానం: 'దేవుణ్ణి ప్రార్థించండి'. 'కార్మికుల్లో క్రమశిక్షణ లోపిస్తుంది. ఏం చేయడం?" నా ఓదార్పు : 'దేవుణ్ణి స్మరించండి'. 'ఉత్పాదన వ్యయం ఎలా తగ్గించేది?" నా సలహా : 'దేవుని ధ్యానించండి'. దేవుని అనుగ్రహం ఉంటే ఏదైనా సాధ్యమని అందరూ అంగీకరిస్తారు. కొందరు అత్యుత్సాహ వంతులు 'దేవుని చిరునామా ఇవ్వండి. ఈ–మెయిల్ ద్వారా ఆయన్ని సంప్రదిస్తాం' అంటారు."

ముగ్గురు సోదరులు ఆశ్చర్యం వెలిబుచ్చుతూ అన్నారు. దేవుడన్నా గాడ్ అన్నా ఒక్కటే కదా!

కౌండిన్య : ఔను! ఒక్కటే. సర్వజగాలను ఏలే వాడు పరమాత్మే. పారిశ్రామిక, వాణిజ్య రంగానికి ప్రేరణాస్వరూపమైన ఆ పరమాత్మనే 'గాడ్' అంటారు.

అర్థం కాలేదని ముగ్గురూ తలలూపారు.



క్షణం ఆగి కౌండిన్య మళ్ళీ చెప్పడానికి ఉపక్రమించారు. "దేవుణ్ణి ఎవరు చూపలేరు. స్వామియైనా, ముల్లా అయినా చివరకు తండ్రియైనా వారు చూపేది దేవుణ్ణి చేరే మార్గం. మార్గం మీదుగా వెడితే రోజులో, వారాలో, నెలలో, సంవత్సరాలో పట్టవచ్చు. ఈ జన్మలో కాక పోయినా, వచ్చే జన్మలోనైనా చివరకు దేవుణ్ణి దర్శించడం సాధ్యమవుతుంది. నా మట్టుకు నేను దేవుణ్ణి "గాడ్" నూ ఇద్దరిని చూచాను.

కౌండిన్య : "హర్షద్! ప్రఫుల్! ముఖేశ్!! నేను చేప్పేది శ్రద్ధగా వినండి. గాడ్ అంటే **G.O.D.** గ్రూప్ ఆర్గనైజేషన్ – డైరెక్షన్. ఓ మానవ సమూహం వ్యవస్థగా ఏర్పడి దిశను నిర్ధారించుకొనగలగితే 'గాడ్' సందర్శనం అవుతుంది. ఏ ఆచార్యుడూ అవసరం లేదు. సమూహమే పరిష్కారాన్ని సాధించగలగుతుంది. 'సంఘశక్తి కలియుగే'. భౌతికవాదాధిష్ఠిత వర్తమానజగత్తులో దేవుని అస్తిత్వం సమూహంలోనే లేదా దళంలోనే."

ప్రఫుల్ గురూజీ ఆశయాన్ని గ్రహించి ఇలా అన్నారు. "గురూజీ చెప్పింది నిజం! పరిష్కారం సమూహం ద్వారానే వెదకాలి. అందర్నీ ఇముడ్చుకునే కేంద్రకం కావాలి సమూహం.

ముఖేశ్ ప్రశ్న లేవదీశాడు. "గురూజీ! 'గాడ్' 'డాగ్' గా మారితే ఏం చేయాలి. ఇది కటువాస్తవత. మీరు అంగీకరించాలి.

ప్రఫుల్ : "డాగ్ అంటే డిజార్గనైజ్డ్ గ్రూప్ అంటే వ్యవస్థను కోలుపోయిన సమూహం లేదా అవ్యవస్థిత సమూహం అన్నమాట."

హర్షద్ : "మనం డాగ్ నుంచి గాడ్ దిశలో కదలాలి. కలిసి పనిచేయటం, కలిసి నేర్చుకోవడం, కలిసి సంఘర్షించి విజయశ్రీని చేపట్టడం.

హర్షద్ అన్నమాటకు ముఖేశ్ ప్రభావితుడై ఇలా అన్నాడు. మన సంస్థకు "మహావీర్" అనే పేరు అప్పుడు సార్థకమౌతుంది. యశాన్ని ఆర్జిద్దాం. మశస్వుల మౌదాం.

ప్రఫుల్ స్లిప్ చార్ట్ మీద ఓ ముకులితహస్తాన్ని చిత్రించి ఇలా వ్రాశాడు.

యస్ – అస్ – వుయ్. యశస్వి.

నల్గురూ చప్పట్లు చరచారు. **G.O.D.** లో గాడును చూచారు.

దిశను కల్గిన వ్యవస్థిత సమూహమే దైవం.

# 28. వేదన నుంచి అనిర్వేదంలోకి

**(జితాత్మానంద - రిచీజాన్సన్‌ల కథ)**

**న్యూ**యార్క్‌కు చెందిన రిచీ జాన్సన్ ప్రపంచంలో వేళ్ళమీద లెక్కపెట్టదగిన ధనికుల్లో ఒకరు. అపర్యాప్తమైన ఆర్థిక సామ్రాజ్యానికి ఆయన ఏకైక వారసుడు. ఎన్నో వాణిజ్య సంస్థలలో భారీగా పెట్టుబడులు పెట్టారు. దిన దిన ప్రవర్ధమానమవుతున్న ఐశ్వర్యం ఆయనది. రిచీ ఆగర్భ సంపన్నుడే అయినా జీవితంలో శాంతిని, అనిర్వేదాన్ని ఎన్నడూ నోచుకొనలేదు. అతి స్వల్ప విషయాలు ఆయనకి చెప్పలేని చికాకును కలిగించేవి. బిగ్గరగా అరవడం, దుర్భాషలాడడం ఆయనకు నిత్యకృత్యమైంది. దేనినైనా డబ్బుతో కొనవచ్చనే భ్రాంతికి గురియైనాడు.

ఆయన చిన్నతనం – చిన్న తనంలో మేరీ ల్యాండ్లో మాతామహుని ఇంట సరదాగా గడిపిన క్షణాలు, ఎన్నెన్నో మధురానుభూతులు అప్పుడప్పుడాయనకు గుర్తుకు వస్తుండేవి. ఆయన మనస్సులోని అన్ని స్తరాలు శాంతినే కాంక్షిస్తున్నాయి.

ఒకనాడు ఉన్నట్టుండి మేరీల్యాండ్ కు ప్రయాణం కట్టాడు. మాతామహుని గృహం స్టాప్ అండ్ షాప్ అనే అక్షరాలు గల బోర్డుతో షాపింగ్ సెంటర్గా మారింది. తాను అన్వేషిస్తూ వెళ్ళినా ఒకే ఒకే సోతస్సు ఇంకిపోయింది. రిచీ దిగ్భ్రాంతుడైనాడు.

శాంతి కోసం తను ఆరంభించిన అన్వేషణను అలాగే కొనసాగించాలని నిర్ణయించుకున్నాడు. ఏ మూల్యమైనా చెల్లించడానికి కృత నిశ్చయుడైనాడు.

తన యాజమాన్యంలోని అనేక సంస్థల్లోని ఒక సంస్థకు చెందిన ఓ ఉపాధ్యక్షుడు భారత క్కు వెళ్ళమని సలహా ఇచ్చాడు. ఇక మానవునకు మిగిలి వున్న శాంతి ధామం "భారత్" అని ఆయనకు అనేక విధాల నచ్చ చెప్పాడు.

తన ప్రస్తుత కార్యక్రమంలో అవసరమైన మార్పులు చేసికొని అతి కష్టం మీద వారం రోజులు విరామాన్ని తనకై కల్పించుకున్నాడు. ఓ శనివారం సాయంత్రం న్యూయార్క్ నుండి ముంబాయికి వెళ్ళే విమానం ఎక్కాడు. ఆయన వెనుక, మూడవ శ్రేణిలో, ఒక భారతీయుడు కూర్చున్నాడు. అతడు ఆనంద్ ఎప్పుడూ ఉల్లాసంగా కన్పించేవ్యక్తి పరిచయం ఏర్పడ్డాక ఎంతో సేపు ఏవేవో కబుర్లు చెప్పుకున్నారు. ఎల్ల వేళలూ ఆనందంగా ఉండడం ఎలా సాధ్యం.?

హిమలయాల్లో మాయావతి అనే చోట 'శాంతీధామ్' అనే ఆశ్రమముందని, అందులో ఉంటున్న జీతాత్మనందుల 'వారి అనుగ్రహం వల్ల తాను నిత్య సంతోషిగా మారగలిగానని ఆనంద్ రిచికి చెప్పాడు.

"ఇది నాకు సాధ్యమౌతుందా!" రిచీ అడిగాడు.

అందుకు ఆనంద్ ఇలా బదులు చెప్పాడు. “ఔను సాధ్యమే అయితే హిమాలయాల్లోని స్వామి వారిని దర్శించాలి. ఆయన అనుగ్రహిచాలేగాని, సుఖశాంతులను మనం వెదుక్కోనక్కర్లేదు. అవే మనను వెదుక్కుంటు వస్తాయి.

ఆనంద్ చెప్పింది రిచీకి ఎంతో ఊరట కల్గించింది. ఎయిర్ ఫోన్ ద్వారా ఢిల్లీ విమానాశ్రయం వారితో సంపర్కం సాధించి తన కోసం టికెట్ బుక్ చేసుకొని, అక్కడి నుండి తాను శాంతిధామ్ చేరుకునేందుకు టాక్సీ ఏర్పాటు చేయాల్సిందిగా అధికారులను కోరారు. ముంబాయిలో విశ్రాంతి తరువాత మంగళవారం నాటి సాయంత్రం మాయావతి చేరుకునేట్టు ప్రయాణ ప్రణాళికను రూపొందించుకున్నాడు. వచ్చే సోమవారం తిరిగి న్యూయార్క్ చేరుకునేందుకు మాయావతి నుండి గురువారం సాయంత్రమే తిరుగు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. స్వామీజీ ఆశ్రమంలో గడిపేందుకు ఆయనకు లభించిన వ్యవధి రెండు రోజులు మాత్రమే. ‘స్వామి జితాత్మనంద’ అనడంలో రిచీ ఇబ్బందిని గమనించి, కేవలం స్వామీజీ అంటే సరిపోతుందని ఆనంద్ రిచీకి సలహా ఇచ్చాడు.

రిచీ జాన్సన్ ముంబాయికి చేరుకున్నాడు. ఎక్కడ చూచినా జనాలే. ముంబయి ఒక విరాడ్జనార్ణవ అనే వాస్తవతను గుర్తించటానికి రిచీకి ఎంతో సమయం పట్టలేదు. కుచేలుడైనా, కుబేరుడైనా ఈ మహానగరంలో ఆనందంగా ఉండగల్గడం ఆయనకు ఆశ్చర్యాన్ని కల్గించింది.

రిచీ జాన్సన్ జనాన్ని కలిసిన ప్రతిచోటా – హోటల్, టాక్సీ, పార్క్ ఏదైనా ఆత్మ శాంతిని గురించే మాట్లాడాడు. “ఆత్మశాంతికి తాము ప్రాధాన్యమిస్తామని నిత్య జీవితంలో ప్రార్థిస్తూ, పనిచేస్తూ, దాన్ని తాము కొద్దో గొప్పో పొందుతున్నామని, అది ఎలా పొందాలో ఇతరులకు చెప్పలేమని రిచీకి వారు చెప్పారు.

రిచీ హిమాలయ ప్రాంతంలో ఉన్న మాయావతికి చేరుకున్నాడు. హిమాచ్ఛాదిత పర్వత శ్రేణుల్ని, అక్కడి అందమైన పరిసరాల్ని చూసి మంత్రముగ్ధుడయ్యాడు. ఆందోళన నుండి కాస్త బయట పడ్డాడు. ఏదో ఒక మజిలీ వద్ద తోటి ప్రయాణికుడు మట్టి పాత్రతో ‘టీ’ ఇస్తే ఆనందంగా స్వీకరించాడు. అడుగడుగునా మానవునితో పాటు ప్రకృతి హస్తాలు సాచి రిచీకి స్వాగతం పలికింది.

శాంతీధామ్ మంగళవారం చాలా పొద్దు పోయాక చేరుకున్నాడు. ఆనాటి సాయంత్రపు ‘సత్సంగ్’ కార్యక్రమం ముగియడానికి వచ్చింది. స్వామి వారు ‘ఓం’ అన్నారు. అందరూ ‘ఓం’ అంటూ ప్రతిస్పందించారు. ఆశ్రమ పరిసరాలు నాదబ్రహ్మమయతను వరించాయి. స్వామి స్థూలకాయులు కార్ష్మ అలా అని క్షీణ దేహులు కారు. గంభీరంగా కన్పడలేదు, నవ్వుతున్నట్లూ కనపడలేదు. ఆయన కనుచూపులో కరుణ తన నెలవును ఏర్పర్చుకుంది. స్వామీజీ కాషాయ వస్త్రాలు ధరించారు. కాషాయవర్ణపు “కుల్లాను” పెట్టుకున్నారు. కార్యక్రమం పూర్తి అయ్యాక ఆయనకు సమస్కరించి తమ తమ విడిదికి వెళ్ళిపోయారు.

జాన్సన్ ఇంకా కూర్చునే వున్నాడు. 'స్వామీజీ' అంటూ బిగ్గరగా సంబోధించాడు. స్వామీజీ ఏమీ మాట్లాడకుండా రిచీకి నమస్కరించి హాలు నుండి నిష్క్రమించారు. స్వామిజీని పలుకరించ కూడదని ఆయన శిష్యుడు రిచీకి సలహా ఇచ్చాడు. ఆయన తిరిగి మౌనంలోకి వెళ్ళిపోయారని మరుసటి సాయంత్రం 5 గంబబల వరకు సంభాషించరని చెప్పాడు. స్వామీజీతో మాట్లాడడానికి రెండు గంటల వ్యవధి మాత్రమే ఉంటుందని ముగించాడు.

రిచీ జాన్సన్ తీవ్రనిరాశకు లోనయ్యాడు. తన సమస్యకు వెంటనే పరిష్కారం దొరుకుతుందని భావించిన అతనికి ఆశాభంగమే అయ్యింది. ఆశ్రమంలోని వయోవృద్ధుడైన యోగి దగ్గరకు వెళ్ళి తనకు విడిగా దర్శనం దొరుకుతుందా? అని అడిగాడు. ఎంత ధనమైనా వెచ్చించడానికి తన సంసిద్ధతను తెలుపుకున్నాడు.

ఆవృద్ధయోగి నిఖిలేశ్వరానంద స్వామివారు ఆయన రిచీని ఇలా తిరిగి ప్రశ్నించాడు. "మీ ఆశయ సిద్ధికి ఎంత మూల్యం చెలించదలిచారు?

రిచీ అన్నాడు "ఎంతైనా! ఒక లక్ష డాలర్లు సరిపోతాయనుకుంటున్నాను." నిఖిలేశ్వరానంద చిరునవ్వుతో "అది స్వల్పం" అన్నాడు.

మరునాడు సత్సంగ్ అయ్యే హాలులో దాదాపు ముప్పయి మంది పెద్దా చిన్నా గుమిగూడారు. అందరూ మౌనస్థితిలో ఉన్నారు. స్వామీజీ హాలులోకి రాగానే అందరు లేచి నిలబడి అభివాదం చేశారు. రిచీ తనదైన శైలిలో స్వామిని పలుకరించారు. స్వామీజీ స్పందించలేదు. మూడు మార్లు "ఓం" అన్నారు. "ఓం" అంటూ శ్రోతలు ప్రతిస్పందించారు. రిచీకి మొదటి మారు జీవితంలో ఏదో దివ్యానుభూతి కల్గింది. స్వామిజీ నిన్నటి లాగానే కఠోపనిషద్పై తన ప్రవచనాన్ని కొనసాగించారు.

"యముడు నచికేతునితో ఇలా అన్నాడు.

శ్రేయోహి ధీరోఽభి ప్రేయసోవృణీతే
ప్రేయో మందో యోగక్షేమా ద్వృణీతే. కఠోపనిషత్తు ద్వి. వ. 2.

నచికేతా! నీవు ప్రేయాన్ని కాదని శ్రేయాన్ని ఎన్నుకున్నావు. అందుకే నాకు ప్రీతి కోరికలను తీర్చుకునే పాత్రుడవయ్యావు. అవసరాలు తీర్చుకునే మార్గం శ్రేయో మార్గం మార్గం ప్రేయో మార్గం. అయితే కోరికలు అనంతాలు. ఒకటి తీరగానే మరోకటి మానవ హృదయంలో మొలకెత్తుతుంది. క్షణిక సుఖాలకు హేతువైన భౌతిక వైభవాన్ని త్యజించి మానవుడు శాంతిని, అభ్యుదయాన్ని ప్రసాదించే శ్రేయో మార్గాన్నే ఎన్నుకోవాలి."

స్వామీజీ వాక్యాలు రిచీ గుప్త జ్ఞానాన్ని తట్టి లేపినట్లయింది. నేనూ నా దేశవాసులూ దేనికి ప్రాధాన్యత నిస్తున్నారు? అర్ధ సంచయం. అర్థమే అన్ని భోగాల్ని మానవునకు సమకూరుస్తుంది. అర్థం వల్లనే సమాజంలో ప్రతిష్ఠ. భోగరహితమైన జీవితమేమి జీవితం? అర్ధంవల్లనే అధికారం. అందుకే అర్థం, ప్రతిష్ట, అధికారం కోసమే ఈ ఎలుకల పరువు పందెం. నా దేశంలో...."

కార్యక్రమం ముగిసే ముందు స్వామీజీ అభిమానుల్ని అంగుళీ నిర్దేశం చేసి ప్రశ్నలు అడగమనడం దానికి జవాబు చెప్పడం అయిపోయింది. హాలు నుండి నిష్క్రమిస్తూ స్వామీజీ రిచీని గుర్తించనే లేదు.

రిచీ ఓపిక నశించింది. ఏదో అడుగబోయి నిఖిలేశ్వరానందులచే నివారింపబడ్డాడు. ఆయన స్వామీజీకి అతి సన్నిహితులు. "స్వామీజీ అంగుళీ నిర్దేశం చేసిన వ్యక్తి నుండి వచ్చిన ప్రశ్నకు తప్ప మరెవరి ప్రశ్నకు సమాధానమీయరు" అని చెప్పాడు.

స్వామీజీ మరో నాల్గు రోజులు రిచీనీ నిర్లక్ష్యం చేశారు. తాను బయలు దేరవలసిన గురువారం, కాలచక్రం క్రింద నలగి నుగ్గయి పోయింది. తాను నిర్ణయించుకున్న సమాయానికి న్యూయార్క్ చేరలేకపోతే కోట్లు చేసే ఆర్థిక నిర్ణయాలు ఏం కావాలి? ఇక్కడ ఇలా కాలం వృధా చేసే కంటే తిరుగు ప్రయాణం కట్టడమే మంచిది. – రిచీ చాలా పట్టుదలగల మనిషి – ఇలా వస్తున్న ఆలోచనలను పక్కకు పెట్టాడు. అనుకున్నది సాదించేవరకు అన్నపానీయాలు వదులుకునే తత్త్వం రిచీది "ఏండ్లు పూండ్లయినా ఇక్కడ నుంచి కదిలేది లేదు. జితాత్మానందుల వారి నుండి శాంతి మంత్రం రాబట్టి తీరాలి. ఆయనను కాదంటే శాంతికి మార్గం చూపేవారు మరెవరున్నారు? "న్యూయార్కులోని సంబంధితులతో అదే రాత్రి ఫోన్లో మాట్లాడాడు. తగు సూచనలిచ్చాడు. విశ్వాస పాత్రులైన ముగ్గురికి అన్ని నిర్ణయాలు తీసుకునే అధికారం కట్టబెట్టాడు. పర్యాయ వ్యవస్థ ఈరీతిగా పకడ్బందీగా రూపొందించాడు. – తన వృత్తి జీవితంలో అధికార వికేంద్రీకరణకు మొదటి సారిగా శ్రీకారం చుట్టాడు. దీని వల్ల మొదటి సారిగా కొంచెం ఊపిరి పీల్చుకొనగలిగాడు. తన ఆశయం సిద్ధించే వరకు 'మాయావతిని' వీడేది లేదని భీష్మ ప్రతిజ్ఞ చేశాడు.

ఆదివారం సాయంత్రం స్వామీజీ ప్రవచనం ముగించాక, మొదటి సారిగా రిచీ జాన్సన్ వైపు అంగుళీ నిర్దేశనం చేశాడు.

జాన్సన్ మాట్లాడాడానికి అంతరాయం తొలగిపోయింది. హుందాగా స్వామీజీని ఇలా ప్రశ్నించాడు.

"స్వామీజీ! శాంతి అంటే ఏమిటి? అది పొందటానికి అనుసరించాల్సిన మార్గం ఏమిటి? దయచేసి నాకు అర్థమయ్యేట్టుగా చెప్పండి."

నిమీలిత నేత్రులై క్షణం పాటు స్వామీజీ పరబ్రహ్మకు ప్రతీక అయిన 'ఓం' కారాన్ని ఉచ్చరించారు. వెంటనే ప్రవచన స్థలిని నిమిషార్ధంలో వదిలి బయటకు వెళ్లి పోయారు. సమాధానం చెప్పవలసినదిగా రిచీ నిఖిలేశ్వరానందుల వారిని కోరారు. స్వామి ఇలా సెలవిచ్చారు.

"నీవు అడిగిన ప్రశ్న సామాన్యమైనది కాదు. అర్జునుడు కృష్ణుణ్ణి ఇలాగే ప్రశ్నించాడు. ఇది జటిలమైంది. నీవు ప్రతీక్షించాల్సి ఉంటుంది. స్వామి వారు మళ్ళీ మౌనం లోనికి ప్రవేశించారు. సమాధానం రావడానికి కనీసం వారమైనా పట్టవచ్చు – నీవు ఓపిక

వహించాలి. రిచీ నిఖిలేశ్వరానందుల వారి వద్ద గీతాధ్యయనం ఆరంభించాడు. అనిర్వచనీయమైన ప్రేరణ రిచీకి అనుభూతమయ్యింది. మూడు రాత్రులూ మూడు పగళ్ళు నిమిషాల వలె గడిచిపోయాయి.

స్వామి వారిని అడగాల్సిన ప్రశ్న విస్మృతి క్షితిజానికి చేరుకుని అస్తమించింది. గీతాధ్యయనం – ధ్యానం – సత్సంగము ఇదే రిచీ శ్వసనమై పోయింది.

“నాల్గవ నాటి ప్రవచనం ముగిశాక, స్వామి వారు రిచీతో ఇలా అన్నారు. “శాంతి అంటే ఏమిటని నన్ను అడిగావు కదా! పితామహుడు మరణిస్తాడు. జన్మదాత యైన తండ్రి మరణిస్తాడు. ప్రాణప్రదమైన పుత్రుడు మరణిస్తాడు. ఇదే శాంతి.”

ఓంకరాన్ని ఉచ్చరించి, వేదికను వదిలి, విశ్రాంతి కక్ష్యలోకి వెళ్ళిపోయారు.

జాన్సన్ క్షణం దిగ్భ్రాంతుడైనాడు. ‘వాగ్వజ్రాన్ని విసిరి, మూడు తరాల్ని మృత్యు గహరంలోకి త్రోసి ఇదేశాంతి అనడం చిత్రంగా ఉంది.’ అంటూ లోలోపల వాపోయాడు.

నిఖిలేశ్వరానందుల వారు సందేహ నివృత్తికై మరుసటి రోజు వరకు వేచి యుండాలని సలహా ఇచ్చారు.

మరుసటి రోజు జాన్సన్ ఔపచారికతను ప్రక్కకు పెట్టి, ప్రవచనం పూర్తి కాకుండానే స్వామీజీని సూటిగా ప్రశ్నించారు.

“స్వామిజీ! నిన్న ఒకే వాగ్బాణంతో మూడు తరాలకు ముక్తి కలిగించారు. ఇదే శాంతి అని సెలవిచ్చారు. మీ మాటలు నన్ను అయోమయంలో పడేశాయి.”

స్వామీజీ రిచీని కనుసైగతో నివారిస్తూ తన ప్రసంగాన్ని కొనసాగించారు.

“యా నిశాసర్వభూతానాం, తస్యాం జాగర్తి సంయమీ!
యాస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః

సర్వ జీవులు రాత్రికి వశమైన వేళ జ్ఞాని మేలుకొనియే ఉంటాడు. ఇంద్రియజన్య సుఖాలనుభవిస్తూ జీవులు మేలుకొని యున్న వేళను జ్ఞానియైన వాడు రాత్రిగా భావిస్తాడు.

ప్రవచనంలో చీకటి అనే పదానికి స్వామీజీ చేసిన భాష్యం రిచీకి అసలే చెవికెక్కలేదు. మూడు తరాలు మూగియగా ఏర్పడే కాళరాత్రి ఇంకా ఆయనను పట్టుకొని పీడిస్తూనే ఉంది.

ప్రవచమున వేది నుండి లేచి విశ్రాంతి కక్ష్యవైపు వెడుతున్న స్వామీజీ రిచీ కూర్చొన్న చోట ఆగి, ప్రేమతో వీపు తట్టి కరచాలనం చేశాడు. రిచీకి స్వామిజీ స్పర్శ సౌమ్య విద్యుద్ఘాతానుభూతినిచ్చింది.

రిచీకి నిదుర పట్టలేదు. శంకాన్వితమైన మనస్థితి, స్వామీజీ స్పర్ష వల్ల కలిగిన విన్నూత్నానుభూతి అనే రెండు ధృవాల మధ్య రిచీ మానసం ఊగిసలాడింది.

మరునాటి సాయంత్రం స్వామీజీ హాలులోకి వచ్చి తమపీఠం మీద ఆసీనులై "ఓం" అని ప్రారంభించారు. శ్రోతలవైపూ, జాన్సన్వైపు కృపాదృష్టిని ప్రసరించి ప్రవచనాన్ని ప్రారంభించారు.

"మృత్యువు ఒక స్వల్ప విరామం. ప్రియ జనులు మరణం మనకు శోక కారణం. అయినా మృత్యువనేది కాదనరాని కఠోర వాస్తవత. జన్మ ఎంత యథార్థమో, మత్యువు అంతే యథార్థము. మృత్యువునకు స్వాగతం చెప్పగలిగినపుడే మృత్యుంజయులమవుతాము.

"పితామహుడు గతిస్తాడ్మ్ము తండ్రి గతిస్తాడ్మ్ము ఆపై పుత్రుడు గతిస్తాడ్మ్ము ఇది నైసర్గికం ఇందులో క్రమం ఉంది. క్రమం కొనసాగినంత వరకే శాంతి. ఆ క్రమం భగ్నమైన నాడు అరాజకత తలెత్తుతుంది. అశాంతి తలెత్తుతుంది."

"నీకు అంగీకారమేనా " అన్నట్లు రిచీవైపు చూచారు స్వామీజీ.

జాన్సన్ ముఖం మీది నీడలు తొలగిపోయాయి. వెలుగులావహించాయి.

స్వామీజీ ! నా భ్రాంతి పటాపంచలైంది. నా ఆలోచనలకు ఓ స్పష్టత ఏర్పడింది. ఆలోచనల్లో, భావాల్లో, ఆచరణలో క్రమముండాలని మీరు చెప్పినది తిరుగులేని సత్యం దాన్ని నేడు దర్శించ గలిగాను.

మన భావాలకు ఆచరణకు ధ్యాన వైచారిక అధిష్ఠానం. ఉన్నప్పుడే శాంతి సామరస్యాలు సాధ్యమవుతాయి. స్వరమేళనం వల్లనే సహజీవనం సాధ్యం.

స్వామీజీ పెద్దగా నవ్వారు.

ఆ నవ్వులో సెలయేటి గలగల వుంది. ఉవ్వెత్తు లేచి పడే సాగర తరంగాల గంభీర శిశిర యామినులలో పూరేకులపై మంచు బిందువులు పడినప్పుడు అయ్యే చిరు సవ్వడి వుంది. శుచిత్వం, అనురాగం, వేదమంత్రంలా ఆ నవ్వులో వ్యంజితమైంది.

జాన్సన్ అన్నాడు.

స్వామీజీ ! ఆమెరికా సుసంపన్నత సాధించినా అక్కడి మనిషి జీవితంలో ద్వంద్వ స్థితినే చూస్తున్నాను. దీని నుండి విముక్తుణ్ణి కావాలనే మిమ్మల్ని ఆశ్రయించాను.

స్వామీజీ రిచీతో ఏకీభవిస్తూనే, తన అభిప్రాయం ఇలా వెలిబుచ్చారు.

"నీవు చెప్పే ద్వంద్వ స్థితి ఇక్కడా వుంది. దీనికి నేను సూచించే పరిష్కారం ఇది.

**ద్వద్వం – అంతర్ద్వంద్వం బహిర్ద్వంద్వం – నిర్వంద్వం – అనిర్వేదం**

నీవు నిత్య జీవితంలో ఎదురుకునే ద్వంద్వాన్ని అంతర్గతం చేసుకో –అంటే అంతర్ద్వంద్వంగా మార్చుకో అంటే సంకల్పంగా చేసికో. ఈ సంకల్పాన్ని ఇతరులతో అంటే స్వజనులతో, సహచరులతో పంచుకో, అంటే బహిర్గతం చెయ్యి. అప్పుడు అది

బహిర్ద్వంద మౌతుంది. ఈ బహిర్ద్వంద్వాన్ని కృతితో మేళవించినప్పుడు నిర్ద్వంద్వ స్థితి సాధ్యమౌతుంది.

పలాయనవాదం ద్వంద్వస్థితిని అధిగమించడానికి దోహదం కాదు. కాయికంగా, మానసికంగా, బౌద్ధికంగా స్పందించడమే నిర్ద్వంద్వ స్థితికి అంటే అనిర్వేద స్థితికి సోపానం. స్వామీజీ చెప్పింది, రిచీ తాపీగా వల్లెవేశాడు.



"జితాత్మానంద" అనే పదానికి అర్థమేమిటని రిచీ అడిగాడు. "అహాన్ని జయించాక కల్గి ఆనందం." అని నిఖిలేశ్వరానందుల వారు సమాధానం చెప్పారు.

స్వామీజీ రిచినీ కౌగిళించుకొని ఇలా అన్నాడు. నీవు ఇప్పుడు జితాత్మానందుడవు, ఐశ్వర్యవంతుడవు"

రిచీ ఎన్నటికీ తరగని ఐశ్వర్యానికి వారసుడయ్యాడు.

క్షమ రాహిత్యం అరాజకతకు ఆహ్వానం

# 29. శ్రద్ధ : విశ్వాసం

(పరేశ్ షాహ కథ)

**కా**ర్యక్షమత – అంకిత భావం పోర్బందరులోని పరేశేహకు ఎనలేని కీర్తి నార్జించి పెట్టాయి. ఆ నగరంలో ఉన్న రాసాయనిక కంపనీకి ఆయన కార్యనిర్వాహక డైరెక్టరు. వ్యవస్థాపనా వ్యవహారాల్లో ఆయన నరహర్ పండిత్ను తరుచు సంప్రదించేవాడు.

నరహర్ పండిత్ వ్యవస్థాపనా తంత్రాలను కూలంకషంగా అధ్యయనం చేసిన మనీషి. వ్యవస్థాపనకు భారతీయ ఆధ్యాత్మికతను జోడించి చరిత్రను సృష్టించిన మహానుబావుడు. తలెత్తే పరిస్థితులకు తగిన పరిష్కార మార్గాలను సూచించి పారిశ్రామిక వాణిజ్య జగత్తులో ఓ విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నారు.

ఒకనాడు పరేశ్ షాహ తన కేబిన్లో లో కూర్చొని ఏదో దీర్ఘాలోచనలో మునిగాడు. నరహర్ పండిత్ లోనికి ప్రవేశించాడు. వారిని చూడగానే పరేశ్ షాహ లేచి నిల్చుని నమస్కరించి "ఎలా వున్నార"ని మర్యాదగా పలుకరించారు.

"దేవుని దయవల్ల ఏ లోపంలేదు. హాయిగా వున్నాను." అన్నారు నరర్ పండిత్. "లెక్కకు మించిన సమస్యలతో సతమతమౌతూ మీరిలా, ఉత్సాహంగా కన్పించడం నాకు ఆనందంగా ఉంది గురూజీ! అన్నారు. పరేశ్ షాహ.

"పరిస్థితులు సమస్యాత్మకం కావచ్చు అయినా నిరామయంగా ఉండటానికి అంతరాయమేమిటి? సమస్యలకు దాసోహం అంటే ఎలా? పరిస్థితికి పరిష్కారాన్ని వెదకటం ఎలా సంభవం? మనుష్యుల్ని సమస్యను అధిగమించే స్థితికి ఎలా తీసుకువెళ్ళటం?" గురూజీ తన ఆత్మ విశ్వాసాన్ని ఇలా వ్యక్తం చేశారు.

పరేశ్షాహ : "మీరనేది ముమ్మాటికి నిజం! అయితే మనుష్యులే ప్రశ్నార్థకంగా తయారయినప్పుడు ఏం చేయాలి?"

నరహర్ పండిత్ : "మనుష్యులు మీరన్నట్లు ఎందుకు తయారువుతారు పరేశ్బాబూ!

చాలా కాలంగా వ్యధితుడుగా వున్న పరేశ్, గురూజీకి తన బాధేమిటో తెలియబరిచాడు.

"గురూజీ ! ఎవర్ని నమ్మాలో నమ్మకూడదో తెలియని అయోమయస్థితిలో పడ్డాను. మనం నమ్ముతూ వచ్చిన వాళ్ళే మన నమ్మికను వమ్ము చేస్తున్నారు. మనను మోసగిస్తున్నారు. భ్రష్టాచరణకు, అవినీతికి పాలుపడుతున్నారు.

పరేశ్షాహ అంతర్వేదనను గ్రహించిన నరహర్ పండిత్ ఆయనకు ఊరట కలిగించే విధంగా ఇలా అన్నారు.

"స్వభావతః మనుష్యులు చెడువారు కారు. వ్యవస్థ లోపభూయిష్ఠమై మనిషిని చెడు మార్గం పట్టిస్తుంది. అప్రమత్తత అన్ని వేళలా అవసరం."

“అప్రమత్తంగా ఉండడం అంటే” పరేశేహ తన సందేహాన్ని వ్యక్తం చేశాడు.

“మనుష్యులు చేస్తున్నదానిని ఓ కంట కనిపెడుతూ ఉండటం. ఎలాంటి ఆర్భాటాన్ని ప్రదర్శించకుండా స్వల్ప విరామాల మధ్య అంతా సవ్యంగా జరుగుతున్నదీ లేనిదీ శోధనకు దిగి తెలుసుకోవడం. ఇవి మనం చేయాల్సిన పనులు. మనుష్యులు చెప్పేది అక్షరాలా విశ్వసించకుండా, సందేహ నివృత్తి అయ్యేంత వరకు తరచి తరచి చూడటమే సరైన మార్గం.”

“గురూజీ! మీరు ఎప్పుడూ చెప్పేదానికి ఇది విరుద్ధంగా ఉంది. మనుష్యుల్ని నమ్మండి. ఆశయ సిద్ధికి మనుష్యులే మూలాధారం. వాళ్ళకి అధికారం కట్ట బెట్టండి. బాధ్యతలప్పగించండి. ప్రేమతో వ్యవహరించండి. అలాంటప్పుడు, మనుష్యులు చెప్పేదాన్ని నమ్మక పోవడమంటే వాళ్లు విశ్వసనీయులు కారనే అర్థం కదా !

గురూజీ శాంతంగా అన్నారు. “మీనిష్కర్ష సరైంది కాదు. మళ్ళీ చెబుతాను. మనుష్యుల యెడ శ్రద్ధ అణుమాత్రం సడలకూడదు. మనం నమ్మగూడనివి పరిస్థితులే”.

“అదేలా”? అర్థం కాని పరేశేహ ప్రశ్నించాడు.

“పరేశ్ బాబు! మనుష్యుల యెడ శ్రద్ధ కల్గి ఉండటం అంటే వారికి భాధ్యత నప్పగించడం, సునిర్వచిత పరిమితిలో నిర్ణయాధికారం కట్టబెట్టడమన్నమాట. మనుష్యులు నిజాయితితో ప్రవర్తించినా, పరిస్థితి ఊహకు విరుద్ధంగా పరిణమించే సందర్భాలు లేక పోలేదు. నిర్ణయం తీసుకొనుటలో పొరపాట్లు జరుగువచ్చు. లక్ష్యాలు విషయంలో స్పష్టత లోపించటం కూడా జరుగవచ్చు. అలసత, ఉదాసీనత వాళ్ళలో చోటు చేసుకునే అవకాశమూ వుంది. అందుకే విషమించేవి పరిస్థితులు, మనుష్యులు కారు. సూక్ష్మంగా శోధన పునఃశోధన జరిపాక అంతా సవ్య మనిపించి నప్పుడు మనుష్యులకు తగిన గుర్తిపు ఈయడం, ఉదార హృదయంతో ప్రశంసించడం ఎంతైనా అవసరం. తప్పిన సందర్భాల్లో మృదువుగా మందలించడం, హెచ్చరించడం కూడా అవసరమే. ఇవి పని చేయనప్పుడు, వాళ్ళను సరియైన దారిలో పెట్టే స్ఫూర్తితో అవసరం మేరకు శిక్షించడానికి వెను దీయరాదు.

క్షణం ఆగి గురూజీ ఇలా ఉపక్రమించారు.

“ప్రశంస భోజనంలాగా సరైన మోతాదులో, సరైన సమయంలో అందేలా చూడటం మన దృక్పథం అయివుండాలి. పరిమిత ప్రమాణంలో రోగి నయమయ్యేలా ఇచ్చే ఔషదం వంటిది మందలింపు.

సందేహ నివృత్తి నరహర్పండిత్ చెప్పడం ముగించారు. అయితే పరేశ్ హకు పూర్తిగా కానందున గురూజీతో ఇలా అన్నాడు. “మనిషి యెడ శ్రద్ధ అభ్యున్నతికి ఏకైక మార్గం. అప్రమత్తత వ్యవస్థాపనలో ఆమ్నాతమయ్యే మొదటి సూత్రం.”

గురూజీ! ఇది బాగానే ఉంది. అయితే మనుష్యుల్ని నొప్పించకుండా ఈ రెండు సాధ్యమేనా.?


“సాధ్యమే”! గురూజీ అన్నారు. “చూడు పరేశ్! నీవు శ్రద్ధగా వినవలసిన సందర్భం ఒకటి ఉంది.

మహమ్మదు ప్రవక్త అల్లాహను రోజు ప్రార్థించే వారు. విషమపరిస్థితుల్లో పరమదయాళువైన అల్లాహను స్మరించుకునేవారు. అప్పుడప్పుడు అల్లాహసహాయాన్ని ఒకే రోజు రెండు మూడు మార్లు అర్థించేవారు.

“ఓయి మహమ్మద్! మాటి మాటికి మమ్మల్ని ఎందుకు స్మరిస్తావు.? “మీ అనుగ్రహం నాపై ఎల్లవేళలా ఉందని తెలుసుకొనుటకు” “మమ్మ నీవు విశ్వసించవలెను”.

“మేరే ఆఖా! మీ యందు నాకు అచంచలమైన విశ్వాసము. నేను నమ్మనిది పరిస్థితులనని మనవి చేసుకొంటున్నాను. పరిస్థితి మారిన వేళ, మీ దయాదృష్టి వేరే వైపు మరలుతుందేమోనని, మిమ్మల్ని దినానికి మూడు మార్లు స్మరించుకుంటాను.

అల్లాహ అనుగ్రహసూచకంగా ఆకాశంలో ఓ మెరుపు మెరిసింది. అల్లాహ అనుగ్రహం మహమ్మదుకు మరోమారు అనుభూతమైంది.



ఈరీతిగా సాగిన గురూజీ ప్రబోధం పరేశేహను పరమానందభరితుణ్ణి చేసింది. మనోగగనంపై క్రమ్మిన కారుమేఘాలు పటాపంచలయినవి.

పరేశ్‌బాబు ఉత్సాహంతో ఇలా అన్నాడు. "గురూజీ! మాకు అవసరమైన వేళ మీరు పోరుబందర్కు తప్పక దయచేయాలి.

పరేశ్ అభ్యర్థనకు స్పందిస్తూ గురూజీ అడిగాడు. "మీకు సందేహం ఎందుకు కల్గింది?"

పరేశ్‌షాహ ఇలా బదులు చెప్పాడు. "మీ యందు మాకు సంపూర్ణ విశ్వాసమే. పరిస్థితులు మారిన వేళ ఏ సందేహం మా మనస్సులో తలెత్తకూడదని అడిగాను.

లేనవ్వుతో గురూజీ పరేశ్‌బాబు వైపు చూశారు. ఆయన ప్రేమానురాగం పరేశ్కు మరోమారు అనుభూతమైంది.

ప్రజల యెడ శ్రద్ధ - ఆత్మ విశ్వాసం - పరిస్థితుల యెడ అప్రమత్తత.
ఇవి అభ్యున్నతికి మార్గాలు.

# 30. రామాయణం

**(యతో ధర్మ స్తతో జయః)**

విశ్వసాహిత్యంలో అజరామరంగా నిలిచిన రెండు మహాకావ్యాలు రామాయణ మహాభారతాలు. ఇవి యావత్ప్రపంచాన్ని ప్రభావితం చేసి దృష్టినీ మానవ మూల్యాన్ని ప్రసాదించి సమాజ జీవన స్రవంతిని మాధుర్యోపేతం కావించినవి. ఒక కుటుంబసభ్యునిగా, సామాజిక వ్యక్తిగా, ఏ నియమాలకు కట్టుబడి ఉండాలో, దైనందిన జీవితంలో మనం ప్రవర్తించే తీరు. ఎలా వుండాలో, స్నేహం ఎలా నిలబెట్టుకోవాలో, కావడికుండలైన సుఖదుఃఖాల్లో ఎలా సంయమనం పాటించాలో, అన్నదమ్ములు ఒకరితో నొకరు ఎలా మెలగాలో, తల్లిదండ్రులకు ఎలా విధేయులై యుండాలో రామాయణం చెబుతుంది. ఎన్నో భాషల్లోకి అనువదింపబడి నిత్యపఠనీయ కావ్యంగా రెండువేల సంవత్సరాల తరువాత కూడ నవ్యతను కోలుపోని రామాయణం గురించి ఎంతైనా చెప్పవచ్చు. ఎందరో మహనీయులు చెప్పారు కూడా!

మానవస్వభావాన్ని, మానవ జీవనానికి గల లక్ష్యాల్ని ప్రతిబింబించే గొప్ప రచన రామాయణం. ఇది నల్గురున్నదమ్ముల కథ. ముగురన్నదమ్ముల కథ. ఇరువురన్నదమ్ముల కథ. ఒక సోదరుని కథ. ఈ “అయనం”లో మనకు ఎదురయ్యే పాత్రలేవి?

**1. సోదర చతుష్టయం :**

**రాముడు : ధర్మము – నీతి**

**లక్ష్మణుడు : అర్థం (రెండర్థాలలో)**

**శత్రుఘ్నుడు : కామము**

**భరతుడు : మోక్షము**

దర్మార్థ కామ మోక్షాలు : ఇవి చతుర్విద పురుషార్థాలు. మానవ జీవనాన్ని అర్థవంతం చేసుకొనడానికి సాధనాలు.

**2. సోదర త్రయం :**

**రావణుడు : రజోగుణం – అహంకారం**

**కుంభకర్ణుడు : తమోగుణం – అజ్ఞానము**

**విభీషణుడు : సత్త్వగుణం – జ్ఞానము**

జీవుడు త్రిగుణాత్మకమాయానిబద్ధుడు. ఈ మూడు గుణాలను పట్టి మనుష్యులు మూడు కోవలకు చెందుతారు.

**3. సోదర ద్వయం :**

**వాలి : అహమ్మన్యత**

**సుగ్రీవుడు : జీవాత్మ**

అహమ్మన్యత జీవాత్మను చీకటిలా వ్యాపిస్తుంది. 'నేను నేను' అనేవి రెండున్నాయి. 'మొదటి నేను' స్వార్థప్రేరితాహమన్యతను సూచిస్తుంది. 'రెండవ నేను' తన నన్నిటిలో, అన్నిటిలో తనను దర్శిస్తుంది.

**4. ఒక సోదరుడు : (అందరికి సోదరతుల్యుడు కనుక)**

**హనుమంతుడు : శ్రద్ధాభక్తుల దివ్యసమ్మేళనం**

**అంతిమ వాస్తవత : సీత పాతివ్రత్యధర్మానికి ప్రతీక. వాల్మీకి అపూర్వ సృష్టి.**

చీకటి శక్తుల్ని ఎదురించటానికి ఏ సిద్ధాంతాలూ, మూల్యాలు మానవునకు ఉపకరిస్తాయో అవి ఈ కావ్యంలో సమగ్రంగా ప్రతిపాదించబడినది.

ఇక విస్తృతవివేచనకు ఉపక్రమింతాము.

ధర్మార్థ కామ మోక్షములే జీవితానికి స్వరూపార్థ వైభవాన్ని ప్రదానం చేస్తాయి. ఆధ్యాత్మిక దృష్టిని సౌందర్య దృష్టిని ప్రసాదిస్తాయి. పరస్పర సహకారానికి మార్గదర్శక సూత్రాలను అందిస్తాయి. ధర్మమూ అర్థమూ ఒక జంట. అర్థాన్ని కాదనే ధర్మం, ధర్మాన్ని కాదనే అర్థం ఏ ప్రయోజనం చేకూర్చదు.

ధర్మంతో అర్థాన్ని సంయోగించినప్పుడే శ్రేష్ఠత్వం సిద్ధిస్తుంది. భౌతిక వస్తు సముపార్జనేచ్ఛయే కామం : చరమసత్యాన్ని దర్శించే కామనయే మోక్షం. కామమోక్ష సమన్వయంతోనే శ్రేయస్సు సంప్రాప్తిస్తుంది. కామమోక్షాలు ధర్మానికి అధీనమైయుండాలి.

ధర్మం అర్థానికి, కామానికి, మోక్షానికి పూర్ణత్వం ప్రదానం చేస్తుంది. ధర్మార్థకామమోక్షాలే పరమాత్మస్వరూపం. ధర్మం మానవజీవనానికి నాంది. మోక్షం చరమలక్ష్యం.

ధర్మాన్ని మోక్షంతో సంయోగించడానికి కామార్థాలే సాధనాలు. దర్మమూ సత్యమూ సీతారామ ద్వయం. రాముడు లేని జీవితం సీతకు దుఃఖమయమయితే, సీత లేని జీవితం రామునకు ఆధారరహితం.

రజోగుణం మనిషిని అతతాయిని చేస్తుంది. తమోగుణం గాఢాంధకారగహ్వరంలోకి దించుతుంది. సత్వగుణం జ్ఞానభాస్కరుని దర్శింప చేస్తుంది.

అతతాయిత్వానికి మరో పేరే ఆక్రమం: ఆక్రమం అజ్ఞానంతో చేతులు కలుపుతుంది. జ్ఞానానికి విరుద్ధంగా సమరానికి దిగుతుంది. ధర్మం నుండి సత్యాన్ని విడదీయడానికి చేయగల ప్రయత్నాలు చేస్తుంది.

అహంకారం జీవుణ్ణి సంపూర్ణంగా వ్యాపింప చూస్తుంది. జీవుడు అహంకారం పన్నిన వాగుర నుండి విముక్తి సాధించడానికి ధర్మాన్ని ఆశ్రయిస్తాడు. ధర్మం అహంకారాన్ని మట్టి కరిపించి జీవుణ్ణి వెలుగు వైపు పైకెత్తుతుంది. ధర్మప్రేరిపితమైన శ్రద్ధ ఆక్రమము అపహరించిన సత్యాన్ని తిరిగి చేజిక్కించుకోవడానికి అన్వేషణ సాగిస్తుంది.

ధర్మం అజ్ఞానాన్ని, ఆక్రమాన్ని నామరూపాలు లేకుండా చేసి సత్యాన్ని తిరిగి పునః ప్రతిష్ఠితం చేస్తుంది.

అక్రమమూ అజ్ఞానమూ కలిసి జంటగా ఏలిన ద్వీపం, జ్ఞాన సౌజన్యతలకు ఆశ్రయమైన ద్వీపంగా మారుతుంది.

సత్యనిబద్ధమైన ధర్మం ఏకాధిపత్యాన్ని సాధించి, అర్థకామమోక్షాలను సవ్యమార్గాన నడిపిస్తుంది.



సత్యనిరతులమై ధర్మార్థ కామమోక్షాలను సాధించాలి. ఆ కామకవృత్తిని, అహంకారాన్ని అజ్ఞానాన్ని విడనాడాలి. జ్ఞాన జన్యమైన శ్రద్ధాభావంతో కార్యరతులమై ఐహిక జీవనాన్ని సుసంపన్నం చేసుకోవాలి.

# 31. మహాభారతం

**(అంతర్మథనం నుండి అవబోధన వైపు ఓ ప్రవాసగాథ)**

**మా**నవసాంస్కృతేతిహాసంలో మహాభారాతాన్ని మించిన మరో కావ్యం లేదు. లక్షశ్లోకాలు కలిగి పదునెనిమిది పర్వాలుగా విభక్తమైన ఇది ఒక బృహత్కావ్యము. దీని స్రష్ట క్రాంత దర్శియైన వేదవ్యాస మహర్షి సమస్త మానవ జాతిని మహనీయత వైపు నడిపించే లక్ష్యంతో యావత్ప్రపంచానికి రచించి దీనిని కృష్ణద్వైపాయనవ్యాసులు భారతదేశానికి అద్వితీయమైన ఉపాయనంగా అనుగ్రహించారు.

మహాభారతం కేవలం మహాకావ్యం కాదు. నన్నయగారు చెప్పిన దానిని, సందర్భాలు మారిన దృష్ట్యా పునర్నిర్వచించాలంటే, ఇది ఒక ధర్మ సంహిత. ప్రవర్తనా నియమావళిపై ఒక సిద్ధాంత గ్రంథము. వివిధరంగాల్లో నేతృత్వం అనుసరించాల్సిన వ్యూహాల్ని నిర్దేశించే విశ్వకోశం. వ్యవస్థాపకీయ, ప్రశాసకీయ సూత్రగ్రంథం, షడ్దర్శనసముచ్చయం. వేదోపనిషత్తుల అధ్యయనానికి పథప్రదర్శిని యైన శబ్దసూచి. ఇది పంచరత్నాలు భద్రపరుచబడిన సువర్ణపేటిక : ఈ పంచరత్నములు 1. భగవద్గీత, 2. విదురనీతి, 3. శివసహస్రనామములు, 4. విష్ణుసహస్రనామములు, 5. అనుగీత (భగవద్గీతకు అనుబంధ గ్రంధము)

దీని ఇతివృత్తము బహు క్లిష్టమైనది. ఈ మహాకావ్యాలలో మానవమూల్యాల్ని పరిశీలిద్దాం.

<u>సకారత్మక విలువలు :</u>

<u>పాండవులు :</u>

| | |
|---|---|
| **ధర్మము** | **: యుధిష్ఠిరుడు - ఆర్జీవానికి ప్రతీక** |
| **ఊర్ణ** | **: భీముడు - అరిభయంకరుడు** |
| **ఉత్కృష్టత** | **: అర్జునుడు - ధనుర్విద్యావినీతుడు** |
| **అర్థము** | **: నకులుడు - అక్లిష్టకర్ముడు.** |
| **పర్యావరణము** | **: సహదేవుడు - కృషిపశుపాలనాప్రవీణుడు** |
| **కార్యసాధన** | **: ఘటోత్కచుడు** |
| **ప్రభావము** | **: అభిమన్యుడు** |
| **శుచి** | **: పాండురాజ - ఐదుగురికి తండ్రి ఇంద్రియవశి)** |
| **బుద్ధి** | **: కృష్ణుడు - స్థితప్రజ్ఞుడు** |
| **సమ్యగ్దృష్టి** | **: ద్రౌపది - పాండవపత్ని** |

నకారాత్మక విలువలు :

కౌరవులు :

అహంకారము : దుర్యోధనుడు

క్రోదము : అశ్వత్థామ

ఉదాసీనత : కర్ణుడు

కౌటిల్యము : శకుని

అంధత్వం : ధృతరాష్ట్రుడు

అనవలోకనం : గాంధారి

కౌరవశతము : వంద కోరికలు

ధర్మము – ఊర్జ – ఉత్కృష్టత – అర్ధము – పర్యావరణము ఇవి ముఖ్యమైన మూల్యములు ఈ ఐదు మూల్యాల అనుసరణం మానవుని అభ్యున్నతికి చేర్చుతుంది. అయితే వీటిలో సమన్వయం సాధించి కార్యోన్ముఖులై పురోగమించడానికి సమ్యగ్దృష్టి అపరిహార్యమైనది. శుచి సౌందర్యాల సమ్మేళన నుంచే ధర్మం ప్రాదుర్భవిస్తుంది. ధర్మాన్ని జ్ఞానం నడిపించాలి.

ఇక నకారాత్మక మూల్యాల్ని అనుసరించటవల్ల సంభవించే విపరీత పరిణామాలు. అహంకారంలో అతిశయితో పాటు లెక్కలేనన్ని కోరికలు చోటు చేసుకుటాయి. ఆపైన అహంకారం క్రోధానికి ఆధీనమౌతుంది. అంధత్వానవలోకనం నుండి అహంకారం పుడుతుంది. ఈ మహాకావ్యంలో "సంఘర్షణ" మూడు స్తరాలలో మనకు గోచరమౌతుంది.

భౌతికస్తరంలో, ధర్మానికి అహమ్మన్యతకు మధ్య. మానసికస్తరంలో, కర్తవ్యానికి అంధత్వానవలోకనాజనితమైన వ్యామోహానికి మధ్య. బౌద్ధికస్తరంలో, ధర్మానికీ కౌటిల్యతకూ మధ్య. అహంకారం సర్వపదార్థాలకు క్షుద్రత్వమాపాదిస్తుంది, అవమానిస్తుంది. ధర్మంతో సమరానికి దిగుతుంది. అతిశయిత అహంకారానికి అడ్డంగా నిలచి సమ్యగ్దృష్టిని హీన పరుస్తుంది. వేటు తిన్న అహంకారం నుండి క్రోధం ఉద్భవిస్తుంది. సమాజబాహ్యమైన ఉదాసీనత ధర్మం వైపు విముఖత చూపుతుంది. ధర్మాన్ని నిరాకరిస్తుంది. – సమ్యగ్దృష్టిని గౌణంగా చూస్తుంది. యుగాల వైచారికమంథనం నుండి అనుభవాలనుండి మానవతకు సంప్రాప్తమైన జ్ఞానాన్ని విస్మరిస్తుంది.

అంధత్వం ధర్మం యెడ విముఖత వహించి ఋతాన్ని స్వీకరించదు. అంధత్వం, అనవలోకనం అహంకారాన్ని నియంత్రించడానికి బదులు అహంకారినికే పూర్తిగా లోబడుతాయి.

అహంకారం, అతిశయిత, సమాజబాహ్యామైన ఉదాసీనత, కౌటిల్యములు ఏకమై ధర్మాన్ని నేలమట్టం చేసే కుతంత్రానికి పూనుకుంటాయి. ధర్మానికి అహంకారానికి మధ్య నిరంతరం జరిగే సంఘర్షణలో కౌటిల్యం పన్నే ఊహాలను ప్రభావహీనం చేస్తుంది.

అంధత్వానికి ప్రతిరూపమైన అజ్ఞానాన్ని పటాపంచలు చేస్తుంది. క్రోధం హద్దు మీరడాన్ని నిషేధిస్తుంది. ఉదాసీనతను సమూలంగా పెరికి వేస్తుంది. కోరికల పరువుకు కళ్ళెం వేస్తుంది.



జ్ఞానం ధర్మానికి విద్యాకౌశల్యాలను ప్రదానం చేసి అతిదక్షతతో సవ్యమార్గం మీద నడిపిస్తుంది. జ్ఞానం ధర్మాధిష్ఠితమూల్యాలకు వ్యాప్తి నిస్తుంది. ఊర్జను కల్యాణోన్ముఖం కావిస్తుంది. ఉత్కృష్టతను దేదీప్యమానం చేస్తుంది. పర్యావరణానికి అహితం కాని అర్థవ్యవస్థకు ప్రేరణా ప్రోతస్సుగా నిలుస్తుంది. కార్యక్షమతతో ప్రగాఢస్నేహానుబంధ మేర్పర్చుకొని ధర్మానికి విజయం చేకూర్చుతుంది. జ్ఞానం సమ్యగ్దృష్టికి అభేద్యమైన రక్షణకవచం, సౌందర్యానికి శుచితకు సమీప – ఈ రెంటినీ చెక్కు చెదరనీయకుండా జాగరూకత వహిస్తుంది.

త్రికాలాబాధితమైన విద్యకు జ్ఞానమే మూలం. జ్ఞానం విద్యను లోకకళ్యాణ పథంలో ప్రవర్తింప చేస్తుంది.

దృష్టికి రెండు పార్శ్వములు : శుచితాసౌందర్యాలు ఒకవైపు, అంధత్వానవలోకనం రెండవ వైపు. దృష్టి చీకటివెలుగులను రెంటినీ చూస్తుంది. వెలుగు వైపు ప్రస్థానం చేయడానికి విశ్వానికి ప్రేరణనిస్తుంది.

ధర్మం గెలువడానికి జ్ఞానమే ఏకైక సాధనం. ఐశ్వర్యానికి, వృద్ధికి ఆధారం జ్ఞానమే. దృష్టి ప్రపంచానికి జ్ఞానభిక్షపెడుతుంది. దృష్టిజ్ఞానాలలో ద్వైతం లేదు.

ఇదే వ్యాసవిరచితమహాభారతాంతర్గతబృహత్కథ.

ధర్మం - ఊర్జ - ఉత్కృష్టత - అర్థం పర్యావరణం
ఇవి అయిదు జ్ఞానానికి సాధనాలు.



## కథా రచయిత గురించి....

శ్రీ గట్టు నారాయణ అనేక కంపనీలకు అధ్యక్షులుగా, డైరెక్టరుగా పదవులన లంకరించారు. ఇంజనీరింగ్ ఆపరేషన్ష్, జనరల్ మ్యానేజ్‌మెంట్‌లో, ముప్పది యైదు సంవత్సరాల అనుభవం.

సంప్రతి : ఎక్సెల్ ఇం. లిమిటెడ్ అధ్యక్షులు.

ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్‌లో పట్టభద్రులు, మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో స్నాతకోత్తర పదవి.

బహు గ్రంధకర్త. వ్యవస్థాపన, భగవద్గీత, ఉపనిషత్తులపై తెలుగులో, ఆంగ్లంలో రచనలు చేశారు.

నానాదేశ సందర్శనం. విజన్-2000 వాషింగ్‌టన్ చికాగోకు ఆహ్వానితులు. 1893లో స్వామి వివేకానంద ఉపన్యాసానికి సంస్మరణగా ఏర్పాటయిన సమావేశంలో (చికాగో 1993) ఉపన్యాసం. మేనేజ్‌మెంటుపై ఉపన్యాసాలు. విద్యాలయాలకు, జీర్ణమందిరోద్ధరణకు, దేవాలయ నిర్మాణానికి, కవులకూ, వేదాధ్యయనపరులకూ చేయూత నిచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌లోని మంథనిలో కీ.శే. గట్టు సీతమ్మ - రామన్న గార్లకు ద్వితీయునిగా జన్మం. తన గ్రామాన్ని వెలుగులోకి తెచ్చేందుకు చేయూతనిస్తూ, కార్యభారాన్ని శ్రీ సువర్ణ లక్ష్మణ్‌రావు, డా॥ దుద్దిళ్ళ ఆనంద్‌రావు, మురళీధర్ శర్మలకు అప్పగించారు.

వాస్తవ్యం బరోడాలో వీరి సతీమణి శ్రీమతి సృజనాదేవి. ఒక కుమారుడు ఇద్దరు కుమార్తెలు వీరి సంతానం.